


వ్యవస్థాపకులు

**శ్రీ బి.ఎన్.శాస్త్రి**


సంపుటి : 24 సంచిక : 6

ఏప్రిల్ - 2021

'ప్లవ' చైత్రమాసం

**సంపాదకులు**

**సాగి కమలాకర శర్మ**

**Printed and Published by**

B. Anantha Laxmi

***Type Setting at :***

**Kavyasree Graphics**

**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**

**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**

**సంవత్సర చందా : 200/-**

**శాశ్వత సభ్యత్వం : 2500/-**

**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

**వివరాలకు : మేనేజర్, మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013**

**ఫోన్ : 9347971177**

**email : editormusi@gmail.com**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER

**ISSN 2457-0796**




# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక**

**చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక**

## ఈ సంచికలో ...

### వ్యాసాలు


మూసీ సాహిత్య ధార 6

జాషువా కవిత్వము - రసచర్చ ... టి. శ్రీవల్లీ రాధిక 7

పాదముద్రలు (తెలంగాణ కథకుల పరిచయం)... బి.వి.ఎన్.స్వామి 13

మరుగుపడిన మాణిక్యం చెన్నకృష్ణమరాజు ... పెబ్బేటి మల్లికార్జున్ 17

భాషా తరగతి గది - నిర్వహణ వ్యూహాలు ... ఆచార్య వై. రెడ్డి శ్యామల 19

పద్య మనోహరం -19 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 22

గ్రంథాంతరంగం 2 - ఆంధ్ర కవిత్వ చరిత్రము ... శ్రీ ఘట్టమరాజు 23

ఈగ బుచ్చిదాసు సాహిత్యం - సమగ్ర పరిశీలన ... మంత్రి శ్రీనివాస్ 27

మూసీ పదవినోదం - 28 ... డా. తాడేపల్లి పతంజలి 30

సామాజిక మాధ్యమ వేదికగా కొత్తపుంతలు తొక్కుతున్న పద్యకవితా ప్రక్రియ ... గడ్డం సత్యపాల్ రెడ్డి 33

మహానేత-భారతజాతికి రాజకీయ స్ఫూర్తి ప్రదాత ... డా. వొజ్జల శరత్ బాబు 37

పాలమూరు కవితావతంసులు ... కె. మారెప్ప 41

కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 12 ... టి. లక్ష్మీనారాయణ 45

మల్యాల వంశ శాసనాలు - చారిత్రక విశ్లేషణ ... డా. పాత అశోక్ 51

శాసనముల ద్వారా తెలుగు భాషా పరిణామము ... కీ.శే. బి.ఎన్.శాస్త్రి 55


### కవితలు


ఉగాది శుభవాచకము ...అన్నమరాజు ప్రభాకర రావు - 5; తుకారాం అభంగం... మంత్రి శ్రీనివాస్ - 6; శ్రీరామ పంచకము - కొనింటి రమేశ్ - 11; ఓ భూమి పుత్రుడా! ... పులుమద్ది సత్యనారాయణ-12; రాజీపడ్డ కవి ... పొన్నగంటి ప్రభాకర్ - 22; ఆమె కన్నీటి చుక్కలు ... పి. హంసమ్మ - 35; కవిత్వం - వల్లభాపురం జనార్దన - 36; వసంత కోయిల ... ఎస్.ఆర్.పృథ్వి - 36; నవాబ్దమా! నమో!! ... వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు - 40; ఉగాది గీతం ... కొలనుపాక మురళీధర రావు - 40; కార్బన్ వీధుల్లో ... అశోక్ దుర్గం - 62; నిన్ను నిన్నుగానే చూస్తాం ... జినుకుల వెంకటేశ్ - 62; ఏమివ్వగలను ... అనిత దావాత్ - 62;


### సమీక్షలు


తీరం చేరని కెరటము (నవల) ... వల్లంపట్ల గిరీశ్ కుమార్ 31

వెలకట్టలేని ముత్యాలు "నిజాలు - నైజాలు" ... డా. రంగి కమల 54

దోమల భిక్షపతి 'సినారె శతకము' అంతరంగం ... రాజారాం నాయక్ 57

అలంపురం సీమ - సంస్కృతాంధ్ర సాహిత్యములు ... డా. వీపూరి వెంకటేశ్వర్లు 59

స్వీకృతి ... 61


**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**


*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.

*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.


*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.

*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి


దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





# తోడు

లోకంలో అందరం తోడు కావాలని కోరుకుంటాం. అన్ని వయస్సుల్లోనూ, అన్ని వర్గాల వారు తోడును కోరుకుంటూనే ఉంటారు. జీవుల్లోనూ ఇదే భావన కనిపిస్తుంది. ప్రకృతిలోనూ, కాలం లోనూ కూడా తోడు కోసం చేసే ప్రయత్నం కనిపిస్తుంది. అణువులు కూడా తోడు కోసం చేసే ప్రయత్నం వల్లనే పదార్థాలు ఏర్పడటం, మారడం జరుగుతుంది. పగటికి రాత్రి, శుక్లపక్షానికి కృష్ణ పక్షం, ఉత్తరాయణానికి దక్షిణాయనం వంటివి కూడా తోడుగా ఉండే అంశాలే. నీటిని బావిలో నుండి తోడుకొని తీసుకుంటాం. పాలకు చల్లను తోడు చేసి పెరుగుగా మారుస్తున్నాం.

పుట్టిన పిల్లవానికి తల్లితోడు మొదలవుతుంది. తర్వాత వస్తువులు తోడు... క్రమంగా స్నేహితులు తోడు అవుతారు. యవ్వనంలో స్త్రీలకు పురుషులు, పురుషులకు స్త్రీలుగా మారుతారు. తర్వాత సంతానం తోడుగా మారుతారు. ఇంకా.. ఉద్యోగాదులు, గృహాలు, కార్లు వంటి వస్తువులు, రూప సంపదలు తోడు అవుతాయి. పరిణతి పొందినవాడు గురువును తోడు చేసుకుంటాడు. తమ మార్గాలను తాము అన్వేషించడానికి ఒక మంత్రాన్ని, ధ్యానాన్ని తోడు చేసుకుంటాడు. చిట్టచివరకు తనతో మొదటి నుండి కలిసి ఉన్న తోడును తెలుసుకుంటాడు. అదే తనలోని చైతన్యం. దానిని తోడు చేసుకోవడానికి అనేక మార్గాలను అన్వేషించి సాధన చేసి దానిని చేరుకునే ప్రయత్నం చేస్తూనే ఉంటాడు. తనతో పాటు ఉన్న తోడును తాను తెలుసుకోవడానికి, తనలోని చైతన్యాన్ని తాను అధ్యయనం చేయడానికి జీవితకాలం పట్టే అవకాశం ఉంటుంది.

మన చుట్టూ వందల మంది కనిపిస్తే మనకు బలం. మన శరీరం శక్తివంతమై ఉంటే మనకు గర్వం. మనతో భార్యా/భర్తా పిల్లలు ఉంటే మనం పూర్ణం. మన ఉద్యోగాదులు మనకు ఉంటే మనకు విజయం. మనతో ఆస్తిపాస్తులు తోడుంటే మనకు అహంకారం. మన మాటవినే సేవకులు చాలామంది తోడుంటే అది రాజసం. నిజమే... ఇవన్నీ ఉన్నాయని అనుకున్నప్పుడు వచ్చే గుణాలు ఇవి. ఇవన్నీ మనకు లేవు అన్నా... ఉండీ ఉపయోగం లేదు అని తెలిసినా ... మన పరిస్థితి ఎంత దయనీయం? అన్నీ ఉన్నాయి అనుకుంటూ... చుట్టూ భౌతికమైన కండ్లకు కనిపించే భౌతిక పదార్థాల చుట్టూ జీవితం గడిచిపోతూ వచ్చింది. కాని, దానిని దాటి వీటన్నింటికీ ఆధారభూతమై, సూక్ష్మీకృతమై, అణురూపమై ఉన్న చైతన్యాన్ని దర్శించగలిగినప్పుడు ఇంకెంత ఆనందంగా, ధైర్యంగా మనం మెలగుతాం?? మనలోనే, మనతోనే ఉన్న ఆ తోడును మనం ఎందుకు గమనించలేక పోతున్నాం. ప్రయాణం అంతర్ముఖం కానంతవరకు ఇంతే. కనిపించేవి, కని పెంచే వాని చుట్టూ తిరిగి ఈ శరీరం పతనమౌతూనే ఉంది.

జీవితమంతా తోడుకోసమే తపిస్తున్నాం. తోడు తమతోనే ఉన్నదనే భావం అర్థం కావటం లేదు. ప్రస్తుత కాలం పైన చెప్పిన తోడుల కన్నా లోకం అందరితోనూ భావ ప్రసారాలకు చేతిలోని సెల్‌ఫోన్ తోడు అయింది. దానిలోని వేరు వేరు ప్రోగ్రామ్స్ తోడుగా మారాయి. కొందరికి టెలివిజన్ తోడు అయింది. వేరు వేరు మాధ్యమాలలో వచ్చే వేరు వేరు కార్యక్రమాలు తోడుగా మారిపోయాయి. వాటిని చూసి ఆనందించేవాడు ఎవడో, వాని చుట్టూ మనం తిరగడం మాత్రం పూర్తిగా తగ్గిపోయింది. కంటికి కనిపించే వ్యవహారాల చుట్టూ ఉండే వాడు తాత్కాలికమైన జీవితాన్ని గడిపి మరణిస్తాడు. సాధారణ దృష్టికి అతీతమై, సూక్ష్మమైన రూపాన్ని తోడుచేసుకున్న వాడు, శక్తితోడుగా జీవితం గడిపేవాడు శాశ్వతుడౌతాడు. ఈ లోకానికి మార్గదర్శకుడౌతాడు. తన యోగదానంతో ప్రపంచాన్ని మేల్కొల్పుతాడు. మహనీయుడౌతాడు.

# ఉగాది శుభవాచకము

తే.గీ. చేయరాని పనులు చేసి, చెడును మరిగి,
నియమితాహారమును మాని, నిత్యమొక్క
చిత్రగతి బూని, యున్మత్త చేష్టలెల్ల
చేయుజనులైతి రియ్యెడ శిశులు, పశులు

కం. పరిపరి నిర్లక్ష్యంబే
కరోన యుత్పత్తి కారకమని యెఱిగియున్
తఱచుగ జనులు తెగింతురు
బరి, వీరలనేమనవలె, పరిభాషేదీ?

తే.గీ. మానవకృత దోషంబులు మనకు దెచ్చె
మారకమగు కరోనాను, కోరి మనము
పెంచుచుంటి మద్దానిని ప్రీతితోడ
జాగ్రతలు వీడి, నిర్లక్ష్య సత్త్వులమయి

తే.గీ. అయిన, "ప్లవ" యన "దాటుట" యందురు గద,
నూతనాబ్ది యెంతైనను నొప్పి మాన్పు
గాక, పరమేశు కరుణయు నేకరీతి
కురియు గాకిల, ప్రజలును మెరయుచుంద్రు
గాక నిరతము నానంద గరిమ తోడ


తే.గీ. చైత్రుడు మరల క్రొత్తవస్త్రంబు దాల్చి
మధుర మాకందఫలములు మనకు నిడుచు
ముదము గూర్చు నెపంబున ముచ్చట పడి
విమలమతియై యవతరించు వేడ్క మీర

---

**అన్నమరాజు ప్రభాకర రావు**
హైదరాబాదు
ఫోన్ : 94402 58292









# మూసీ సాహిత్య ధార - 30

## 'సాహితీ వనరులు - వినియోగం - పరిధి, పరిమితి'


'మూసీ సాహిత్య ధార' నిరంతర పరిశోధనా ప్రవంతి 30వ సమావేశంలో భాగంగా **'సాహితీ వనరులు - వినియోగం - పరిధి, పరిమితి'** అనే అంశంపై ప్రముఖ సాహితీవేత్త, సంపాదకులు **శ్రీ సంగిశెట్టి శ్రీనివాస్** ప్రధాన ప్రసంగం చేసారు. వీరు మాట్లాడుతూ సాహిత్య సమాచార సేకరణకు ఉపయోగపడే గ్రంథసూచీలు, వ్యాససూచికలు, పత్రికా, కథా సూచికలు, కోశాలు, అంతర్జాల వెబ్‌సైట్‌లను గురించి తెలుపి, వాటి సేవలను కొనియాడారు.


ఈ వేదికలో భాగంగా స్వీయ పరిశోధనాంశం **'ఈగ బుచ్చిదాసు సాహిత్యం - సమగ్ర పరిశీలన'**పై పరిశోధక విద్యార్థి మంత్రి శ్రీనివాస్ ప్రసంగించారు. అనంతరం మనోహరిబాయి రాసిన **'తీరం చేరని కెరటం'**అనేనవలపై వల్లంపట్ల గిరీష్ కుమార్ సమీక్షించారు. కవితాగానంలో భాగంగా పులుమద్ది సత్యనారాయణ **'ఓ భూమి పుత్రుడా!'**, పి. హంసమ్మ **'ఆమె కన్నీటి చుక్కలు'** అనే కవితలను గానం చేసారు. ఈ సమావేశాన్ని తెలుగుశాఖ ఆచార్యులు డా.ఎస్. రఘు, డా. సాగి కమలాకర శర్మలు పర్యవేక్షించి, సమీక్షించారు.









## తుకారాం అభంగం

ప్రహ్లాదుని కారణంగా
నృసింహుడవైనావు
అతడు చెప్పుమాటలకు
సత్య రూప మిచ్చావు

రామకృష్ణ గోవిందా
నారాయణా హరి
భక్తరాజు బృందము
నీ రాజద్వారం నిలిచింది

విఠల మాధవా హరి
ముకుందా కేశవా
అణిచినావు నీవే
రాక్షస మదహంకారము

తుకా పలుకె భక్త సుగుణము
కారణమున వాక్కు సత్యమవ్వును




**అనువాదం : మంత్రి శ్రీనివాస్**
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉ.వి.,
ఫోన్ : 83283 33720

# జాషువా కవిత్వము – రసచర్చ

**టి. శ్రీవల్లీ రాధిక,** ఫోన్ : 901 420 6412



జాషువా కవిత్వంలో ప్రధానంగా కనబడే రసభావాలేమిటన్న విషయాన్ని ప్రసిద్ధ విమర్శకులు జివిఎస్, సినారెలు తమ విమర్శా వ్యాసాలలో చర్చించారు. కొత్త ప్రతిపాదనలనూ చేశారు. వారి అభిప్రాయాలను, ప్రతిపాదనలను ఈ వ్యాసంలో క్లుప్తంగా పరిచయం చేసి, వాటిలోని ఔచిత్యానౌచిత్యాలను జాషువా కవిత్వం ఆధారంగా పరిశీలించాలనుకుంటున్నాను.

జివి సుబ్రహ్మణ్యం గారు జాషువా కవిత్వంపై మూడు నాలుగు వ్యాసాలు వ్రాశారు. వాటిలో ఆయన జాషువా కావ్యాలు విలక్షణమైన వని పేర్కొని ఆ కావ్యాలలో ఉన్న విలక్షణతకు ఒక పేరు పెట్టవలసి వస్తే అది భావోద్వేగం కంటే భిన్నమైనది రసానుభవం కంటే తక్కువైనదీ అయి ఉండాలనీ, కాబట్టి దానిని విషాద గంభీరానుభూతి అనవచ్చు ననీ చెప్పారు.

అసలు విషాద గంభీరభావం అంటే ఏమిటన్న విషయాన్ని వివరిస్తూ – **"జాషువా గారు పఠితకు కరుణం ద్వారా వర్ణ్య వస్తువు మీద సానుభూతి కలిగించి కెథార్సిస్ లాంటి అనుభవాన్ని కలిగిస్తారు. సానుభూతి ద్వారా ఒక విధమైన మానసికోద్వేగ ప్రక్షాళనకు తోడ్పడే పద్ధతి జాషువా ఖండకావ్యాలలోనూ లఘుకావ్యాలలోనూ అంతర్లీనంగా తొణికిసలాడుతుంది. దీనిని విషాద గంభీర భావం అని అనవచ్చు"** అన్నారు.

మరొక ప్రసిద్ధ విమర్శకులు సి. నారాయణరెడ్డిగారు కూడా జాషువా కవిత్వంలోని ప్రధాన రసం ఏమిటి అన్న చర్చ చేశారు. "జాషువా కవితావ్యక్తిత్వం" అనే వ్యాసంలో సినారె **"ఇతడు ప్రధానంగా కరుణ రసాన్నీ అప్పుడప్పుడు హాస్యరసాన్నీ పోషించినా, శృంగార రసాన్ని స్పృశించకపోలేదు"** అంటారు. "ముంతాజ్ మహల్"లో సంయోగ వియోగశృంగారాన్ని జాషువా ఎలా చిత్రించారో వివరిస్తారు.

ఆ వ్యాసంలో సినారె జాషువా కవిత్వం గురించి చెప్తూ **"స్థూలంగా చూస్తే జాషువా రచనల్లో కరుణం అంగిరసంగా, వీరం అంగరసాల్లో ఒకటిగా భాసిస్తాయి"** అంటారు. జాషువా పద్యాలలో కరుణానికి సంచారి భావాలైన దైన్యం, జడత, గ్లాని, నిర్వేదం మొదలైన వాటితో పాటు వీరరసానికి సంచారి భావాలైన అమర్షం, క్రోధం, వితర్కం వంటివీ ఏకకాలంలో కనిపిస్తాయని అంటారు. అలాగే పూర్వ అలంకారికులు చెప్పిన వీరస భేదాలకు అదనంగా **"కరుణవీరం"** అనే వీరరసభేదాన్ని తాను ప్రతిపాదించడానికి జాషువా కవిత్వం స్ఫూర్తిని కలిగించిందని అంటారు.

జీవిఎస్ సినారెల ప్రతిపాదనలలోని సమంజసత్వాన్ని పరిశీలిస్తూ జాషువా కవిత్వాన్ని చదివినపుడు నాకు కలిగిన కొన్ని అభిప్రాయాలను ఇపుడు ప్రస్తావిస్తాను.

జాషువా కవిత్వాన్ని గురించి చెప్పేటపుడు విషాదాన్ని ప్రధానంగా చూపాలన్న ఒకానొక అభిప్రాయం సాహితీ లోకంలో స్థిరపడినట్లుగా కనిపిస్తుంది. బహుశా ఆయన కవిత్వం ద్వేషంతో కూడినది కాదనీ ప్రేమతో కూడినదనీ చెప్పే ప్రయతంలో **"ఆవేదనే కానీ ఆవేశం కాదు"** అనే మాట పదేపదే వాడబడినదనీ దానిని అనుసరించి విషాదం, కరుణము వంటి మాటలు వచ్చి చేరాయనీ అనిపిస్తుంది.

అయితే ఒక సాధారణ అర్థంలో ఈ మాటలు వాడడం వేరు. రసానికి సంబంధించిన విశ్లేషణలలో వాడడం వేరు. ఉదాహరణకు జాషువా కవిత్వాన్ని అధ్యయనం చేసిన ఎండ్లూరి సుధాకర్ గారు జాషువా **"దళితులకు జరిగిన అన్యాయాలను అత్యంత కరుణ రసార్ద్రంగా చిత్రీకరించాడు"** అన్నపుడు అక్కడ వారు కరుణ రసార్ద్రం అనే మాటను వాడినప్పటికీ అది అలంకారిక పరిభాషను దృష్టిలో పెట్టుకుని కాక వ్యవహార ధోరణిలో వాడినదని అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే అక్కడ వారి లక్ష్యం దళిత సమస్యలని జాషువా కవిత్వం ఎంత బాగా చిత్రించిందో చెప్పడమే కానీ నవరసాలలో అది ఏ రసానికి చెందుతుంది అన్న విశ్లేషణ చేయడం కాదు.

కానీ రస సంబంధమైన చర్చా నిర్ణయమూ చేయవలసి వచ్చినపుడు ఇంకొంచెం సూక్ష్మంగా చూడాలి. అలా చూసినపుడు శోకం స్థాయిభావం అవడానికి అవకాశముండే ధోరణిలో జాషువా కవిత్వం సాగలేదని అనిపిస్తుంది.

నిజానికి కరుణం అంగిగా వీరం అంగంగా కనిపిస్తుందన్న మాట చెప్తూ సినారె కూడా **"స్థూలంగా చూసినపుడు"** అన్నారు. అవును జాషువా కవిత్వంలోని వస్తువును మాత్రమే దృష్టిలో పెట్టుకుని వ్యాఖానించినపుడు – అది కూడా కొన్ని కవితా ఖండికల విషయంలో మాత్రమే – విషాదం అన్న మాట వచ్చే అవకాశం ఉంటుంది కానీ, జాషువా కవిత్వం లోపలికీ లోతుల్లోకీ వెళ్ళి అది నడిచిన తీరుని పరిశీలిస్తే విషాదం అన్న లక్షణం జాషువా కవిత్వానికి అసలు పొసగదని అనిపిస్తుంది.

జాషువా కవిత్వంలో కరుణరస స్థాయిభావమైన శోకం కన్నా శాంతరస స్థాయిభావమైన తత్త్వజ్ఞానం ప్రధానంగా కనిపిస్తుందని నాకు అనిపించింది. నిజానికి నిర్వేదం అనే భావం ప్రధానంగా కనిపిస్తుందన్న మాటను సినారె కూడా చెప్పారు. అయితే వారు నిర్వేదాన్ని శోకానికి సంచారీ భావంగా చెప్పారు. నాకు మాత్రం అది తత్త్వజ్ఞానంతో కూడిన నిర్వేదంగా కనిపించింది.

అంతేకాదు, అలంకార శాస్త్ర సిద్ధాంతాల ప్రకారం జాషువా కవిత్వాన్ని కరుణంగా పరిగణించడానికి అవకాశం లేని ఒక ముఖ్య లక్షణం జాషువా కవిత్వంలో ఉంది. ఆయన కవిత్వం కరుణకు అర్హులు కాని దుర్యోధనుడి గురించీ గజనీ మహమదు గురించీ కూడా సౌమ్యంగా పలుకుతుంది. రాజరాజు అనే ఖండికలో **"వృథా అపయశముం దలదాల్చిన నీకు నేడు నిందాయువుం బోసినారు కవులక్కట! పెందొడలూడి, కుంటివై ఈ అవమాన జీవితము నెట్లు సహింతువయా! సుయోధనా!"** అంటారు. ఇలా కవిత అంతా దుర్యోధనుడిపై సానుభూతి కురిసే పదాలతో ఉంటుంది. అలాగని మళ్ళీ అతడి దుశ్చర్యలనేమీ సమర్థించదు.

ఈ రీతిలో సాగిన కవిత్వం అయితే శాంతం అవాలి లేదంటే కరుణరస అభాస అవాలి కానీ కరుణము కాలేదు కదా!

నిజం చెప్పాలంటే, జాషువా విషాదాన్ని పెంచే ప్రయత్నం చేసి శోకాన్ని స్థాయిభావం చేయడానికి బదులుగా అందుకు వ్యతిరేకంగా తన కవిత్వాన్ని నడుపుతారని అనిపిస్తుంది. విషాదాన్ని బాగా పోషించగలిగిన సందర్భాలలో కూడా దాన్ని క్లుప్తంగా చెప్పి తత్త్వజ్ఞానం వైపు పాఠకులను మళ్ళించడం జాషువా కవిత్వమంతటా కనిపిస్తుంది.

మొదటగా పిరదౌసి కావ్యాన్ని తీసుకుంటే, ఈ కావ్యంలో పిరదౌసి విషాదాన్ని జాషువా ఎంత ప్రముఖంగా చూపించారు అని పరిశీలిస్తే, ఇందులో మొట్టమొదట వచ్చే విషాదానుకూలమైన సంఘటన మాటతప్పిన రాజు బంగారు నాణేలకు బదులుగా వెండి నాణేలు పంపడం.

అక్కడ వచ్చే మొట్టమొదటి పద్యం :

**"ఎన్నో కొండలు గుండెలోఁ గరఁగిపోయెన్ వార్ధి సంతానముల్**
**గన్నీరయ్యె, సమస్తలోకము నిరాకారస్థితిం బొల్చె, ను**
**త్పన్నంబయ్యె విషాద మేఘపటలధ్వాంతౌఘ, మాశాలతల్**
**సున్నాలయ్యె నగాథ కూప జలరాసుల్ దోచె పిర్దౌసికిన్"**

ఇది మొదటి పద్యమే కాదు, పిరదౌసి విషాదాన్ని చెప్పే ఒకే ఒక్క పద్యం కూడా. అయితే ఈ పద్యం కూడా అచ్చగా అతని దుఃఖాన్ని మాత్రమే కాక ఆశాభంగాన్ని కూడా కలిపి చెప్తుంది. అంటే ఒక్క పద్యంలో కూడా పూర్తిగా పిరదౌసి దుఃఖాన్ని వర్ణించలేదు జాషువా. ఈ పద్యానికి కవి ఎన్నుకున్న ఛందస్సు కరుణరసమునకు సరిపడని శార్దూల వృత్తమనే విషయాన్ని కూడా గమనించాలి.

ఇక దీని తర్వాత వచ్చే పద్యంలో ధనాన్ని తిప్పిపంపడం ఉంటుంది. అదొక చిన్న గీత పద్యం. అందులో కూడా దుఃఖం, నిరాశ అన్న రెండు మాటలూ వస్తాయి. ఆ తర్వాత వచ్చే ఎనిమిది పద్యాలూ కవి పలుకులు. వీటిలో దైన్యం కన్నా నిరాశా, నిష్ఠూరము, నిర్వేదము, నిందా ఎక్కువగా ధ్వనిస్తాయి.

అటుపైన రాజు పిరదౌసిని చంపమని ఆజ్ఞాపించాడన్న వార్త వస్తుంది. అక్కడ **"సర్వము నాలకింపగా పిరదౌసీ ముఖాబ్జమున పిన్నని నవ్వుదయించె"** అంటారు జాషువా. అప్పటివరకూ జరిగిన కథతో ఒకవేళ పాఠకులలో విషాదమేదైనా మొలకెత్తబోతూ ఉంటే దానిని ఇక్కడ ఈ **"పిన్నని నవ్వుదయించె"** అన్న మాటతో త్రుంచేస్తారు జాషువా.

ఇక ఆ తర్వాత కవి అడవిలో ప్రయాణించడం మొదలవగానే వచ్చే పదాలన్నీ విషాదాన్ని నిర్మించడానికి వ్యతిరిక్తంగానే ఉంటాయి. కవి కుటుంబిని కరుణించి కాఱుమెయిలు తేలిపోతుంది. అనంతకోటి తారకలు పకపక నవ్వుచు నభము పట్టున కనిపిస్తాయి. ఆ కవి కుటునంబాన్ని అరసి జగద్గురుండు తారకాదివ్యపద్మ నేత్రములు విచ్చి కాచి రక్షిస్తుంటాడు.

ఇక అక్కడినుంచి ఆ ఆశ్వాసం పూర్తయ్యేవరకూ పిరదౌసి పరమాత్మను మురిసి కీర్తించే పద్యాలు పాతిక పైగా ఉంటాయి. ఆ పద్యాలలో భగవంతుని కరుణకు ముగ్ధుడైన పిరదౌసి **"నీకే కానుకలీయ సమర్థుడగునీ నిర్భాగ్యుడు?"** **"ఎట్లు తీర్చుకొందునీ ఋణంబు?"** అని వాపోవడం ఉంటుంది.

తన అనుగ్రహాన్ని పొందుతూన్న విశ్వంభర ఆవంతయినా న్యాయాన్యాయాలు ఎరుగకుండా ఉన్నప్పటికీ క్రోధం చూపకుండా,

ప్రశాంత గుణాన్ని వీడకుండా అనుగ్రహాన్ని కురిపిస్తూనే ఉండే పరమాత్మను చూసి పిరదౌసి అబ్బుర పడతాడు. **"కృపానిధి గుండెలు గుమ్మరించెదన్"** అంటాడు. **"అనూహ్యములైన నీదు చేతలకు నమస్కరింతును కృతజ్ఞుడనయ్యెద క్రుంగి పోయెదన్"** అంటాడు.

చివరికి వీటన్నిటికి పరాకాష్టగా **"నీకవన మద్భుత మర్థ గభీర మీశ్వరా!"** అంటాడు.

అంటే మొదట తన కవిత్వాన్ని గొప్పగా భావించి తానేదో **"మల్లెపూవుటత్తరు లొలికించి"** అభిషేకమొనరిస్తే రాజు అన్యాయంగా ప్రవర్తించాడని తలచిన పిరదౌసి తనకు మించిన కవి అయిన పరమాత్మ – అద్భుతము అర్థ గభీరము అయిన కవనము చెప్పగలవాడు – న్యాయాన్యాయాలెరుగని విశంభర పై క్రోధం చూపడం లేదనీ, తన ప్రశాంతతను వీడడం లేదనీ, అనుగ్రహమే చూపుతున్నాడని గ్రహిస్తాడు. అంతకు మునుపు తన కవితకు తగిన ప్రతిఫలం రాలేదనుకుంటూ ప్రయాణం మొదలుపెట్టినవాడు ప్రయాణం పూర్తయ్యేసరికి తానే ఆ పరమాత్మ కవనానికి ఏ ప్రతిఫలమూ ఇవ్వలేని ఋణగ్రస్తుడననే భావంలోకి మారిపోతాడు..

ఇదే – పిరదౌసి ప్రశాంతస్థితిని సాధించడం అనే ఈ పరిణామమే కావ్యంలో ఎక్కువ భాగాన్ని ఆక్రమించింది. విషాదం కాదు. చివర్లో రాజు పంపిన ధనం వచ్చేసరికి పిరదౌసి మరణించడం అనే సన్నివేశం కూడా చాలా క్లుప్తంగా ఒక్క పద్యంలో చెప్తారు జాషువా. అటు గజనీ మహమ్మదుకూ సామోక్తులు చెప్పించి క్రోధభారచ్యుతుడిని చేస్తారు.

మరి చివరికి కావ్యాన్ని ఎలా ముగిస్తారు? కవి మరణంతోనో మరొక విషాదంతోనో కాదు. **"క్షోణీస్థలిం వీడినన్ వృజినంబూరక పోవునే! నరుని శాంతిజ్యోతి చల్లార్చదే!"** అన్న తాత్త్వికమైన వాక్యంతో.


ఈ విధంగా పరిశీలించినపుడు జాషువా దృష్టి ప్రధానంగా విషాదం మీద కాక శాంతిని సాధించడం మీద ఉందని అనిపిస్తుంది.

పిరదౌసి మాత్రమే కాదు జాషువా మిగిలిన కావ్యాలు కూడా ఇలాగే సాగాయనీ, తొలి రోజుల్లో వ్రాసిన కావ్యాల నుంచి చివరి కావ్యాలవరకూ అన్నిటిలోనూ ఇదే తీరు ఉందని సులభంగా గుర్తించవచ్చు.

వాటిలో కొన్నింటిని క్లుప్తంగా పేర్కొంటాను.

**"కుశలవోపాఖ్యానం"**లో సీత కష్టాన్ని మాత్రమే వర్ణించి పాఠకుడిని శోకంలో ముంచెత్తడానికి బదులు జానకి సొమ్మసిలి పడిపోగానే క్రింది వాక్యాలు చెప్పి ఒక ధైర్యాన్ని నింపుతారు జాషువా.

**"మనుజుని పట్ల దైవవాత్సల్యము వేలాతీతమైంది. నరుని దుష్ప్రవర్తనముచే సంఘటించు వేదనలయందును పరమేశ్వరుడు చేయివిడువక పోషించుచుండును. అట్టిచో సత్యసంధులగు వారికి**




**సంభవించు కష్టములయం దాపరాత్పరుని దయకు మేరయుండునా? నిముసము దుఃఖింపను బదినిమేషములు సంతసమును గలిగించు భగవంతు దనివార్య మనోవేదన ననుభవించు భూజాత కెంత సంతోష మీయకుండును."**

**"కన్యకా పరమేశ్వరి"**లో అందరూ మరణించవలసినంత మహాపద వచ్చినపుడు **"దుఃఖము పట్టజాలని"** కుసుమాంబ చెప్పిన నాలుగు పద్యాలు ఉంటే ఆ వెంటనే **"దెందము చలించని"** వాసవి **"మంద మంద మధురంభాషణలతో"** చెప్పిన నాలుగు పద్యాలు ఉంటాయి. ఈ క్రింది పద్యం చూడండి.

**కీర్తికై తనువులు విడచెడు తరుణమందు**
**దుఃఖమెన్నడు వలవదు దుర్యశమున**
**ధరణి జీవించుకంటె సద్యశమునంది**
**చచ్చుట శుభంబు! కీర్తిచే జచ్చువారు**
**చచ్చియును జావబోవరు జనని వినవే!**

నిజానికి ఇక్కడ వీరం కంటే కూడా ఒకానొక జ్ఞానదీప్తే ప్రకాశిస్తోంది. అలాగే మరొక పద్యంలో

**"అమె వెనువెన్క రొక్కొక్క రగ్ని జొచ్చి**
**తనువులు దొఱంగి స్వర్గసౌధంబునందు**
**జేరి శాశ్వత కీర్తి నార్జించి రహహ!**
**వైశ్య కులజులు శాంత భావమున ఘనులు!"** అంటారు. ఇక్కడ కవి వాడిన "శాంతభావమున" అన్న పదాన్ని గమనించాలి.

**"స్వప్నకథ"**లో పదిరోజుల పసిపాప తల్లిదండ్రులను కోల్పోయి అనాథ అయి గుడిసెలో ఒంటరిగా అరుస్తుంటే పౌరకాంతలెవరూ దగ్గరికి తీయలేదన్నటువంటి విషయం చెప్తున్నపుడు కూడా కవిత్వంలో విషాదం కన్నా తత్త్వజ్ఞానాన్ని ఇమిడ్చే ధోరణే ఉంటుంది. ఈ క్రింది పద్యం అక్కడ కనిపిస్తుంది.

**"పది దినాలకు ముందు గర్భమునను బండి**
**నిదుర వోయిన చిన్నారి నిర్మలాత్మ**
**యాఉకఉటం దూలు ప్రత్యేక వ్యక్తి యయ్యె**
**పాంచభౌతికమైన దేహమునఁ జొచ్చి"**

నిజానికి ఇది కరుణని ఎంతగానో పండించగల సందర్భం. కానీ ఇటువంటి సన్నివేశంలో కూడా, ఒక పసిపాప విషయాన్ని చెప్తున్నపుడు కూడా, జాషువా **"పాంచభౌతికమైన దేహమున జొచ్చి"** వంటి మాటలతో తాత్త్వికతనే ప్రధానం చేయడం గమనించవచ్చు.

**"ధన్యజీవి"** అనే మరొక ఖండికలో దారిద్ర్యము వల్లా అది కల్పించిన పరిస్థితుల వల్లా బాధపడ్డానని అనకుండా ధన్యజీవిని అయ్యానంటారు. అందులోని ఈ పద్యం చూడండి.

**"కలికమునకు నేను గావలెననువాడు**
**నెతిగి యున్న వాడు ధరణి లేడు**
**ఈ యనంత సౌఖ్య మేరాజు చవిజూచు**
**నేడు నా మనంబు నిశ్చలంబు"**

**"కాందిశీకుడు"** కావ్యఖండికలోని వస్తువును మాత్రమే చూస్తే విషాదమూ కరుణరస భరితమూ అనిపిస్తుంది. కానీ కాస్త ముందుకు వెళ్ళి పరిశీలిస్తే, కవితను చెప్పే విధానాన్ని ఎంచుకోవడంలోనే – ఒక బౌద్ధ భిక్షుకుడి కపాలానికీ కాందిశీకుడికీ మధ్య సంభాషణగా కవితను నడిపించడంలోనే – తత్త్వజ్ఞానం కనిపిస్తుంది. ఇక కవిత చదవడం మొదలుపెడితే అది మరింత స్పష్టంగా పద్యాలలో ఎదురవుతుంది.

**ఉభయలోకాల యనుభూతి నుల్లసిల్లి**
**శాశ్వత సమాధి నున్న నిశ్చలుండితడు**
**ఐహిక విలాస సంతత వ్యగ్రమయిన**
**బ్రతుకు సాగించు నాశోపహతుండ నేను**

**చలనము లేని ఈతని ప్రశాంతిని భంగము సేయనేర్చునే**
**ప్రళయ సహస్రముల్? యుగపరంపర మారుపు సేయుచున్న భూ**
**తల నటనా కథాంక సముదాయములెన్ని నటించి పోయెనో**
**మెలకువ లేని ఈ పునుక మీదుగఁ గాలసముద్ర కుక్షికిన్**

జాషువాగారి మరొక ప్రసిద్ధ కావ్యం గబ్బిలంలోని కథానాయకుడు కూడా దీనుడిగా కనిపించడు. గబ్బిలంతో అతను ప్రస్తావించే వివిధ విషయాల మధ్య కష్టాలు కూడా మధ్య మధ్య చోటు చేసుకున్నప్పటికీ అందులో విషాదం ప్రముఖంగా ధ్వనించదు.

**"ఇంట ప్రవేశించి దీపమార్పిన గబ్బిలమును జూచి తన కన్నీటి కథ నీశ్వరునితో చెప్పుమని వీడు ప్రార్థించె గాని నిజమున కతని ఉ ద్దేశ్యము దేశారాధన"** అని జాషువా గారు ఈ కావ్యానికి మొదట్లో వ్రాసిన మాటలలో చెప్పారు కూడా.

చివరిరోజుల్లో వ్రాసిన ముసాఫరులు కావ్యంలో కూడా ఇహానికి పరానికి పయనించే రెండాత్మల సమావేశాన్ని ఏర్పరచి వారి మధ్య జరిగే సంభాషణగా కవితను నడపాలన్న ఆలోచనే జాషువా కవిత్వ దృష్టి విషాదంపై కాక తాత్త్వికతపై ఉందని తెలియచేస్తుంది.

జన్మసార్థకతకు సల్పు కార్యములేమి?

పాప పుణ్యములకు ఫలితమేమి?

వంటి పద్యపాదాలు చదివినపుడు అది నిర్ధారణ అవుతుంది.

నిజానికి నా ఈ పరిశీలనకు అనుకూలమైన వ్యాఖ్యలను కొన్నింటిని జివిఎస్ గారు కూడా చేశారు. **"అనాథ"** గురించి చెప్తూ **"అనాథ ఖండ కావ్యం కంటె విలక్షణమైన లఘుకావ్యం. అందువలన భావరామణీయకత్వం కంటె తత్త్వచింతన వైపు పఠితను పయనింపజేసే స్వభావం ఇందులో స్పష్టం"** అన్నారు.

కానీ జాషువా కవిత్వంలో వారు ప్రధానంగా కరుణను చూశారు. అందుకే వారు కెథార్సిస్ అనే మాటను కూడా వాడారు.

జివిఎస్ గారు జాషువా కవితామార్గాన్ని మొత్తాన్నీ ఉద్దేశించి ఈ ప్రతిపాదన చేసినట్లు కనిపిస్తున్నప్పటికీ పిరదౌసి గబ్బిలము అనే రెండు కావ్యాలను ప్రధానంగా చెప్పారు. పిరదౌసి కావ్యాన్ని వారు విషాదాంతంగా పేర్కొన్నారు. **"విషాదాంత కావ్యంలో విషాదాన్ని విశేషంగా పోషించి"** విషాద గంభీర కావ్యంగా జాషువా దానిని తీర్చిదిద్దారని అన్నారు.

కెథార్సిస్‌కు కొంతమంది చెప్పే ట్రాజిక్‌ఫ్లా వివరణను తీసుకుంటే, అంటే ప్రేక్షకుడి సహానుభూతిని పొందుతున్న పాత్ర తాను చేసిన ఒకానొక తప్పు వలన, స్వయంకృతం వలననే దయనీయ పరిస్థితుల లోకి జారిపోతుందన్న వివరణ తీసుకుంటే – "గబ్బిలం" విషయంలో కెథార్సిస్ అనేమాట అసలు పొసగదు. ఆ కావ్యంలో నాయకుడి పరిస్థితికి కారణం స్వయంకృతం కాదు.

ఇక **"పిరదౌసి"** విషయం తీసుకుంటే అందులో నాయకుడు చేసినవి రెండు పనులు. ఒకటి అనర్హుడయిన వాడికి కావ్యం వ్రాసి ఇవ్వడం. రెండు అతన్ని నిందిస్తూ లేఖ వ్రాయడం. మొదటి దానిలో కొంత ఆశా రెండవ దానిలో కొంత ఆవేశమూ ఉన్న మాట నిజమే. అయితే వాటిని హృదయపరివర్తనకు, మానసికప్రక్షాళనకు దోహదం చేసేంత దోషాలుగా చెప్పలేము. పారమార్థికంగా ఆలోచిస్తే ఆ చిన్న ఆశ, ఆవేశమూ కూడా తొలగించుకోవలసినవే కావచ్చు కానీ లౌకిక జీవనానికి సంబంధించి నంతవరకు వాటికి ప్రక్షాళన వంటి మాటలు ఉపయోగించలేము. ఎందుకంటే అవి నైతికమైన దోషాలేమీ కావు.

అయితే కెథార్సిస్ కు మానసిక ప్రక్షాళన అన్న వివరణ కాకుండా ఇతర వివరణలు కూడా ఉన్నాయి. అంటే, ప్రధానపాత్ర యొక్క స్వయంకృత తప్పిదం వలన వచ్చే దయనీయ పరిస్థితీ నైతికమైన

విలువల ప్రస్తావనే కాదనీ కెథార్సిస్‌కు అంతకు మించిన విస్తృతి ఉందనీ చెప్పే క్లారిఫికేషన్ థియరీ వంటివి ఉన్నాయి.

కానీ ఆ సిద్ధాంతం ప్రకారం చూసినా కూడా, కెథార్సిస్‌కు కావ్యంలోని పాత్ర తీవ్ర విషాదాన్ని అనుభవించడం ముఖ్యం.

పాత్ర యొక్క దుర్భర వేదనా దానివలన ప్రేక్షకుడిలో కలిగే జాలీ భయమూ అనేవి కెథార్సిస్‌కు సంబంధించి ఉన్న విభిన్న సిద్ధాంతాలలోని సామాన్య లక్షణాలు.

ఈ లక్షణాలు జాషువా కవిత్వంలో కనిపించవని పైన పలు ఉదాహరణల ద్వారా గమనించాము కనుక జివిఎస్ గారి ప్రతిపాదనతో ఏకీభవించలేమనిపిస్తుంది.

కెథార్సిస్ అనే పాశ్చాత్య సిద్ధాంతం ఆధారంగా జివిఎస్ చేసిన ''విషాదగంభీరం'' అనే ప్రతిపాదన, భారతీయ అలంకారిక సిద్ధాంతాల ఆధారంగా సినారె చేసిన "కరుణవీరం" అన్న ప్రతిపాదన – రెండింటినీ కూడా జాషువా కవిత్వానికి వర్తింప చేయలేమనిపిస్తుంది.

**పరిశీలించిన గ్రంథాలు :**


1. జాషువా సర్వలభ్య రచనల సంకలనం, మనసు ఫౌండేషన్, బెంగుళూరు.
2. సుబ్రహ్మణ్యం జి.వి.,"జాషువా కవి జాతికిచ్చిన కానుక విషాద గంభీర కావ్యం", సాహిత్యచరిత్రలో చర్చనీయాంశాలు, తెలుగు అకాడమి, హైదరాబాద్, 1991.
3. సుబ్రహ్మణ్యం జి.వి., "జాషువా కవితామార్గం", కొలమానమ్, యువభారతి, హైదరాబాద్, 1995.
4. సి. నారాయణరెడ్డి, "జాషువా కవితా వ్యక్తిత్వం", సమీక్షణం, వంశీ ఆర్ట్ థియేటర్స్, హైదరాబాదు, 1981.
5. ఎండ్లూరి సుధాకర్, జాషువా సాహిత్యం దృక్పథం–పరిణామం, మానస, మనోజ్ఞ ప్రచురణలు,రాజమండ్రి, 2007.


# శ్రీరామ పంచకము



రామ నవమి నేడు రామ రాజ్యంబున
నిలిచె వేడుకలెవని భయమునను
యట్టి కరొన భయము యంతము గావించు
అతులిత గుణధామ యన్న రామ

తండ్రి మాట నెవడు తలదాల్చి నిలిచెను
తల్లులకు నెవడు ముదమొనరించె
యట్టి రాము నెపుడు యాత్మ దలచుముర
భక్తి యుక్తులు నిలువంగ బాల

రామ నీల మేఘ రమ్య చరిత్రుడ
దాశరథి దయానిదాన దేవ
రా రమారమణ బలాఢ్య నా భగవంత
రక్ష కోరి కొలుతు రామ నిన్ను

రామ రామ యన్న రాదురా నరకము
రామ రామ యన్న రాదు బాధ
రామ నామమె జనులకు రక్ష కలిగించు
రామ నామమె మధురమ్ము యనగ

రామ రాజ్యమునిల రమ్య రాజ్యమనగ
పతిత పావనుడిల పౌరుడనగ
ధర్మమునకు నితడు దారుడనగ నిల
నేలపై నడిచిన నేత రామ



**కొనింటి రమేశ్**

**కామారెడ్డి, ఫోన్ : 9849062038**

# ఓ భూమి పుత్రుడా !



పూట గడవక పస్తులుండి / అసలేటి వానలకు
పుట్టెడు శోకాన్నీడుస్తూ / మోకాటిబంటి బురదల
తలాట నాలుగు ముసలెడ్లను కట్టుకొని
మడికట్టు దున్నినవ్ / గరిసెలను నిండా నింపినవ్
ఈ కిత్త మొత్తం జేజబువ్వ తినొచ్చని
ఆనంద భాష్పాలను త్రాగినవ్ / ముందెటేడి మిత్తులోడు
నిరుటి అప్పులోడు / రాబందుల్లెక్క నీ ఇంటికొచ్చిండ్రు
నాగువడ్డీని నాకకిందనే వుంచి / గరిసంతా గుంజుకపోయిండ్రు
ఆరుగాలం పడ్డ కష్టమంతా / ఏట్లో పోసిన పన్నీరయ్యింది
ఖరీఫ్ అంతా / కసితో ఉన్న భుజం కిందికి జారింది
కొండలనూ బండలనూ / పగలేసీ పిండేసి
నీ నెత్తురును నీళ్ళకాల్వలో పారించి / పొలాన్ని పండించినవ్
శ్రమ నీది శక్తి నీది/ ధాన్యాన్ని పండించే భాధ్యతను నీ మీద మోపి
ధరను నిర్ణయించే హక్కును దళారులకిచ్చిండ్రు
ఇస్తానన్న సబ్సిడీ ఇవ్వలేదు / గుండెను రాయిని చేసుకున్నవ్
దేశానికి వెన్నెముకనని ధైర్యాన్ని నింపుకున్నవ్
సత్తువనంతా గింజ గింజకూ సల్లీ / బొట్టు బొట్టు స్వేద్యాన్ని ఒడిసిపట్టి
దంటు దంటుకాడ పోసినవ్ / కమతాలన్నీ సేద్యం చేసి
కండరాలను కరిగించి / పంటలను పండించినవ్
తెప్పకు పక్షవాతమన్నా రాలేదు / తుఫాను నీళ్ళమడుగులో
ప్రకృతి కన్నెర్రచేసింది / నీ కండ్లనిండా కన్నీళ్లను నింపింది
ఎన్నికల్లో ఓటువు నువ్వు
నాయకుల మాటలకు ఆశల విత్తనానివి నువ్వు
దుక్కిదున్నే హలానివి నువ్వు / సజీవానికి కలానివి నువ్వు
శీల లేని పయ్యవు నువ్వు / బండిని గుంజే పెయ్యవు నువ్వు
సాగుచేసే సేద్యం నువ్వు
కరోనా కాలంలో సైతం ఆహారాన్ని అంధించిన సాధ్యం నువ్వు
మానవాళికి నైవేద్యం నువ్వు
రోగనిరోధక శక్తిని పెంచే వైద్యం నువ్వు
ఆకలిలో అన్నదాతా / జన్మభూమిలో శ్రమదాతా
ఓ భూమిపుత్రుడా నువ్వు లక్ష్మీపుత్రుడివెప్పుడైతవ్
పంటలకు తండ్రి, పైసల రాశికి తల్లివెప్పుడైతవ్
పశువుల కాపరీ ! దొరవెప్పుడైతవ్
రైతే రాజు అన్న రాజ్యం ఎప్పుడొస్తుంది
భూమికి పచ్చచీర కట్టిన కర్షకుడికి
ఎఱ్ర తివాచీ ఎప్పుడు పరుస్తుంది?





**పులుమద్ది సత్యనారాయణ**
పరిశోధక విద్యార్థి, ఉ.వి.వి., ఫోన్ : 9441009537

# పాదముద్రలు (తెలంగాణ కథకుల పరిచయం)

డా॥ బి.వి.ఎన్.స్వామి, ఫోన్ : 924 781 7732

భాషాప్రయుక్త రాష్ట్రం అనే ఆధునిక ఆచరణ అందించిన బహుమతి ప్రత్యేక తెలంగాణ . అధికమే అవసరంగా ఎంచిన పాలక దృష్టికి రెండు ప్రాంతాల మధ్య ఉన్న అంతరం ఒక సహజాతంగా కనిపించింది. ఆంధ్రులకు అది పాలనాపరమైన వెసలుబాటు. తెలంగాణీయులకు అది జీవనపరమైన వెనుకబాటు. నిరక్షర కుక్షి అయిన తెలంగాణ ప్రజలకు తమ దుఃఖానికి కారణం తమ పాలకుడేనని, అతని అధికార గణమేననీ తెలియపరచినది ఇక్కడి రచయితలు. ఆ మేరకు చైతన్యవంతమైన రచనలను చేసి తమను తాము పుటం పెట్టుకొని, ఆ వెలుతురును కార్యకర్తలకు పంచినవారు ఉన్నారు. ప్రజల వైపు నిలిచి పాలక దావాగ్నికి ఆహుతి అయిన రచయితలున్నారు. దుర్భర దార్ఘిక్యం, తల్లిపాలు తాగలేని దుస్థితి, చేత పండిన పంట నోటి కందని దైన్యంతో అల్లాడే ప్రజలకు రచయిత మార్గదర్శనం తోడయింది. అలా పోరు తెలంగాణ ఆవిష్కృతమైంది. పోరుబాటపై నిదానించి నడచిన వారుకొందరైతే, రెట్టించిన తీవ్రతతో నడచిన వారు మరికొందరు. మొత్తానికి నడక మాత్రం పోరుబాట పైనే.

నిజాం నుండి విముక్తి చెందిన తెలంగాణలో పోరు మందగించింది. కొందరు బాటపై నుండి వైదొలిగారు. నిజాం చేతి నుండి అధికారం చేతులు మారింది. ప్రజలస్థితి గతుల్లో మార్పులేదు. పోరుబాటపై వెలిగే నిప్పురవ్వల వెలుతురు వారిని జాగృతం చేస్తూనే ఉంది. జాతీయ స్థాయిలో జరిగిన పరిణామాలు, భాషా సారూప్యతను బల పరిచాయి. ఆంధ్రను తెలంగాణను ఒకటిగా ముడి బిగించాయి. ఆంధ్రప్రదేశ్ అవతరించింది. సుదీర్ఘమైన ఈ పయనంలో రెక్కాడితేగాని డొక్కాడని ప్రజలకు దక్కిందేమీ లేదు. వారు బాట పక్కన పెట్టిన ఎండు గడ్డిలా ఉన్నారు. మండడానికి తయారైన మనుషులైనారు. అలా కాలంతో బాటు పోరుతెలంగాణ ఒకటి ఎప్పటికి నడుస్తూనే ఉంది. దానికి భిన్న భావజాలాలు ఆజ్యం పోశాయి. ప్రపంచానికి తెలంగాణ ఒక దివిటీగా కనిపించింది. ఈ చిత్రపటాన్ని తమ కథల్లో ఆవిష్కరించిన వారున్నారు. తమ కథల ద్వారా చోదక శక్తులుగా నిలిచినవారున్నారు. ప్రజలతో కలిసి కథను నడిపిన సృష్టికర్తలున్నారు. తెలంగాణ కథకు ఆద్యులు బండారు అచ్చమాంబ. అలా తెలంగాణ కథ తొలి దశలోనే స్త్రీ చేత సృజించబడడం ఒక విశిష్టత.

ఆధునిక కథ రకరకాలుగా నిర్వచింపబడింది. అనేక నిర్వచనాలు, నిర్ణయాలు, మైలురాళ్ళు, పునర్మూల్యాంకనానికి నెట్టబడ్డాయి. కొత్త ఆలోచనలు, నిర్ధారణలు, ఫలితాలు మొగ్గతొడిగాయి. అందులో భాగంగానే అచ్చమాంబ, గుణవతియగు స్త్రీ తెలుగులో మొదటికథ



అని సంగిశెట్టి శ్రీనివాస్ నిర్ధారించారు. 1898 నుండి అచ్చమాంబ కథలు రాయడం మొదలు పెట్టింది. రచయిత్రి పురోగామి భావనల వల్ల కథలు ఈనాటికి కూడా నిలబడగలిగాయి. భాషావిషయంగా పాతవాసనలు వేసినా, విషయపరంగా ఆలోచింపజేస్తాయి. సంఘటనలు, అనుభవాలు కథలుగా రూపుదిద్దుకున్నా, సారాంశంలో అవన్నీ జీవిత శకలాలే. జీవితం, కథకు వెన్నెముక లాంటిది. రకరకాల శిల్పవిన్యాసాలు, శైలీ దొంతరలు కథను శిఖరంపై నిల్పినా, అందులో బతుకు బండి ఆనవాళ్ళు లేకుంటే పాఠకుడు కథతో ప్రయాణించడు. జీవితం కథలో వస్తువుగా వచ్చి చేరుతుంది. అలాంటి వస్తువుకు అచ్చమాంబ పెద్దపీట వేసింది.

**"బండారు అచ్చమాంబ తొలి తెలుగు కథలు".** పుస్తకంలోని పది కథలు సంస్కరణాభిలాషతో తొణికిసలాడుతున్నాయి. ఏ కథలో చూసినా మార్పుకు గురయ్యే పాత్ర, ప్రధాన పాత్ర స్త్రీయే. స్త్రీ గుణవంతురాలు కావటం, స్త్రీకి విద్యకావాలనటం, దంపతుల ప్రథమ కలహం అంత్యకలహంగా మారటం, ఇలా ఏవి తీసుకున్నా పురుషుడి అభీష్టం మేరకు స్త్రీ మారింది. మారడం అనేది ఆ కాలానికి స్త్రీకి పురోగతిగానే కనపడుతుంది. కనుక ఇవన్నీ పురోగామి కథలు. శిల్పపరంగా భార్యాభర్తల సంవాదం కొత్తగా ఉంది. రచయిత్రి తను చూసినవి, అనుభవించినవి, పలవరించినవాటినే కథలుగా మలచింది. కొన్ని కథల్లో ఆమె కలుగజేసుకొని పాఠకుల్తో సంభాషించడం కనపడ్డా, మరికొన్ని కథల్లో మలుపులు, కలలు చూడముచ్చటగా ఉన్నాయి.

**"బండారు అచ్చమాంబ – తొలి తెలుగు కథలు"** ముందుమాటలో ముదిగంటి సుజాతారెడ్డి అన్నట్లు కథల్లో తెలంగాణ పదాలు కనపడతాయి. అలా పాత్రోచిత మాండలికానికి స్థానం దక్కింది. మార్కెట్ సంస్కృతి, మనిషి మూలుగుగా మారి, అవినీతిగా ప్రవహిస్తున్న తరుణాన ధనత్రయోదశి కథను నచ్చని వారెవరు? పాజిటివ్ వైఖరిని పెంపొందించే అద్దమును, సత్యవతియును కథ నవ్వులు పూయిస్తుంది. సత్పాత్రదానంలోని మదర్ మోటివేటర్ ప్రతి ఇంట్లో ఉంటే, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులు వెలవెల బోక తప్పవు. మానవ సంబంధాల ప్రాముఖ్యత, విలువల పరిరక్షణ, నీతి బోధ ఈ కథల ఉమ్మడి ఆశయం. వందేళ్ళు పూర్తి చేసుకున్న కథ, అనేక తీరులు పోయి చిటారుకొమ్మన కూర్చుంది. అక్కడి నుండి చూస్తే ఈ కథలు గొప్పగా కనిపించవు. కాని సాహిత్య చరిత్రను తిరగదోడే ల్యాండ్ మైన్స్ ఇవి.



**మాడపాటి హనుమంతరావు** 1885లో కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పొక్కునూరు గ్రామంలో జన్మించాడు. ఐదేండ్ల వయసులో తండ్రి చనిపోతే తల్లి వెంకటసుబ్బమ్మ అతన్ని తీసుకొని నల్లగొండ జిల్లా సూర్యాపేటలో టీచరుగా పని చేస్తున్న అన్నగారైన జమలాపురం వెంకటరావు దగ్గరికి వచ్చింది. విద్యాభ్యాసం ఉర్దూ మీడియంలో జరిగింది. నల్లగొండ, హన్మకొండలలో విద్యాభ్యాసం జరిగింది. విద్యాభ్యాసకాలం నుండే మాడపాటి గ్రంథాలయోద్యమం, సామాజికోద్యమం, సాంస్కృతికోద్యమాలవైపు దృష్టి సారించాడు. నిరంకుశ పరిపాలన గల హైదరాబాద్ సంస్థానంలో సాంస్కృతికోద్యమాన్ని, తన శక్తి సామర్థ్యాల్ని ధారపోసి నడిపించారు. రాజనీతి, సంస్కరణ, స్త్రీ విద్య, చరిత్ర, భాష, సాహిత్యం మొదలైన అన్ని రంగాలలో కృషి చేసారు. కవిత్వం, అనువాదం, వ్యాసం ఇలా పలు ప్రక్రియల్లో రచనలు చేసారు. బంకించంద్ర **"ఆనందమఠ్"** నవలను తెలుగులోకి అనువదించాడు. ఇటలీ జాతీయోద్యకారుడు గారిబాల్డీ జీవిత చరిత్ర రచించాడు. **"రోమన్ సామ్రాజ్య చరిత్ర"** సగభాగం రాసారు. కానీ ఇవేవీ ముద్రణకు నోచుకోలేదు. బరిబాయి నివాసి చింతామణి వైద్య రచించిన "ఎపిక్ ఇండియా"లోని వ్యాసాలకు హనుమంతరావు గారు చేసిన తెలుగు అనువాదం **"క్షాత్రకాలపు హిందూ్వార్యులు"** 1927లో ముద్రణ పొందింది. **"మహాభారత సమీక్షణము"** కూడా చింతామణి వైద్యగారి రచనకు అనువాదమే. పార్సీ కవులను పరిచయం చేస్తూ మాడపాటి వారు అనేక వ్యాసాలు రాసారు. మాడపాటి హనుమంతరావు జీవితచరిత్రను రాస్తూ ఆదిరాజు వీరభద్రరావు **"ఆంధ్రములో కథానికలు నూతన పద్ధతుల మీద మొట్టమొదట రాసిన కీర్తి హనుమంత రావు గారికి దక్కవలసి యున్నది"** అని అన్నాడు. గురజాడ రాసిన "దిద్దుబాటు" కథ ''ఆంధ్రభారతి''లో 1910లో అచ్చయితే మాడపాటి **"హృదయశల్యము"** కథ అందులోనే 1912 జనవరిలో అచ్చయింది. మాడపాటి కథల్లో **"నేనే" "హృదయశల్యము"** అను రెండు కథలు స్వతంత్రమైనవి. మిగతావి అనువాదములు. ప్రేమ్‌చంద్ ఉర్దూలో రాసిన కథలకు స్వేచ్ఛానువాదాలు. **మల్లికాగుచ్ఛము** పేరుతో వీరి పది కథలు లభ్యమగుచున్నవి. తెలంగాణ సాహిత్యంపై ప్రేమ్‌చంద్ ప్రభావం అధికం. తెలంగాణ కథా రచయితలు మొదటి నుండి సమాజ అడుగు వర్గపు జీవితాల్ని చిత్రించారు. ప్రేమ్‌చంద్ రచనలు కూడా ఈ కోవలోవే. కనుకనే మాడపాటి వాటిని అనువదించారు.

హనుమంతరావు గారు మొత్తం **పదమూడు** కథలను రాసారు. **హృదయశల్యము, రాణీ సారధా, ముసలిదాని యుసురు, నేనే, అగ్నిగుండము, నాడు నీ పంతము – నేడు నా పంతము, ఆత్మార్పణము** అను ఏడు కథలను సంకలనంగా **"మల్లికాగుచ్ఛము"** అన్న పేరిట మచిలీపట్టణములోని సరస్వతీనికేతనం వారు 1915లో వెలువరించారు. **"విధిప్రేరణము", "ఎవరికి"** అన్న కథలను అణాగ్రంథమాల, హైదరాబాదు వారు ప్రచురించారు. **"న్యాయమా" "ఎవరిదితప్పు" "ఇక కావలసిన దేమి" "నిజమేనా"** అన్న కథలు సుజాత, శారద మాస పత్రికలో వచ్చాయి. తెలంగాణ తొలితరం కథకులలో వీరు ప్రథములు. స్వయం కల్పితాలైన వీరి కథలలో "హృదయశల్యము" చారిత్రక కథగా కన్పిస్తుంది. ఈ కథ సంస్కరణ బాటన నడిచింది. ఈ కథను ఆడవాళ్ళ శీలాన్ని శంకించే మగవాణ్ణి వస్తువుగా తీసుకొని రాసాడు. భార్యా భర్తల మనస్తత్వాన్ని చక్కగా చిత్రించాడు. ఓరుగల్లు, రాణిరుద్రమ, అంబాల, రుద్రవరం మొదలగు ప్రాంతాల చిత్రణవల్ల తెలంగాణ నేటివిటీ కథలో కనిపిస్తుంది. శిష్ట వ్యావహారికము వాడటం వల్ల ఆనాటి భాషా విధానం తెలియవస్తుంది. స్త్రీ జనోద్ధరణ, స్త్రీ విద్య అనే భావాలు కథల్లో కనిపిస్తాయి. సామాజికోద్యమాల్లో పాల్గొన్న మాడపాటి కథల్లో సంఘసంస్కరణ భావాలు కన్పిస్తాయి. "నేనే" కథ అందుకు నిదర్శనంగా కనిపిస్తుంది.

ఇది కొసమెరుపు కథ. శిల్పపరంగా ఈ కథ ఆనాటికి కొత్త పుంతలు తొక్కింది అని చెప్పవచ్చు.

**సురవరం ప్రతాపరెడ్డి "గోలకొండ కవుల సంచిక"** వేసి తెలంగాణ అస్తిత్వాన్ని చాటాడు. ఇక్కడి భాషా సాహిత్యాలను, చారిత్రక వారసత్వాలను వెలికి తీసి జాగృతపరిచారు. వీరి పనులన్నీ తరువాత వచ్చిన ఉద్యమాలకు తొలి బీజాలయ్యాయి. ఇతని **'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'** తెలుగులో వచ్చిన అపురూప గ్రంథం. పత్రికా సంపాదకుడిగా, పరిశోధకుడిగా ఉత్తమ రచయితగా చిరపరిచితులు. వీరి కలం నుండి జాలువారినవే మొగలాయి కథలు, ప్రతాపరెడ్డి కథలు. విశిష్టమైన శైలి, భావం, విషయవివరణ ఈ కథల్లోని సుగుణాలు. ఈ కథల్లో **"సంఘం పంతులు"** అనే కథ ఆణిముత్యం లాంటిది. ఈ కథలోని ప్రధాన పాత్ర జంఘాలశాస్త్రి కాదు, అట్లని కమ్యూనిస్టు పంతులూ కాదు. ప్రజలను చైతన్యపరచి, ప్రజల కోసం పనిచేసిన వ్యక్తి. పంతులు ప్రజల నోట్లో నాలిక వలె కలిసిపోయాడు. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఉద్యమించినాడు. ఈ కథలోనే ప్రతాపరెడ్డి కోస్తా, తెలంగాణ ప్రాంతాలను పోల్చుతూ కథను కొనసాగించాడు. రెండు ప్రాంతాల జీవితాన్ని పట్టించుకున్నాడు.



నిజాంకాలంలో కఱ్ఱ ఉన్నవాడిదే బఱ్ఱె అనే న్యాయం చలామణిలో ఉండేది. కారణం పోలీసు పటేలు, మాలీ పటేలు, పట్వారి వంటి గ్రామాధికారులు, సేట్ సింధీ, అమీన్ వంటి ప్రభుత్వ ఉద్యోగుల జులుంను తన కథల్లో చిత్రించారు. దీనికి **"గ్యారా కద్దు బారా కొత్వాల్"** అనే కథ నిదర్శనంగా నిలబడుతుంది. వీరి కథల్లోని భాషను చూస్తే నవాబుల కాలం యాదికి వస్తుంది. ఉదాహరణకు రెండు వాక్యాలు.

"అరే ! ఈ మొహర్ వేసే అధికారం బొమ్మనూ ఎవరిచ్చినార్"?

"సర్కార్, వాడూ లేదూ ఫలానా గులాం, వాన్ని ఫలానా బేగం తమకీ అపాయం చేసేదాన్ని ఏర్పాటు చేసిందట హుజూర్". ప్రతాపరెడ్డి గారి మొగలాయి కథల్లో ఇలాంటి భాష , వ్యవహారాలు నాటి ప్రజా జీవన సరళిని పట్టి చూపిస్తాయి. **"చూద్దామంటే ఫురుసత్ లేదు" "బేఖూఫ్ మదర్ సాబ్"** లాంటి కథల పేర్లు పాఠకులను ఆకర్షిస్తాయి.

గోల్కొండ రాజ్యాన్ని పాలించిన మహ్మద్ ఖులీఖుతుబ్ షా క్రీ.శ. 1591లో నిర్మించిన కట్టడం చరిత్రకూ, సంస్కృతికీ, నాగరికతకు సాక్షిగా ఇప్పటికీ నిలిచి ఉంది. ఈ ప్రాంతం గోల్కొండ నవాబుల తర్వాత మొగల్ చక్రవర్తుల ఆధీనమై, మొఘల్ సామ్రాజ్య క్షీణదశలో ఆసఫ్‌జాహీ వంశీయుల ఏలుబడిలో ఉంది. 1948లో భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ చరిత్రకు సాక్షిగా చార్మినార్ నిలబడింది. ఈ కట్టడం పేరు మీద **"చార్మినార్ కథలు"** అనే కథా సంపుటిని నెల్లూరి కేశవస్వామి వెలువరించారు. హైదరాబాద్ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల జీవన విధానం, ముఖ్యంగా నవాబుల ప్రాబల్యం కథల్లో చిత్రించాడు. ముస్లిం పాత్రలేని కథ ఇందులో లేదు. ప్రతి కథ ముస్లిం జీవన విధానం చుట్టూ, నవాబుల దర్పం చెబుతూ అధికారుల అహాన్ని చిత్రిస్తూ ముస్లిం సంస్కృతీ సంప్రదాయాలను ఏకరువు పెడుతూ నాటి జలతారు ముసుగు జీవితాల్ని పరిచయం చేస్తుంది. **"విముక్తి", "రూహీఆపా", "ప్రతీకారం"** మొదలగు కథల్లో పాలకుల దౌర్జన్యాలు, క్షీణ సంస్కృతి దర్శనమిస్తాయి. నాటి కాలపు దారిద్ర్యం, అజ్ఞాన, అహంకారం, లైంగిక దోపిడీ మున్నగు వాటితో పాటు మతపరంగా పవిత్రమైన రంజాన్, మొహర్రమ్ మొదలగు పండుగల విశిష్టతలు కూడా సాక్షాత్కరిస్తాయి. కేవశస్వామికి ముస్లిం స్నేహితులెక్కువ. వారితో కలిసి తిరిగి పరిశీలించిన రాసిన కథలివి. పాతబస్తీ జీవితాలకు అద్దం పట్టిన కథలివి.





హైదరాబాద్ సంస్థానంపై 15 సెప్టెంబర్ 1948 నాడు యూనియన్ సైన్యాల పోలీస్ యాక్షన్ ఒక విధంగా నవాబు పాలనకు అంతం. అది కాస్తా **కేశవస్వామి** కలం నుండి **"యుగాంతం"** గా జాలువారింది. నిజాం లొంగిపోయాక ప్రాణభయంతో పాకిస్తాన్ పారిపోయిన రజాకార్లలో దిలావర్ ఒకడు. ఈ కథలో స్వామి అనే పాత్ర స్వయంగా కథకుడే. స్నేహధర్మంలో స్వామి, దిలావర్‌ను కొన్నాళ్ళు తన ఇంటిలో ఉంచుకొని కాపాడుతాడు. అతడు వెళ్ళిపోయే సందర్భంలో, తను దోచుకున్న సొమ్మును స్వామికి ఇచ్చిపోతాడు. అతడు ఇచ్చిన సొమ్ము ఎవరిదో వారికి అందజేయాలనే తలంపుతో మిలటరీతో పాటు వచ్చిన సివిల్ టీంలోని తహసీల్దార్‌కు అందిస్తాడు. ఆ సొమ్ము తీసుకొని వీటికి చెందినవారు వచ్చినపుడు ఇస్తానని నమ్మబలికి నవ్వుతాడు. అదిగో అదే ఇక్కడి అవినీతికి తొలిబీజం అని కథకుడు నిర్ధారిస్తాడు. భారత యూనియన్‌లో తెలంగాణ విలీనమైన సన్నివేశాన్ని కథలో చూసిన పాఠకుడు ఉద్వేగానికి గురికాక మానడు. ఆంధ్రప్రదేశ్ అవతరణకు ముందు వచ్చిన అనేక కథలలో ఇదొక ఆణిముత్యం. ఇలాంటి కథల ద్వారా చరిత్ర నమోదయింది. ఆ కాలపు జీవితాలకు సాహిత్యస్థాయి నిచ్చాయి ఈ కథలు. నాటి ముస్లిమీయతకు, భాషకు పెద్దపీట వేశాయి. రచయిత నిరాడంబరమైన శైలీ, శిల్పాలు సరళంగా సాగి పోవడం వల్ల సమగ్రత కథలకు చేకూరింది.

1940 దశకపు తెలంగాణ ప్రజల దుర్భర జీవితాలను **వట్టికోట ఆళ్వారుస్వామి** కథలుగా, నవలలుగా తీర్చి దిద్దారు. తొలితరం రచనలుగా వీటి స్థానం ప్రశస్థమైనది. వ్యవస్థీకృతమైన అంతరాలు కట్టుబాట్ల కాపలాలో పదిలంగా ఉన్న దొంతరలు మనుషుల మధ్యన విభజన స్థిరపరిచాయి. ఈ స్థిరీకరణనుండే అనేక తరాలు బయటకొచ్చాయి. ఈ పద్ధతులకు అలవాటు పడ్డ సృజనశీలురు సైతం తమ ప్రమేయం లేకుండా వాటిని పాటిస్తున్నారు. దీనికి ఆళ్వారుస్వామి అతీతంగా కనపడతారు. శారీరక శ్రమ, మేథోశ్రమ అనే విభజన ఒకటి సమాజంలో పాతుకొని ఉంది. ఆళ్వారు దీన్ని అధిగమించి జీవించారు. కథకుడిగా, వ్యాసకర్తగా, నవలారచయితగా, విమర్శకుడిగా, కవిగా, ఉపన్యాసకుడిగా, పత్రికా రచయితగా, సంపాదకుడిగా, పరిశోధకుడిగా మేథోశ్రమ రంగాన శిఖరస్థాయిలో నిలిచినాడు. స్టేట్ కాంగ్రెస్, ఆర్యసమాజం, ఆంధ్రమహాసభ, రిక్షాకార్మికుల సంఘం, రైల్వే కార్మికుల సంఘంలో నాయకుడిగా, కార్యకర్తగా పనిచేసి పని సంస్కృతికి పట్టం గట్టాడు. జీవిక కోసం వంటవాడుగా, ప్రూఫ్ రీడర్‌గా, హెూటల్ సర్వర్‌గా, పుస్తక విక్రయదారుగా, ప్రచురణ కర్తగా పనిచేసినాడు. హిపోక్రసీని వీడి నిజమైన బుద్ధిజీవిగా బతికినాడు. ఈ అనుభవసారం అంతా ఆయన రచనల్లో అంతర్లీనంగా కనపడుతుంది. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక రాజకీయ రంగాలు ఈయన కార్యక్షేత్రాలయ్యాయి. పౌరహక్కుల కార్యకర్తగా సామాన్యుడికి బాసటగా నిలిచారు. 1941, 46 లలో జైలుకు పోయినాడు. ఖైదీలతో కలిగిన పరిచయంతో వారి కథలు రాసి **"జైలులోపల"** అనే కథా సంపుటి ప్రచురించినాడు. **"అవకాశమిస్తే"** కథలో స్త్రీ స్వేచ్ఛ గురించీ, ఇంటి చాకిరీ గురించి చర్చించారు. ఇందులోని పఠాన్ పరిసరాల ప్రభావం వల్ల జైలుపాలైతే స్త్రీ ఇంట్లోనే ఖైదీ అని చెబుతాడు. స్త్రీ స్వేచ్ఛను విషయంగా తీసుకొని ఆమెను ఒక ఖైదీతో పోలుస్తూ ఆమెకు అన్ని విధాల సమాజంలో అవకాశాలివ్వాలని చెప్పిన కథ ఇది. శైలీ రీత్యా ఇది రెండు కత్తులతో సాము చేస్తున్నట్లుగా ఉంటుంది. నేటి స్త్రీవాద సిద్ధాంతం వల్ల వచ్చిన స్పష్టత నాడు లేదు. ఆళ్వారుస్వామి ఆలోచన నాటికి పురోగామిగానే కనపడుతుంది. **"నేను ఎవరిని పురుషోత్తములుగాను, అందరికంటే గొప్పగాను చూడను. అందరూ పరిసరాలకు ప్రభావితులయ్యే వారే. దాని నుంచి ఎవరిని కూడా తప్పించలేము. ఉత్తముడనేవాడు ఉత్తమత్వానికి ఎలా బాధ్యుడుకాడో, దుర్మార్గంగా బతుకుతున్నవాడు అలాగే బాధ్యుడు కాదు"** అని ఆళ్వారు అంటాడు. **"విధిలేక"** అనే కథ దీని ప్రతిఫలంగానే కనిపిస్తుంది. వీరి కథలన్ని అనుభవ గుళికలు.

నీతి, నిజాయితీ, నిస్వార్థం, నిరాడంబరత, నిష్పాక్షికత, నియమ పాలన, బాధ్యతల నిర్వహణ, సమాజసేవ ఆళ్వారుస్వామి ఆచరించిన విలువలు. వ్యక్తులకన్నా విషయం ముఖ్యమని నమ్మినవాడు. స్వాతంత్ర్య ప్రకటన జరిగిన నాటినుండి విలువల పతనం జరిగింది. దానికి స్పందనగా రాసినవే **"రామప్ప రభస"** కథనాలు, **"నేను"** చుట్టు తిరుగుతున్న నేటి సమాజానికి ఆళ్వారు ప్రాసంగికత ఉంది. కావల్సిన సమస్తం. ఏ రీతిలోనైనా చేకూర్చుకునే కాలంలో, ఉన్నదంతా ఇవ్వడానికి అని నమ్మిన ఆళ్వారుస్వామి మహెూన్నతుడు. భావజాలం రంగంలో పనిచేసేవారికి ఆళ్వారు ఒక గీటురాయి. (సశేషం)

# మరుగున పడిన మాణిక్యం చెన్న కృష్ణమరాజు

**పెబ్బేటి మల్లికార్జున్,** తెలుగు అధ్యాపకులు, ఫోన్ : **9491881916**

నా పరిశోధన నిమిత్తం మరుగునపడిన తెలంగాణ కవుల సమాచారం సేకరిస్తున్న సందర్భంలో జహంగీర్ అనే అధ్యాపకుని ద్వారా ఈ కవి గురించిన సమాచారం లభించింది. ఈ కవి రచించిన **'శ్రీహనుమద్విజయము'** అనే నాటక రాత ప్రతులు లభించాయి. ఈ నాటక ప్రారంభంలో **"ఘనత వహించిన నైజాం ప్రభు రాష్ట్రమందలి మహబూబునగరము జిల్లా నాగరకందనోలు తాలుకాలో చేరిన గౌరిట గ్రామ వాస్తవ్యుండునగు"** అని తన ప్రాంతం పేరు చెప్పుకున్నాడు. అంకం చివర గద్యలలో **'చెన్నమరాజు పౌత్ర సీతారామరాజు పుత్ర మాణిక్యాంబ గర్భశుక్తిముక్తాఫల చెన్నకృష్ణమరాజు ప్రణీతంబైన శ్రీ హనుమద్విజయమను నాటకము'** అని చెప్పుకున్నాడు. ఇతని కాలానికి సంబంధించి జనన, మరణాల సంవత్సరాలు తెలియకపోయినా జీవించిన కాలం మాత్రం ఈ నాటకం వలన తెలుస్తుంది. ఈ నాటక రాతప్రతిపైన **"శాలివాహన శక వర్షకంబులు రుధిరోద్గారి సంవత్సరం"** అని ఉండటం వలన రచనా కాలం క్రీ.శ.1923 అవుతుంది. దీనిలో తను రచించిన 22 రచనలను పేర్కొనడం వలన వయసుమీరిన తరువాత ఈ నాటకాన్ని రాశాడని అర్థం చేసుకోవచ్చు. అట్లైన తనకాలం పంతొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్ధం, ఇరవైయవ శతాబ్దం పూర్వార్ధం అవుతుంది.

తను రాసిన రచనలను దీనిలో పేర్కొన్నాడు. తిరుపతి వేంకటేశ్వర శతకము, శృంగశైల శ్రీనివాస శతకము. లక్ష్మీనారాయణ శతకము, శ్రీరామశతకం, సీతాదేవి శతకము, మారుతి శతకము, రామాంజనేయ శతకము, వేంకటేశ్వర శతకము, చెన్నకేశవ స్వామి శతకము, మాధవ శతకము, సానందోపాఖ్యానము, హనుమద్విజయము, ఋతుధ్వజోపాఖ్యానము, చంద్రికా స్వయం వరము, మృగావతి కళ్యాణము, ముదావతీ పరిణయము అనే నాటకాలు, శ్రీరామస్తవము, శివరామాంజనేయము, నరహరి విలాసము, బ్రహ్మంగారి స్తుతి, నృసింహా స్వామి పదపద్యలహరి, హనుమంత స్తోత్రము అనే భజన కీర్తనలు రాశాడు. వీటిల్లో కొన్ని ముద్రణ పొందినట్లు చెప్పుకున్నాడు.

తన గురించి, తన గురువు గురించి క్రింది పద్యంలో పేర్కొన్నాడు.

**చిరయశోర్థి పుల్లమరాజ శిష్యవరుడు**
**ఆర్యజన విధేయుడు దైవకార్యరతుడు**
**ప్రకట శతకాది బహువిధ గ్రంథకర్త**
**కృతసుధీ బహుకృతి చెన్న కృష్ణమూర్తి (రాతప్రతి - పుట-5)**

కృతి ప్రేరకుడైన నారాయణ పాపయ గురించి, అతని వంశం గురించి 12 పద్యాలలో వర్ణించాడు. పంచమాంకాలతో ఉన్న ఈ నాటకంలో సందర్భానుసారంగా పద్య రచన చేశాడు.

**ఇతివృత్తం :** ఈ నాటకంలో యయాతిరాజు ఋషులలో వశిష్టుడు గొప్పవాడని పొగడటం, విశ్వామిత్రుడి శిష్యురాలైన మోహిని యయాతిని ప్రేమించి, యయాతిచే తిరస్కరింపబడటం వలన విశ్వామిత్రుడికి కోపం వస్తుంది. విశ్వామిత్రుడు రాముని దగ్గరకు వెళ్లి యయాతి పేరు చెప్పకుండా ఒక వ్యక్తి అహంకారాన్ని అణిచివేయాలని చెప్పడంతో రామలక్ష్మణులు బయలుదేరుతారు. కాని హనుమంతుడు యయాతిని రక్షించే ప్రయత్నం చేస్తాడు. ఈ ప్రయత్నాలలో రామబాణం కంటే రామనామం గొప్పదని తెలియజెప్పడం ఈ నాటక ఇతివృత్తం.

యయాతి మహారాజు కొలువులోకి వచ్చిన ప్రజలు తమ పంట పొలాలను క్రూర మృగాలు నాశనం చేస్తున్నాయని చెప్పే సందర్భంలో రకరకాల వడ్ల పేరు కవి చెప్పాడు. అలాగే కవితా శైలిని కూడా పరిశీలించవచ్చు.

**బంగారు తీగెలు, బాజు బదాయీలు**
**మామిడి సన్నాలు మదానసరులు**
**కాకెరాకులు నిజాంగౌడీలు గరుడలు**
**పులిమీసములు రాజభోజనాలు**
**చిలుక ముక్కులు రంభ చెక్కులు రాజ హం**
**సలు మైల సన్నాలు చామకొనుల**
**కుంకుమ పూలు చంద్రొంకలు గోవింద**
**రాజులు ధనియాలు రాజనాలు**
**అడ్డమలు లక్ష్మీభోగాలు రెడ్డిసాని**
**కాటికెలు కన్నె వన్నెలు తాటిపేళ్లు**
**పెద్దగౌడీలు యీశ్వర ప్రేమలెనగు**
**అడ్డ సరులు జిల్కరలు మొన్నైనవడ్లు (రాతప్రతి, పుట 6-7)**

వీటిల్లో చాల వరకు ప్రస్తుతం లేనివి, పేర్లు తెలియని వడ్లు ఉన్నాయి. ఇంకో పౌరుని ద్వారా ఒక సీస పద్యంలో కారు సంపెంగలు, జుక్కలు, బుదుమలు, సూదిమొనలు, కొంగమూతులు, ఈత గుత్తులు, రామ బాణాలు, కాంభోజులు, రత్నాలు, చట్టిముత్యాలు, కప్పసరులు, ఢిల్లీ భోగాలు మొ॥ వడ్ల పేర్లను కవి చరిత్ర కందించాడు.

వీటితో పాటు ఆనాడు అందుబాటులో ఉన్న చేపల పేర్లను కూడా అందించాడు.

**ఇంగిలీకంబులు యిస్కతక్కెడిగాళ్లు**
**మూలకంచెలు చందమామలున్ను**
**పెండ తక్కెడిగాళ్లు బీతుమొయ్యలు రాతి**
**కొరుకులు కంచెలు పరుకలున్ను**
**కొడిపెలు కొంటెముక్కులు కత్తిమెరుపులు**
**వాల్గలు రంపెలు బాములున్న**
**మార్పుడుగాళ్లు జిల్మయగాళ్లు రొయ్యలు**
**మల్గుమేనులు కొర్రమట్టలున్ను**
**తెడ్డ మూతలు బొంబులు తేద్వలున్ను**
**బురుదమట్టలు యెల్పెలు పొనుగలున్ను**
**కృష్ణ బొచ్చలు వుల్సెలు గెండెలున్ను**
**తేలుమాను చాపలనెల్ల దెచ్చినాను (రాతప్రతి, పుట -13)**

విశ్వామిత్రుని శిష్యురాలు మోహిని యయాతిరాజును ఇష్టపడుతుంది. కాని యయాతిరాజు తిరస్కరించడం వలన మోహిని నిరాశపరురాలైన సందర్భంలో పరస్త్రీని మోహించడం పాతకమని యయాతి నోటి వెంట కవి చెప్పిస్తాడు.

**'పరసతి సంగమంబు బహుపాతకవృత్తిధనక్షయంబు దు**
**ర్భరగద పీడితంబు కులపాలిక సౌఖ్య వివర్జితంబు దు**
**ష్కర నరకప్రంబుద్రిజగంబుల నిందుకు కారణంబు శ్రీ**
**హరి నుతికంతరాయ మమృతాప్తికి దూరము మానినీమణి'**
**(రాతప్రతి, పుట -13)**

పరస్త్రీమోహం బహుపాతంలతో పాటు నరక సమానమైన బాధలను కలిగిస్తుంది. ముల్లోకాలలో నిందను మోయవలసి వస్తుందనే భారతీయ ఆత్మను ఈ పద్యంలో పొందుపర్చాడు.

ఆ మోహిని కోపోద్రిక్తురాలై **"నాగురువగు విశ్వామిత్ర ఋషీంద్రుని సన్నిధికి వికృతరూపంబున నేగ నన్నుకొట్టినాడని వేనవేలు కల్పితపు మాటలు చెప్పి ఆ మహానుభావునకు కోపము పెచ్చు పెరిగించి యయాతి గర్వ ప్రాయశ్చిత్తము జేయించెద"** (రాతప్రతి, పుట -27) అని వెళ్లి చెప్తుంది.

విశ్వామిత్రుడు రాముని దగ్గరకు వెళ్లి 'నా హృదయక్లేశమునడంచి ప్రీతిగూర్తువనియే కదా వచ్చితిని (రాతప్రతి, పుట-38) అని చెప్పగానే రాముడు మాట ఇస్తాడు. ఆ సందర్భంలో రాముడి కోపాన్ని మత్తకోకిల వృత్తంలో -

**'తమ్ముడాధనువందు కొమ్మిటు తక్షణంబున బుట్టి నే**
**జిమ్మి వైచెద నాదురాత్ముని శీర్షమున్ శకలంబుగా**
**నిమ్మునీంద్రునకెగ్గొనర్చిన హీనకర్మకుదెవ్వడో**
**సమ్మతింపగా జాలనే నిముషమ్మునైననెరింగియున్'**
**(రాతప్రతి, పుట -38)**

అని వర్ణిస్తాడు. లక్ష్మణుడు మూడులోకాలకు గురువైన విశ్వామిత్రున్ని బాధించిన వాడి తలను నాకత్తితో నరుకుతానని శపథం చేస్తాడు. రాముడిచ్చిన మాట తప్పదని

**కులశైలంబుల గ్రుంకిన**
**జలనిధులొకటైన సూర్యచంద్రులు త్రో**
**వలుదప్పిన సంచరించిన**
**నిల రామాదుల ప్రతిజ్ఞ వృథయయ్యెడునె (రాతప్రతి, పుట -40)**

అని గర్జిస్తాడు. కాని హనుమంతుడు రాముడి నుండి యయాతిని కాపాడే ప్రయత్నం చేస్తాడు. లక్ష్మణుడు తీవ్ర కోపాన్ని ప్రకటిస్తూ **'నీతర్క వేదాంతములగట్టిపెట్టి కాలయాపనజేయక వారియాజ్ఞ శిరసావహింపుము'** (రాతప్రతి, పుట -104) అని ఆజ్ఞాపిస్తాడు.

రాముడు కూడా అసందర్భపు మాటలు ఆపమని ఆజ్ఞాపిస్తాడు. రాముడు రామబాణం ఎక్కుపెట్టె సరికి లోకాలన్నింటిలో ప్రళయం వస్తుంది. విశ్వామిత్రుడు పశ్చాత్తాపం చెంది, రాముడిని శాంతించ వలసిందిగా కోరి కమండలం నుండి నీరు తీసి రామబాణంపై చల్లగా రాముడు శాంతిస్తాడు.

రాముడు సంహరించవలసిన వ్యక్తి యయాతిరాజు అనేసరికి రామాదులు ఆశ్చర్యపోతారు. యయాతి ఉత్తమ గుణాలు కలిగిన వాడని లక్ష్మణుడు అతని గుణగణాలను

**సరసుడు నీతికోవిదుడు శాంతుడు దారగుణుండు సత్య వా**
**గ్వరుడు మహాత్ముడర్థి జన బాంధువుడుత్తమ పార్థివుండు పా**
**పరహితుడార్యకార్య పరిపాలుడు రామపదార్చకుండు స**
**చ్చరితుడతండు తాపసుల స్వాంతము నొవ్వ జరించునే గతిన్**
**(రాతప్రతి, పుట -41)**

అని పొగడతాడు.

ఈ విధంగా కథ సుఖాంతమవుతుంది. ఈ ఒక్క రచన వలననే చెన్నకృష్ణమరాజు యొక్క పాండిత్య ప్రతిభవెల్లడవుతుంది. మిగతా రచనల జాడ తెలియదు. తెలంగాణాలో గొప్ప పాండిత్య ప్రతిభను ప్రదర్శించి కూడా మరుగునపడిన ఎంతో మంది కవులలో వీరొక్కరు.



తెలుగు బోధన – నైపుణ్యాలు

# 3. భాషా తరగతి గది – నిర్వహణ వ్యూహాలు

**డా. వై. రెడ్డి శ్యామల,** ఆచార్యులు, నిఘంటు నిర్మాణశాఖ, పొ.తె.వి.విద్యాలయం,
ఫోన్ : 98496 97688

తరగతి గదిని ఎలా నిర్వహించాలి! అనే ప్రశ్నకు విద్యావిధానంలో కొన్ని పరిష్కారాలు పండితులు సూచించారు. తరగతి గది నిర్వహణకు కావలసిన వ్యూహాలను విశ్లేషించారు.

భాషా తరగతి గది నిర్వహణ వ్యూహాలపైన పరిశోధన తక్కువగా జరిగింది. అందులోనూ ద్వితీయ భాషా తరగతి గది, ద్వితీయ భాషగా తెలుగు తరగతి గది నిర్వహణ వ్యూహాలపై పరిశోధనలు మరింత తక్కువ. చాలా అరుదుగా వేళ్ళపైన లెక్కించదగినన్ని వ్యాసాలు వెలువడ్డాయి. ద్వితీయభాషగా ఆంగ్లభాషా బోధనపై వచ్చిన వ్యాసాలను మాత్రమే నేను చదవగలిగాను.

నిర్వహణ, నియంత్రణ, క్రమశిక్షణ వంటి పదాలు ఇక్కడ కొంత అర్థఛాయలతో కనిపిస్తాయి. క్రమశిక్షణ తరగతి గదిని నడిపించ డానికి క్రమశిక్షణ విద్యార్థులకు అవసరమే. అది క్లాస్ లీడర్ కూడా చేయగలడు. కాని బోధనాంశం విద్యార్థుల హృదయాల కెక్కడానికి క్రమశిక్షణ ముఖ్యమైన అంశమే అయినా అది ఒక్కటే పాటించడం వలన భాషా ఉపాయుడు భాషను నేర్పించలేడు. 'నియంత్రణ' అనేది 'కంట్రోల్' అనే పదానికి సమానంగా ఉపయోగిస్తున్నాను. ఇది విద్యార్థి ప్రవర్తనను నియంత్రిస్తుంది. క్రమశిక్షణ బాహ్యాపరమైన విషయాలను నియంత్రణ, మానసికపరమైన విషయాలను అదుపు చేస్తుంది అని భావించాలి.

'నిర్వహణ' ఈ రెంటినీ కలుపుకున్నా ఇంకొంచెం లోతుగా అర్థం చేసుకోవాలి. తరగతి గదిలో విద్యార్థుల ప్రవర్తనే కాక ఉన్ముఖీకరణకు అడ్డుగా ఉన్న ఇతర అంశాలను కూడ ఉపాధ్యాయుడు పరిగణన లోనికి తీసుకోవాలి. భాషా తరగతి గది నిర్వహణ వ్యూహాలలోనికి వెళ్లేముందు తరగతి గది నిర్వహణ గురించిన కొన్ని నిర్వచనాలను పరిశీలిద్దాం.

"Classroom management is certainly concerned with behavior, but it can alson be desined more broadly as involving, planning, organization and control of learners, the learning process and the class room environment to create and maintain an effective learning experience" (Crookes 2003).

తరగతి నిర్వహణ విద్యార్థుల ప్రవర్తనను అనుసరించి ఉంటుంది. కానీ అదే సమయంలో బోధనా ప్రణాళిక, నిర్మాణంతో బాటు అభ్యాసకుల క్రమశిక్షణ, అభ్యసన ప్రక్రియ, తరగతి గది వాతావరణం వంటి అంశాలన్నీ కలిసి విద్యాభ్యసనను ఉన్నతస్థానంలో జరగడానికి తోడ్పాటును కలిగించాలి.



విద్యాబోధనకు విఘాతం కలిగించే ఏ అంశమైనా నిర్వహణ వ్యూహం ద్వారా సరిదిద్దబడాలి. విద్యార్థుల ప్రవర్తన లోపం ఉన్నా, క్రమశిక్షణా రాహిత్యం ఉన్నా కూడా "తరగతి గదిని క్రమశిక్షణలో ఉంచడం" ప్రధానాంశంగా గుర్తించాలి. తరగతి గది సక్రమ నిర్వహణ ద్వారానే మంచి ఫలితాలను సాధించగలం.

ఈ నిర్వహణ రెండువిధాలుగా జరుగుతుంది.

1. ప్రవర్తనా నిర్వహణ (Behavuoural management)
2. బోధనా నిర్వహణ (Insctructional management)

Management అనే పదానికి యాజమాన్యం అనే పదం కూడా తరచు ఉపయోగిస్తాం. కానీ తరగతి గదికి నిర్వహణ అనే పదం ఎక్కువగా కుదురుతుందని భావిస్తున్నాను. 'అజమాయిషీ' కూడ సకారాత్మక పదంగా కనిపించడం లేదు. అలాగే విద్యార్థుల ప్రవర్తనకు సంబంధించి దుష్ప్రవర్తన, తప్పు ప్రవర్తన కన్నా సరిదిద్దగలం అన్న ఊహతో 'ప్రవర్తనా లోపం' సరైన పదంగా భావిస్తున్నాను.

ప్రవర్తనా నిర్వహణలో ఉపాధ్యాయుడు విద్యార్థులను పేర్లతో పిలువగలగడం, తరగతి గదిలో అందరినీ చూపులతో అదుపు చేయగలగడం, భాషను ఉపయోగించకుండా శరీర కదలికలతో నియంత్రించడం మంచి ప్రవర్తనకు ప్రశంస వంటివి ఏ తరగతి గది నిర్వహణకైనా ముఖ్యమైన అంశాలే. ఉపాధ్యాయుడు – విద్యార్థి మధ్య ఉన్న మంచి సంబంధం ఏ తరగతి గది నిర్వహణకైనా ప్రాథమిక అంశాలే.

బోధనా నిర్వహణ కూడ ఇతర విషయాలకు వలనే ఇక్కడ కూడ అతి ముఖ్యమైనవే. ప్రణాళిక బోధనాంశ నిర్మాణం వంటివి భాషా తరగతి గదికి కూడా అన్వయించే అంశాలే. విద్యార్థులను క్రమశిక్షణలో, క్రమ పద్ధతిలో ఉంచడానికి, శ్రద్ధగా పాఠం వినడానికి,



అప్రమత్తంగా ఉండడానికి, ఇచ్చిన పనులను పూర్తి చేయడానికి ఉపాధ్యాయులు అనేక రకాలైన నైపుణ్యాలను, మెలకువలను ఉపయోగిస్తారు. ఇదంతా తరగతి గదిని క్రియాశీలంగా ఉంచడానికే.

అయితే మిగిలిన విషయపరమైన తరగతి గదికి, భాషా తరగతి గదికి కొన్ని భేదాలున్నాయి. వాటిని గుర్తించి తద్వారా నిర్వహణ వ్యూహాలను ఆలోచిద్దాం. ముఖ్యంగా తెలుగు భాషా బోధన తరగతి గది ఆధారంగా!

ఇతర తరగతి గదులలో 'విషయం' ప్రాధాన్యాన్ని సంతరించుకుంటుంది. భాష కేవలం వాహికగా ఉంటుంది. కానీ భాషా తరగతి గదిలో 'భాష'నే విషయం. వాహిక ప్రథమభాష లేదా ద్వితీయభాష అయి ఉంటుంది.

ద్వితీయభాషగా తెలుగును నేర్పే తరగతి గదిలో విద్యార్థుల మాతృభాషలన్నీ ఒక్కటే అయి ఉండదు. అంటే భిన్న మాతృభాషీయులకు ఒకే లక్ష్యభాషగా తెలుగు ఉంటుంది. నేపథ్యాలు భిన్నం కనుక బోధన వ్యూహం కూడా భిన్నంగా ఉండాల్సి ఉంటుంది.

తరగతి గదిని, భిన్న మాతృభాషీయులను దృష్టిలో ఉంచుకుని, వర్గీకరించుకోవాలి. ఇది ఒక సవాలుగా ఉంటుంది. కానీ ప్రతి పాఠ్యాంశం బోధించేటప్పుడు దీనిని గుర్తుంచుకొని సూచనలు చేస్తూ ఉండాలి.

ద్వితీయభాషా బోధనలో అనేక పద్ధతులను అధ్యయనం చేసి ఉన్నారు. ప్రత్యక్ష పద్ధతి, వ్యాకరణ, అనువాద పద్ధతి, ధ్వని శాస్త్ర పద్ధతి వంటివి. వీటిలో ఏ విద్యార్థికి ఏ పద్ధతిలో చెప్పాల్సి ఉంటుందో కొన్ని తరగతులు జరిగిన పిదప అవగాహన ఏర్పడుతుంది. కనుక దానిని అనుసరించాలి.

పాఠ్యాంశం సాధారణంగా సమూహ బోధన చేస్తాం. కానీ ప్రతి విద్యార్థి భాషా నైపుణ్యాలను అలవరచుకోవాలి. కనుక వ్యక్తిగత బోధనపై కూడా అదే సమయంలో దృష్టి పెట్టాల్సి ఉంటుంది. దీనికి ఉదాహరణగా సంగీతపాఠం చెప్పుకోవచ్చు.

ద్వితీయ భాషాభ్యాసకులు తెలుగు ధ్వనులను అలవరచుకునే సందర్భంలో వారి మాతృభాషా జోక్యం ఉంటుంది. ఇది ప్రత్యేక శ్రద్ధతో వివరించాలి. ఇతర ద్రావిడ భాషా వ్యవహర్తలు తెలుగు నేర్చుకొనేటప్పుడు ఒకవిధమైన వ్యాకరణ సమస్యలు ఎదుర్కొంటే, ఉత్తర భారత భాషీయులు మరొక రకమైన వ్యాకరణ సమస్యలను ఎదుర్కొంటారు. వీటిపై ఉపాధ్యాయులు దృష్టి ఉంచాలి. తెలుగు – సంస్కృతం; తెలుగు – ఇతర ద్రావిడ భాషల పదజాలం విషయంలో సమానత్వం, భిన్నత్వం కూడా ఉంటుంది. దీనివలన బోధనలో కొన్ని ప్రయోజనాలు, పరిమితులు ఉంటాయి. వీటిని గ్రహించాలి.

ద్వితీయ భాష బోధన తరగతి గదిలో విద్యార్థుల ప్రవర్తనా నిర్వహణ అత్యంత కఠినమైనది. ప్రవర్తనా లోపాలు, విద్యాత్మక అవాంతరాలు అని రెండు రకాలుగా దీనిని చూడాల్సి ఉంటుంది. ప్రవర్తనాలోపంలో ఇచ్చిన పనిని చేయకపోవడం ప్రధానమైనది. దీనికి తరగతి గదిలో శ్రద్ధ పెట్టకపోవడం, మాతృభాషాజోక్యం, లక్ష్యభాషా సామర్థ్యలోపం, తగినంత పదజాలం లేకపోవడం, వ్యాకరణాంశంపై పట్టు లేకపోవడం మొదలైనవి కారణాలు కావచ్చు. తగినంత ఉన్ముఖీకరణ లేకపోవచ్చు. తరగతి గదిలో అడిగిన ప్రశ్నకు లేదా ఇచ్చిన పనికి సరిగ్గా సమాధానం ఇవ్వకపోవడానికి విద్యాత్మక అవాంతరాలు కారణం కావచ్చు. వారి మాతృభాషలో సమాధానం ఇవ్వడం, మాతృభాషను తరగతి గదిలో ఉపయోగించడం కూడా లక్ష్యభాషలో తరగతి గది నిర్వహణకు ఇబ్బందిని కలిగిస్తాయి.

***వ్యూహాలు :*** ద్వితీయ భాషాబోధన తరగతి గదిలో మిగిలిన తరగతులకు భిన్నంగా విద్యార్థిని మాట్లాడటానికి ఎక్కువగా ప్రోత్సహించాల్సి ఉంటుంది. భాషణ నైపుణ్యాన్ని పెంచటానికి ఒకరిని ఒకరు ప్రశ్నలడగం, జవాబులు చెప్పించడం వంటి కార్యశాల పనిని చేపట్టవలసి ఉంటుంది. ఆ సందర్భంలో విద్యార్థులు లక్ష్యభాషలో మాట్లాడుతూ నెమ్మదిగా మాతృభాషలోకి జారిపోతుంటారు.

కొందరు కొత్త భాషలను వేగంగా నేర్చుకుంటారు. అంటే తప్పులు వచ్చినా మాట్లాడడం అనే అభ్యాసం చేస్తుంటారు. కనుక కొందరు వేగంగా, కొందరు నెమ్మదిగా భాషలను నేర్చుకుంటారు. దీనికి వారి తెలివి తేటలకు సంబంధం ఉండదు. అంటే భాషా నైపుణ్యాలకు, మేధో నైపున్యాలకు మధ్య నుండే తేడాను గుర్తించాలి. ఇతర తరగతి గదులలో విద్యార్థుల ప్రదర్శనకు భాషా తరగతి గదిలోని ప్రదర్శనకు వైరుధ్యం ఉంటుంది.

మరొక విద్యాత్మక అవాంతరం నేను గమనించింది భాషలోని ఒక నిర్మాణం చెబుతుంటే మరో నిర్మాణం కోసం ప్రయత్నించడం. దీనిని అదుపు చేయవలసి ఉంటుంది. ద్వితీయ భాష అభ్యసనంలో ముఖ్యమైనది వ్యాకరణాంశాల బోధనలో కనిపించే విసుగు. కొంత యాంత్రికంగా విద్యార్థులకు కనిపిస్తుంది. కనుక 'సరదా'ను కలిపి

చెప్పాల్సి ఉంటుంది. దీనికి రెండు లేదా మూడు భాషలను నేర్చుకోవడం వలన కలిగే ప్రయోజనాలను తెలిపి అధిగమించవచ్చు. మేధో సంపత్తి పెరగడం, సమస్యల పరిష్కార మార్గంలో బహు భాషీయులు ఎక్కువ సమర్థతను కలిగి ఉంటారు. ముసలితనంలో అల్జీమర్స్, ఆలస్యమవటం వంటి ప్రయోజనాలు తెలుపాలి.

ఇక్కడ తెలుగు రాష్ట్రాలలోని తెలుగేతర విద్యార్థులు తెలుగును ద్వితీయభాషగా నేర్చుకొనే సందర్భంలో, వారు ఇక్కడ ఉండడం వలన తెలుగుతో కొంత పరిచయం ఉంటుంది. హిందీ, తమిళం, ఉర్దూ, కన్నడ, ఒరియా మొదలైన వారికి ఒక యాసతో తెలుగు కొంత మాట్లాడగలుగుతారు. దానిని తరగతిగదిలో ఉపయోగించుకోవాలి.

విదేశీభాషగా అంటే ఏమాత్రం తెలుగు వాతావరణం లేనివారు తెలుగు నేర్చుకుంటున్నప్పుడు వారికి మోటివేషన్ ఎక్కువగా ఉంటుంది. వారి అవసరాలే వారి ఉన్ముఖీకరణకు కారణంగా ఉంటాయి.

***లేఖన వ్యూహం :*** ఏది వింటామో అదే మాట్లాడుతాం. ఏది మాట్లాడుతామో అదే రాస్తాం. ఏది రాస్తామో అదే చదువుతాం. అంటే శ్రవణ, భాషణ, పఠన నైపుణ్యాలకు లేఖన నైపుణ్యానికి దగ్గర సంబంధం ఉంది. ముఖ్యంగా ఎదుటివారు దీర్ఘం, మూర్ధన్యం, మహాప్రాణం, సంయుక్తం ఉచ్చరించినప్పుడు శిక్షణ లేని చెవి దానిని గ్రహించదు. అప్పుడు తిరిగి ఆ ధ్వనులను ఉచ్చరించలేరు. ఉచ్చారణలో లేనిదానిని రాయలేరు. అలాగే పఠనం ఎక్కువగా ఉండడం వలన వర్ణక్రమం స్పష్టంగా, కంటిద్వారా గ్రహించి, నిక్షిప్తం అవుతుంది. కనుక అక్షరదోషాలు లేని పాఠ్యాన్ని చదవడం వలన విద్యార్థి లేఖన నైపుణ్యం వృద్ధి చెందుతుంది. ఇది మాతృభాషా బోధనలో కూడా అనుసరించదగి వ్యూహం.

తెలుగును మాతృభాషగా బోధించే తరగతి గది గురించి కొంత చర్చిద్దాం. విద్యాత్మకేతర అవాంతరం ఒకటి తెలుగు అధ్యాపనలో జరుగుతున్నది. కొంతమంది అధ్యాపకులు ప్రస్తావించినది. ఇతర విషయ ప్రధాన తరగతి గదులకు ఇచ్చిన ప్రాధాన్యం (యాజమాన్యం, తల్లిదండ్రులు, విద్యార్థులు) తెలుగు తరగతి గదికి ఇవ్వకపోవడం. ఇది అత్యంత క్లిష్టమైన విషయం. మాతృభాష ప్రాధాన్యంపై ఉన్న అవగాహనా లేమి కారణం. ఎంత ఎక్కువ పదజాలం, వ్యాకరణాంశాలు మేధోకోశంలో నిక్షిప్తం చేసుకుంటే అంత వేగంగా చురుకుగా మెదడు పనిచేస్తుంది. శబ్ద అర్థాలపై స్పష్టమైన అవగాహన కలిగినప్పుడు విషయాలను అంత స్పష్టంగా గ్రహించగలం, వ్యక్తీకరించగలం. ఏ శాస్త్రం చదివినా భాషనే వాహిక. నేను శాస్త్ర సాంకేతిక పరిభాషపై సమావేశం ఏర్పాటు చేసినప్పుడు డిగ్రీస్థాయి రసాయన శాస్త్ర అధ్యాపకులు చెప్పిన విషయం, విద్యార్థులకు భాషపైన



పట్టు లేని కారణంగా పరిభాషను (టెక్నికల్ టర్మ్స్) అందుకోలేక పోతున్నారు అని. పరిభాషలో పదాంశాన్ని రకరకాలుగా కూర్చడం ఉంటుంది. ఉదా : ధ్వని, ధ్వన్యాత్మక, అంతర్ధ్వని – ఇలాంటి కూర్పులు అర్థం కావడానికి భాషా సామర్థ్యం ముఖ్యం.

తెలుగు భాషా వాచకాలు ఎక్కువగా సాహిత్య ఆధారాలు. కనుక సాహిత్యాంశాల పట్ల శ్రద్ధ లేని విద్యార్థులు భాషా నైపుణ్యాల వృద్ధికి దూరం అవుతున్నారు. సాహిత్యేతరాంశాలకు, విజ్ఞాన శాస్త్రాల అధ్యయనానికి కూడ భాష, తెలుగు భాష అవసరం అనే గ్రహింపు విద్యార్థులకు ఉన్ముఖీకరణ కలిగించగలదు.

ద్వితీయభాషా బోధనలో ఒకటి రెండు మూడు వంటి అంకెల బోధన అనువాదంగా కనిపిస్తుంది. కానీ మాతృభాషలో ఒకటి, రెండు, మూడు అంకెలు నేర్చుకొనే క్రమంలో బహుత్వంలోని కచ్చితత్వాన్ని నేర్పిస్తుంది.

ప్రభావవంతమైన బోధనాస్థలంగా తెలుగు భాషా తరగతి గది రూపొందాలి.


**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**




ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

# పద్యమనోహరం - 19

**గన్నమరాజు గిరిజామనోహర్ బాబు,**

వరంగల్, ఫోన్ : 994 901 3448

**"తెనుఁగున తేటగా కథలు చెప్పిన కావ్యము పొందులేదు, మె త్తన, పస చాలదంద్రు; విశదంబుగ సంస్కృత శబ్దమూద జె ప్పిన నవి, 'దర్భముండ్లనుచు బెట్టరు వీనుల; కావునన్ రుచుల్ దనర తెనుంగు, దేశియును దద్భవముం గలయంగ జెప్పెదన్"**

అన్న ఈ పద్యం రచించిన కవి కొఱవి గోపరాజు. పన్నెండు ఆశ్వాసాలు గల 'సింహాసన ద్వాత్రింశిక' కథాకావ్యంలో తన కవిత్వపు తీరు తెన్నులను గురించి చెప్పుకున్న పద్యం ఇది.

కేవలం అచ్చ తెనుగులోనే కవిత్వం చెబితే దాంట్లో పొందిక తక్కువైందని, ఏమాత్రం పస లేదని అంటుంటారు. అట్లని సుదీర్ఘ సంస్కృత సమాస భూయిష్ఠంగా కావ్యనిర్మాణం చేస్తే అంత కఠిన పదాలతో కూడిన రచనలోని పదాలన్నీ దర్భముళ్ళలాగా గుచ్చుకొని బాధిస్తాయిని అంటుంటారు. అందుకే వీనులవిందుగా పసందుగా ఉండేటట్లు తెలుగు పదాలు, వాటితో సమానంగా తత్సమపదాలను కూడా కలిపి తద్భవాలను కూడా కొన్నింటిని జతచేసి నా కవిత్వం సుసంపన్నం చేస్తానన్నాడు గోపరాజు.

సంస్కృత మూలమైన 'విక్రమార్క చరిత్రము'ను ఆధారం చేసుకొని కొఱవి గోపరాజు రచించిన 'సింహాసన ద్వాత్రింశిక' తెలుగు పద్యకావ్య ప్రపంచంలో విస్తృత కీర్తినందుకున్న కావ్యం. ప్రతి కవి తమ కావ్యాల అవతారికలలో తమ కావ్యరచనా వైఖరులను చెప్పడం సర్వ సాధారణం. అందుకే గోపరాజు కొన్ని పద్యాల్లో తన పద్యనిర్మాణ వైఖరిని గురించి చెప్పుకుంటూ చాలా విశేషాలను కూడా తన కావ్యావతారికలో చెప్పాడు. తెలుగు భాషకు సంస్కృత భాషతో ఉన్న సాన్నిహిత్యం కారణంగా సంస్కృత కావ్యాంతర్గత మర్మాలను వ్యక్తీకరించే ప్రయత్నం చేస్తానని కూడా తన కావ్యంలో చెప్పుకోవడం విశేషం.

ఈ పద్యం చదువుతున్నప్పుడు నిత్య సాహిత్యాధ్యయనశీలి యైన పాఠకునికి మరొక ప్రసిద్ధ తెలుగు కవియైన బమ్మెర పోతన భాగవతంలోని "కొందఱకు తెనుగు గుణమగు...." అనే పద్యం స్ఫురిస్తుంది. లోకంలో కేవలం అచ్చతెనుగునే ప్రేమించేవారు ఉండవచ్చు. కేవలం సంస్కృతాన్ని మాత్రమే ఇష్టపడేవారు కూడా ఉండవచ్చు. కాని కవికి వీరిద్దరినీ సంతుష్టుల్ని చేయవలసిన బాధ్యత ఉంటుంది. అది దృష్టిలో పెట్టుకొని తన కావ్యనిర్మాణం చేసిన కవినే తెలుగు సాహిత్యలోకం స్మరించుకుంటుందన్నది సత్యం.

అయితే ఇది అంత సులభమైన విషయమేమీ కాదు. దానికి చాలా ప్రతిబ కావాలి. నవనవోన్మేషమైన ప్రజ్ఞావంతుడైన కవికి మాత్రమే ఇది సాధ్యపడుతుంది. ఉభయ భాషల లోతులు, ఆ భాషల్లోని మర్మాలు, శబ్ద పరిజ్ఞానం, ప్రయోగ కుశలత ఇవన్నీ ఉంటే తప్ప ఇట్లా రాయగలగడం సాధ్యం కాదు. ఆ ప్రతిభను తన 'సింహాసన ద్వాత్రింశిక' కావ్యంలో చూపి తెలుగు సాహితీ ప్రపంచాన్ని మెప్పించిన కవి కొఱవి గోపరాజు.

ఈ భావన మరొక అంశాన్ని స్ఫురింపజేస్తున్నది. ఉత్తమ కవియైన వానిలో సమన్వయ ధోరణి విధిగా ఉండాలి. ఏదో ఒక దానిలో తన ప్రతిభను చూపి కీర్తి గడించాలన్న లౌల్యం ఉండరాదు. సంస్కృత భాషను వదలిన తెలుగు అంతగా రాణించదు. అట్లా రాయడం కేవలం ఒక ప్రయోగంగా నిలిచిపోతుందే తప్ప రసవంతమై పాఠకుల హృదయాల్లో స్థానం పొందలేకపోవచ్చు. ప్రయోగాలు ఎప్పుడైనా ఎక్కువగా ప్రతిభా ప్రదర్శకాలే తప్ప ప్రపంచంలో అంతగా నిలదొక్కు కోలేవన్నది సాహితీ విశ్లేషకుల భావన. ఈ పద్యం అందిస్తున్న ఈ ధోరణి కవులకు మార్గనిర్దేశనం చేస్తున్నదన్నమాట అక్షరసత్యం.

---

# రాజీపడ్డ కవి

వాడికి వ్యతిరేకంగా కలం పట్టి కవిత రాసి
గొంతెత్తి ప్రశ్నించినవాడే
నేడు జెండా పట్టి జైకొడుతుండు....

వాడి ఆలోచన శృంఖలాలను
తెంచుకుని స్వేచ్ఛగా విహరించవలసినవాడు
వాడి అడుగుల్లో అడుగులు వేస్తున్నాడు....

వాడి వేదన రాగాలన్నీ నేడు నిర్వీర్యం చెంది
చక్కగా అటువైపు సాగిపోతున్నాడు...

వాడి రచనలన్నీ నరాల్లో
కొత్త ఉత్సాహం నింపుతుంటే
ప్రవర్తన మురికికుంటలో లార్వాలా ఈదుతుంది

కవి ఎప్పుడూ ప్రతిపక్షమే నంటూ
ప్రగల్భాలు పలుకుతూ
వాడికి పాదె కదుతున్నవాడు
పాలకవర్గాని మిత్రుడైనాడు
కవి ఎందుకో రాజీ పడినట్లు ఉన్నాడు


**పొన్నగంటి ప్రభాకర్**

ఫోన్ : 8686306306

గ్రంథాంతరంగం 02

# ఆంధ్ర కవిత్వ చరిత్రము

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076


శ్రీరస్తు.

ఆంధ్రకవిత్వచరిత్రము

శ్రీబసవరాజు వేంకటఅప్పారావు, బి. ఏ., బి. ఎల్.,

గారిచే. విరచితము.

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులుఅండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

All Rights Reserved.

**బసవరాజు వేంకట అప్పారావుగారు** (1894–1933) 1921లో రచించిన **'ఆంధ్ర కవిత్వ చరిత్రము'** మరో పదేళ్లకల్లా (1931) పునర్ముద్రణం కావడం అపురూపమూ, ఆశ్చర్యకరమూనూ. ఎందుకంటారా, ఆ గ్రంథం తెలుగు సాహిత్య ఆవిర్భావ వికాసాల దస్తావేజు కాకుండా, రసభావాల విపుల చర్చ కావడం కనుక. మన తెలుగు విద్వాంసుల్లో చాలామంది సంస్కృత కావ్యశాస్త్ర గ్రంథాల గురించి సిగపట్లు పట్టుకొన్నవాళ్లే కాని, పాశ్చాత్య కావ్యశాస్త్రాల వైపు తొంగి చూసినవాళ్లు ఏ కొద్దిమందో! అలాంటి సందర్భంలో 1921లోనే రసచర్చ చేస్తూ ప్లేటో, అరిస్టాటిల్, కాలరిడ్జి, మాథ్యూ ఆర్నాల్డ్, లాంజాయినస్ మొదలైన పాశ్చాత్య కావ్యశాస్త్ర ప్రవీణుల చింతనలతో దండి, విశ్వనాథ, మమ్మట, విశ్వనాథ, జగన్నాథ పండిత రాయల్లాంటి ఉద్దండ పండితుల అభిమతాలతో పోల్చి చూడటం, రెండింటిని సమన్వయం చేయడానికి ప్రయత్నించడం స్వాగతార్హం, అభినందనీయం కూడా. బసవరాజు వేంకట అప్పారావు గారి తర్వాత **భోగరాజు నారాయణమూర్తి గారు** కూడా (1924–25) తెలుగు కవిత్వాన్నీ, కవుల్నీ, పాశ్చాత్య కావ్యశాస్త్ర మానదండాలతో అనుశీలించడం గమనించదగ్గ విషయం. అయితే తెలుగులో సంస్కృత కావ్య సంప్రదాయాల్ని పరామర్శించిన సంప్రదాయ విద్వంసులూ, పాశ్చాత్య కావ్య సంప్రదాయాల్ని అనుశీలించిన విమర్శకులు ఈ ఇద్దరు మహానుభావుల్ని స్మరించకపోవడం విస్మయావహం.

బసవరాజు అప్పారావుగారు **"ఆంధ్ర కవిత్వ చరిత్రము"** 'పీఠిక'లోని ఈ వాక్యాలు ప్రబుద్ధ పాఠకవర్యులు పరిశీలింపదగ్గవి. – **"ఈ గ్రంథమున కాచంద్రార్కస్థాయి యబ్బు గావుతమని గాని, నాకు సాహిత్య రసపోషణ బిరుదము లభించ గావుతమని కాని కోరునంతటి ఛాందసుడ గాకపోయినను, సాహిత్య చరిత్రమును యథాశక్తి బరిశీలించి సాహిత్య శ్రేయము నభిలషించుచుండిన వాడనగుటచే, నీ నాటి పండితులలో జాలమందికి మదీయాభిప్రాయ ములు సంస్కారచ్యుతి సూచకములుగను, మూలచ్ఛేదకములుగను గన్పట్టినను....."** (5వ పేజి) అని తన అభిప్రాయాలతో ఏకీభవించే **"దైవకృప వలన నట్టి సమానధర్ములు ఇప్పటికే చాలామంది యుద్భవిల్లి నాకు వాదోడుగ నున్నందులకు సంతసించుచుంటిని"**. సహృదయుల పట్ల కృతజ్ఞతలు ప్రకటించుకొన్నారు. అంటే 'ఆంధ్ర కవిత్వ చరిత్రము' మొదటి ప్రచురణ వెలువడ్డ కాలం (1921)లోనే వీరి ఈ గురుకృతి పండితుల సెబాసుల నందుకొందన్న మాట.

'ఆంధ్ర కవిత్వ చరిత్రము'లో ఆరు ప్రకరణాలున్నాయి. అవి 1. రసాత్మకం వాక్యం కావ్యమ్ 2. రస స్వరూప నిరూపణము 3. మానవ ధర్మమున రసము దేని నాశ్రయించుకొనును 4. అనంతో వై రసః 5. భావములు – భావనా శక్తి 6. భావ ప్రకటనము.

ఈ గ్రంథంలోని ప్రకరణాల్ని పరిశీలిస్తే గ్రంథకర్త రసం, భావ ప్రకటలకే ప్రాముఖ్యమిచ్చారని బోధ పడుతుంది. భావకవిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొన్న బసవరాజు అప్పారావుగారు కవిత్వ తత్త్వ విచారాన్ని ఇంత లోతుగా చేయడం, అందులోనూ గ్రాంథికభాషలో ఈ గ్రంథాన్ని వెలువరించడం ఆశ్చర్యకరమే.

బసవరాజు అప్పారావుగారు సంస్కృత కావ్య శాస్త్రజ్ఞులైన విశ్వనాథుని 'రసాత్మకం వాక్యం కావ్యమ్" అనే మహితార్థాన్ని తలదాల్చారు. జగన్నాత పండితరాయలు చెప్పిన "రమణీయార్థ ప్రతిపాదక శబ్దం కావ్యమ్" అనే సిద్ధాంతానికి తలపూపారు. కవి, కావ్య స్వరూపం, కావ్య ప్రయోజనాలు, కావ్యరచనకు ప్రేరణ దాయకమైన దేశకాల పరిస్థితులు వగైరా విషయాల్ని చర్చిస్తూ పాశ్చాత్య కావ్యశాస్త్రకారుల అభిప్రాయాల్ని సమీకరిస్తూ తన అభిప్రాయాలు తెలిపారు. ఫ్రెంచి విప్లవ నేపథ్యంలో పాశ్చాత్యదేశాల సాహిత్యాన్ని ఈవిధంగా సమీక్షించారు.

**"పరాసు (ఫ్రెంచి) విప్లవ ఫలితముగ నైరోపా ఖండమున గావ్యసృష్టియే ప్రధానముగ నెంచబడి ఛాయాపట రూపానుకరణము గౌరవపదమును గోలుపోయి స్వతంత్ర వాఙ్మయము బయలు పడుటయు సంభవించెను. కాని విప్లవము లెప్పుడును జిరస్థాయిగ నుండునటుల మతముల స్థాపింపనేరవు. విప్లవములచే జనించిన వాఙ్మయము తాత్కాలికముగ నిర్మింపబడు పాకలు, పందిళ్లుంబోలె దిట్టమగు పునాదులు లేనివగుట శీఘ్రముగ నధఃపతనము నొందు నవస్థకు రాగలవు. దీనికి దార్కాణము విప్లవానంతరమున నొక శతాబ్దమేనియు ముగియక పూర్వమే తిరిగి ల్యాటిన్ వాఙ్మయము నెడ బక్షపాతము మొలకెత్తుట"** (పేజి. 25-26).

బసవరాజు అప్పారావుగారు కావ్య సంప్రదాయాల్ని గౌరవిస్తూనే, ఆచార్యుల కఠోర నియమాల్ని విరోధిస్తూ తాను **"సాహిత్య శ్రేయోభిలాషినై సాహిత్య స్వచ్ఛంద ప్రవృత్తికి నిరోధములగు నియమముల నాపాదించు వివిధ శాస్త్రముల నొక్కింత చులుచుల జూచి దూరముగ దొలగిపోవ నానతియ దొరకొందును"** (పేజి . 27) అని వినమ్రత ప్రకటించారు. గ్రంథకర్త వైయాకరణులు భాషపై విధించిన కఠోర నియమాల్ని సడలించవలసిందిగా కోరారు.

**".... సహజ మధురమ్మగు రీతిని భాషించు సామాన్య జనులచే వ్యవహరింపబడు పదరూపముల నన్నిటిని సాధువులుగ గాని, యంతకుం జాలనిచో, శుద్ధమైన రూపములకు రూపాంతరములుగ గాని, వైయాకరణులంగీకరించి, ప్రయోగమునకు వైరళ్య మాపాదించుటయే భాషకు శ్రేయోదాయకము అట్లు వైయాకరణులు ప్రయోగ విషయమున వైరళ్య మొప్పుకొన్నచో వ్యవహారమున నున్న పదముల రామణీయకము నశించిపోవక యెన్నియో వన్నెల చిన్నెలతో బ్రకాశించి కావ్యమునకు నిత్య నవ్యత నొసగూర్పజాలును. అప్పుడు పామరులయ్యు హృదయ భావోద్వేగ బలమున సామాన్యులు సైతము కవిత జెప్పి యున్న శతాబ్దముల నుండియు బండితుల పిత్రార్జితమగు నాస్తివలె నున్న కవిత్వ సంపదను, బ్రపంచమున నెల్లడల విరజల్లి లోకాభ్యుదయమునకు నెంతో తోడ్పడగలుగుదురు"** (పేజి. 32-33). అప్పారావుగారు కవులు వ్యాకరణాన్ని తృణీకరించి రచనలు చేయాలని కోరలేదు. రసపోషణానికై వ్యాకరణ నియమాల్ని పాటించకున్నా తప్పు లేదంటారు. (పేజి. 38)

అప్పారావు కావ్యం – నీతి పరస్పర సంబంధం గురించి ఇలా అభిప్రాయం వెలిబుచ్చారు – **"మా మతమున నీతి కావ్యమున ధ్వనించుచుండ వలయును. కావ్యమునకు నీతి సాధన మాత్రము గను, నుపాంగముగను నుండి సర్వ సంపూర్ణమగు కావ్య సౌందర్యమునకు దోహదము గావింప వలయును"** (పేజి. 50) బసవరాజుగారు ఆంగ్ల విమర్శకుల అభిప్రాయాల్ని చాలా లోతుగా అధ్యయనం చేసి, తమ అభిమతాన్ని చాలా సంయమనంతో వెలువరించటం మనకు అక్కజం కలిగిస్తుంది. మాథ్యూ ఆర్నాల్డు కావ్యం నీతిని బోధించాలన్న సిద్ధాంతానికి ఆనాటి సారస్వత ప్రపంచంలో వ్యాప్తి తెచ్చారు. అప్పుడు రస్కిన్, కార్లైల్ విద్వాంసులు ఆర్నాల్డు సిద్ధాంతాన్ని సమర్థించారు. ఈ విషయాన్ని బసవరాజు అప్పారావుగారు ఎంతో నైపుణ్యంతో, సంయమంతో తమ అభిప్రాయాన్ని ఇలా వ్యక్తీకరించారు. – **"ఆర్నాల్డు కవి యొక్క వాక్యము లాకాలపు టాంగ్లేయులకు శ్రవణ కఠోరములుగ నుండెను. కాని రస శాస్త్రవేత్తయగు రస్కిన్ యొక్కయు, సంఘ లోపముల నదయుడై ఖండించిన కార్లైలు యొక్కయు వాక్యములు 'ఆర్నాల్డు'ని మతమునకు వ్యాప్తి గల్గించెను. రస్కిన్ కార్లైలిరువును నాంగ్ల దేశమున బ్రకృతి శాస్త్ర విజృంభణము వల్ల నీతి యడుగంటు చున్నదని భయపడి దేశ క్షేమమునకై నీతివాదమును సమర్థించుచు గొంచె మత్యుక్తి దోషమునకు సహితము పాల్పడిరి"** (పేజి.56). భావకవి బసవరాజు అప్పారావు ఎంత జాగ్రత్తగా, లోతుగా పై మహనీయుల కావ్య సిద్ధాంతాల్ని అవగాహన చేసుకున్నారో మనకీ వాక్యాలు పట్టిస్తాయి. ఈ ప్రకరణం ముఖ్య ఉద్దేశ్యాన్ని తెలుసుకోవడానికి గ్రంథకర్త ఈ మాటలు చాలనిపిస్తుంది. – **"కావున దేలినదేమనగా గావ్యము స్వతంత్ర సృష్టియే కాని, పారతంత్ర్యము సహింపదనియు, గావ్యమునకు రసమే ప్రధానము గాని, యన్య విషయములు గావనియు, నెన్ని విషయములయినను గావ్యమున సాధన మాత్రములుగనే యుండవలయుననియు, గావ్య జీవనమనదగు రస ప్రవృత్తికి భంగము కల్గింపరాదనియునే!"** (పేజి.64).

బసవరాజు అప్పారావుగారు కావ్యానికి ఆత్మగా రసమునే ఎన్నుకొని గౌరవించారన్నది పిండితార్థం. 78 పేజీల్లో గ్రంథకర్త కావ్య, రసచర్చలు పాండిత్య, బౌద్ధికంగా చేశారు.

విమర్శకులైన అప్పారావుగారు 73 పేజీల్లో రెండవ ప్రకరణంలో రస స్వరూప నిరూపణం చేశారు. గ్రంథకర్త భారతీయ ఆలంకారికులు, పాశ్చాత్య కవి, విమర్శకులు రస స్వరూపము, ప్రయోజనాల గురించి చేసిన చర్చను, విశదంగా రాశారు. మనిషికి జీవిత సమరంలో కలిగే సుఖదుఃఖానుభూతియే భావమనీ, భావావేశం జగత్తులోని వస్తుజాలమంతా భావానుగుణ రూపం ధరిస్తుందనీ అదే భావన అనీ, అట్టి భావన విజృంభణమే భావనాశక్తి అనీ అప్పారావుగారి అభిప్రాయం. (పేజి.107). భావోదయానికి జన్మ జన్మాంతర సంచిత చిత్త సంస్కారమే కారణమంటూ తన గీతంలోని యీ పంక్తులన్నీ ఉదాహరించారు.

**"... ఆత్మను నాత్మను గలిపి కుట్టుదారమే నాదు ప్రేమకు గారణమ్ము"** (పేజి. 109)

రసికుని జన్మాంతర సంస్కారం వల్ల, వస్తుదర్శనం వల్ల కలిగే స్వాదమే (అనుభూతి, రుచి) అనీ, దానివల్ల కలిగే అలౌకిక ఆనందమే రసమనీ బసవరాజు అభిప్రాయపడ్డారు. (పేజి.119) రసానుభవంలో కొన్ని దశలుంటాయనీ, వీటి అనుభూతి సహృదయుని చిత్త

సంస్కారంపై ఆధారపడి వుంటుందనీ అన్నారు. బసవరాజు అప్పారావు గారు భవభూతి 'ఉత్తర రామచరిత' ఆధారంగా సీతారాముల సంయోగ, వియోగ శృంగారాల అనుభూతిలోని సహృదయుని, వస్తువుకు గల అద్వైతసిద్ధిని, జయదేవుని 'గీతగోవిందం' ఆధారంగా రాధాకృష్ణుల ప్రేమలోని స్థాయీభావం విరుద్ధభావాల్ని ఆత్మవశం చేసుకొన్ని వైనాన్ని లైలామజ్నుల ప్రేమ విశ్వవ్యాప్తమైన విధానాన్ని నిరూపించారు.

**'మానవ ధర్మమున రసము దేని నాశ్రయించుకొనును'** అనే ముచ్చటైనమ మూడవ ప్రకరణం 32 పేజీల్లో ముగిసింది. భావానుభూతి అయిన రసము కామాన్ని (కోరికలను) ఆశ్రయించు కొని వుంటుననదే పలువురు ఆలంకారికుల అభిమతం. కవిత్వ ప్రయోజనం, పరమార్థం గురించి ఆధునిక ఆంగ్ల సాహిత్యాన్ని అధ్యయనం చేసిన మన విమర్శకులు ఉదమరించని మాథ్యూ ఆర్నాల్డు గారి ఈ వాక్యాన్ని అప్పారావుగారు ఉటంకించడం శ్లాఘనీయమే – "Poetry is a criticism of life which has the power to sustain, to console and the cheer man with the high ideas of conduct it presents" **(కావ్యము జీవితమును విమర్శించి, యుత్తమ జీవిత పథమును జూచించి మానవునకు ధైర్యమును సంతోషమును, శాంతిని గూర్చును)** (పేజీ.184). సంక్షోభంతో కుతకుత లాడుతున్న ప్రపంచంలో 'సనాతన రస భావం' తిరిగి నెలకొనాలని బసవరాజు అప్పారావు ఆశించారు.

**'అనంతో వై రసః'** అన్న నాలుగవ ప్రకరణం 11 పేజీల చిన్న వ్యాసం. మానవ స్వభావం చిత్ర విచిత్రమై, వైవిధ్యభరితమైనట్లే రసములు కూడా పలు రకాలనీ, నవరసాలనే నిర్ధారించుట సరికాదని అప్పారావుగారభిప్రాయపడ్డారు. **"సృష్టియు, మానవ ప్రకృతియు నెట్లనంతములో భావమును, రసమును నట్టులే యనంతములు ఈ భావమునే రసవేత్తలు "అనంతో వై రసః" యని నిర్వచించిరి"** (పేజీ. 197) అంటూ సాహిత్య శాస్త్రకారుల వాక్యాన్ని పునరుచ్చరించారు బసవరాజు అప్పారావు.

42 పేజీల దాకా విస్తరించిన ఐదవ ప్రకరణమైన **"భావములు భావనాశక్తి"** చాలా ప్రధానమైనది బసవరాజు అప్పారావుగారు భావనాశక్తికి పట్టం కడ్తూ కట్టమంచి రామలింగారెడ్డిగారు భావనాశక్తి మహత్వాన్ని తలకెత్తుకున్న వైనాన్ని ప్రశంసించారు. (పేజీ.208–209) గ్రంథకర్త భావనాశక్తి ఏదైనా ఒక అంశం మీద దృష్టి కేంద్రీకరించి, ఆ విషయం లోతుల్లోకి తొంగి చూసి దానిని సూక్ష్మంగా, మహత్తరంగా చిత్రిస్తుందని అన్నారు.

భావనాశక్తి ఒక విషయం గురించి సమగ్రంగా చిత్రిస్తుంది. ఇది సాంద్ర వ్యవసాయం (intensive cultivation) లాంటిది. కాగా కల్పనాశక్తి అపరిమితమైనది. ఇది (extensive cultivation) లాంటిది. భావనాశక్తి వల్ల సృష్టింపబడ్డ కవిత్వం సహృదయుల గుండె



లోతుల్లోకి చేరితే, కల్పనాశక్తి ద్వారా వెలువడ్డ కవిత్వం రసికుల హృదయాల్ని తాకి మాయమవుతుంది. అందువల్లే బసవరాజు అప్పారావు **"ఆంధ్ర కవులలో నెల్ల భావనాశక్తి ప్రదర్శకమగు మితభాషిత్వమును దిక్కనయు వేమనయు ముఖ్యులును, నీడులేని వారును"** (పేజీ.216) అని అన్నారు గ్రంథకర్త. భావనాశక్తి, ఊహాశక్తుల తారతమ్యాన్ని చాలా శక్తిమంతంగా చిత్రించారు. **"భావనాశక్తి యుతుడగు సత్కవి ప్రాణప్రతిష్ఠ జేసిన విగ్రహమునకు నీ యూహాశక్తి గల కవి నగిషీ జెక్కి యలంకారముల నొదగూర్ప బ్రయత్నించును".** (పేజీ.223). ఈ భావనాశక్తి మహత్వాన్ని అప్పారావుగారు షేక్స్పియర్ హామ్లెట్, ఒథెల్లో, మ్యాక్‌బెత్ నాటకాల్లో దర్శించారు. కాళిదాసు, భవభూతి నాటకాల్లోనూ, తిక్కన భారతంలో కూడా భావనాశక్తి పరాకాష్ఠను దర్శించగలిగారు. 'ఆంధ్ర కవిత్వ చరిత్రము' కర్త **"భావనాశక్తి కవికి మాత్రమే సొమ్ముగను, బలముగను, అండగను నుండి యతనికి గావ్యనిర్మాణ విషయమున గృష్ణ సారథ్యం బోలె సహకారియై యుండునని"** చెప్పి ఈ ప్రకరణానికి మంగళం పాడారు. (పేజీ.240)

చివరి అధ్యాయమైన 6వ ప్రకరణం – భావ ప్రకటము 56 పేజీల దాకా విస్తరించింది. భావప్రకటనం అంటే మరేమీ కాదు. భావాల్ని వెలువరించే విధానం – మరో విధంగా చెప్తే 'శైలి', భారతీయ ఆలంకారికులు – పాశ్చాత్య సాహిత్య శాస్త్రవేత్తలు శైలి గురించి చెప్పిన విషయాల్ని బసవరాజు అప్పారావుగారిలా చర్చించి, విశదీకరించిన తెలుగు విమర్శకులు ఎవరైనా వున్నారా?



అప్పారావుగారు **"మానవుని స్వభావము యొక్క వాగ్రూపమే శైలి"** (పేజి. 252) రచయితల స్వభావం విలక్షణమైనట్లుగా వేరయినట్లుగా వాళ్ల శైలి కూడా మారుతూ వుంటుందన్నారు. ఒకరి శైలిని మరొకరు అనుకరిస్తే అది నిష్ప్రయోజనమనీ "imitation is suicide" అను ఆంగ్లోక్తిని వుల్లేఖించారు. (పేజి. 254) కావ్యాల్లో అలంకారాల స్థానం గురించి కట్టమంచి రామలింగారెడ్డిగారి అభిప్రాయాలతో ఏకీభవిస్తూ, **".... మితముగను, ఔచిత్యమున కనుగుణములును గూడ సమానముగ రసమునకు దోహదమొనర్పగలవు"** (పేజి. 263) అని తీర్మానించారు.

బసవరాజు అప్పారావుగారు ధ్వని సిద్ధాంత ప్రాముఖ్యాన్ని వివరిస్తూ, ప్రాచీనాలంకారికుల నిర్వచనాల్ని హృద్గతం చేసుకొని, సులభసుందరంగా 'ధ్వని'ని ఈ విధంగా నిర్వచించారు. **"... మాటల వలన ప్రత్యేకముగ జెప్పబడకపోయినను, వానిచే సూక్ష్మముగ సూచింపబడు భావమే ధ్వని యగుచున్నది"** (పేజి. 264). శబ్ద, అర్థ, భావ ధ్వనులని మూడురకాల్ని పేర్కొంటూ.... **".. ఒక భావము వాచ్యముగ నుండి వేఱొక భావమును మొత్తము మీద ధ్వనింపజేయు"** (పేజి. 265) భావధ్వని శ్రేష్ఠతమమన్నారు. ఉదాహరణగా **"వీణ చేజారి పడిపోవు వ్రేళ్ల శ్రుతుల / నింపుగా మీటి రాగమొప్పింప కుండె.... దేవ! నాకింక నెపుడు నీ దివ్య దర్శనమ్ము నిచ్చెదు! నా పాట కంతమెపుడు?"** (పేజి. 265-266) ఒక భావగీతం వుటంకించి భావధ్వనిని విశదీకరించారు గ్రంథకర్త.

ఆంగ్ల సాహిత్యంతో ప్రగాఢ పరిచయం వున్న బసవరాజు అప్పారావుగారు కవిత్వ తత్త్వాన్ని వివరిస్తూ సంస్కృత కావ్యశాస్త్ర గ్రంథాల్నే కాక, ఆంగ్ల విమర్శనల్ని కూడ నిశితంగా పరిశీలించి ప్రాచీన సంస్కృతాంధ్ర పద్యాల్నే కాకుండా ఆధునిక తెలుగు కవితల్ని కూడా ఉదాహరించారు. విశ్వమానవ ప్రేమను చాటే గురజాడ వారి ఈ పంక్తులు మననీయం.

**"ఎల్లలోకము నొక్క యిల్లై, వర్ణ భేదములెల్ల కల్లై...."** (పేజి. 113)

పద సౌకుమార్యం, లయలు కవిత్వానికి సౌందర్య ప్రసాదనము లని చెప్తూ గ్రంతకర్త ఈ ముత్యాలసరం ఛందాన్ని నిదర్శనంగా చూపిస్తారు.

**"చల్లగాలులు సాగి యలలుగ**
**జల్లుజల్లున రాల్చె పూవుల**
**నుల్లమలరెను ఆకలొక్కటె**
**బడబవలె నడలెన్"** (పేజి. 280)

గ్రంథకారుడు గద్య పద్యాల ప్రధాన ఆశయాన్ని ఈవిధంగా చెప్తారు.

**"వచన సాహిత్య పరమావధి జ్ఞానోపదేశమే. జ్ఞానోపదేశము గావించిన తోడనే వచన సాహిత్య పరమార్థము సిద్ధించినదగును. భావోద్రేకము గలిగించుటయే కవిత్వము యొక్క ముఖ్య కర్తవ్యము"** (పేజి. 292)

బసవరాజుగారు 'భావ ప్రకటనము' అధ్యాయంలో సంస్కృతం, గ్రీకు, లాటిన్ మొదలైన భాషల్ని మృతభాషలనకూడదనీ, పురాతన భాషలనడం సముచితమనీ అన్నారు. బసవరాజు అప్పారావుగారికి దేశి సారస్వత విభూతి పట్ల మక్కువ ఎక్కువ. అందుకు వారు **"యక్షగానములను, జంగము కథలను, పదములను, ఏల పాటలును మొదలగు ప్రత్యేకాంధ్ర విలక్షణతను సూచించు కావ్యముల రచించిన కవులు మన కెంతయు వంద్యులు"** (పేజి. 3030) అని ఘోషించారు. **"కావున నాంధ్రత్వమే యాంధ్ర సాహిత్యమునకు జీవగఱ్ఱ వంటిది"** (పేజి. 307) అని తమ ఆంధ్ర జాతీయాభిమానాన్ని చాటుకొన్నారు.


బసవరాజు అప్పారావుగారి "ఆంధ్ర కవిత్వ చరిత్రము" (1921, 1931) తెలుగు కవిత్వతత్త్వాన్ని పరిశీలించిన లాక్షణిక గ్రంథం. ఆనాడు విశ్వవిద్యాలయాల్లో తెలుగు పాఠాలు బోధించిన ఆచార్యవర్యులు ఈ చక్కని పుస్తకాన్ని తమ విద్యార్థులకు పరిచయం చేసినట్లు కనపడదు. ఆకాలంలో పిహెచ్.డి పట్టాలు పొంది విద్యార్థులకు యం.ఏ. పట్టాలు అందించిన విశ్వ విద్యాలయ ఉ పన్యాసకులు కూడ ఈ ఉత్తమ లక్షణ గ్రంథం విలువను తమ శిష్యులకు తెలియజేసిన జాడలు లేవు. మొత్తం మీద ఈ పుస్తకమూ, ఇదే పేరుతో తర్వాత 1924, 25లో వెలువడ్డ భోగరాజు నారాయణమూర్తి గారి ఉద్గ్రంథమూ తెర వెనుకనే దాగిపోవడం విచారకరమూ, దురదృష్టకరమూనూ. నాడే కాదు నేడు కూడా ఎంతోమంది ప్రజ్ఞానిధుల్ని విశ్వవిద్యాలయాలకు దూరంగా వుంచడం జాతి దౌర్భాగ్యం, యువతరం ఖర్మానూ.

(ఈ పుస్తకాన్ని పంపి సహకరించిన ఆచార్య వెలుదండ నిత్యానంద రావుగారికి కృతజ్ఞతలు)

మూసీ సాహిత్యధార
స్వీయ పరిశోధన

# ఈగ బుచ్చిదాసు సాహిత్యం - సమగ్ర పరిశీలన

**మంత్రి శ్రీనివాస్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 83283 33720



తెలంగాణ అనాదిగా భజన సంప్రదాయాలకు, గురుబోధలకు కేంద్రస్థానంగా ఉన్నది. ఈ సంప్రదాయాలు ఇక్కడి ప్రజల్లో దైవభక్తిని, వివేకాన్ని నింపి జీవనమర్మం అంటే ఏమిటో తెలియజెప్పాయి. ఇక్కడి ప్రజల్లో అణువణువునా భక్తి, తాత్త్వికత దర్శనమిస్తుంది. సహజ సుందరమైన కల్పనాశక్తిని కల్గి తమదైన శైలిలో జానపదాల్ని సృష్టించిన జానపదుల చేతనత్వం ఈ నేలలో కనబడుతుంది. ఉత్తర దక్షిణాదులకు వారధిగా ఇరు ప్రాంతాల భక్తి సంప్రదాయాలను తనలో జీర్ణం చేసుకున్న సాంస్కృతిక క్షేత్రం తెలంగాణా. ఈ నేలలో ఎందరో వాగ్గేయకారులు పురుడు పోసుకున్నారు. వారంతా భగవద్దాసులై తమ సంకీర్తనలతో తరించారు. ఇక్కడి ప్రజల్ని తరింపచేసారు.

భద్రాచల రామదాసు నుండి మొదలైన దాస పరంపర రాకమచర్ల వెంకటదాసు, తూము నరసింహదాసు, మన్నెంకొండ హనుమద్దాసు, వేపూరు హనుమద్దాసు, ఎడ్ల రామదాసు, ఉత్పల చెన్నదాసు మొదలైన వాగ్గేయకారులను జాతికి అందించింది. వీరి కోవలోకి చేరి ప్రజల్ని భక్తి, జ్ఞానం వైపుకు నడిపించే సంకీర్తనలను రాసిన వాగ్గేయ కిరణం ఈగ బుచ్చిదాసు. ఈయన తెలంగాణా వైకుంఠం అని చెప్పబడుతున్న యాదగిరి క్షేత్రంలో వెలసిన నరసింహస్వామి భక్తుడు. నరసింహ స్వామిని తన భక్తి ప్రపత్తులతో ప్రసన్నం చేసుకొని ఆయనపై సంకీర్తనలు, శతకాలు రచించి తన జీవితాన్ని పండించుకున్నాడు .

తెలంగాణా రాష్ట్రం సిద్ధించాక మరుగున పడ్డ తెలంగాణా సాహిత్య కుసుమాలు ప్రజల ముందుకు వస్తున్నాయి. ఇది శుభ సూచకం. ఈ క్రమంలోనే ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలంగాణా సాహిత్య అకాడమి వారు డా. పి భాస్కరయోగి గారిచే వెలికి తీయబడ్డ ఈగ బుచ్చిదాసు సాహిత్యాన్ని **"యాదగిరి సంకీర్తనకవి ఈగ బుచ్చిదాసు''** అన్న పేరిట ప్రచురించింది. ఈ గ్రంథంలో శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి సంకీర్తనలు, శ్రీ యాదగిరి నరహరిశతకం, శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి బతుకమ్మ పాట వంటివి ఉన్నాయి. ఇవే కాకుండా శ్రీ యాదగిరి లక్ష్మీ నారసింహ శతకం, శ్రీ యాదగిరి శివ భజన కీర్తనలు ఈగ బుచ్చిదాసు సాహిత్య సామ్రాజ్యాన్ని విస్తరించాయి. నామీద ప్రేమతో అభిమానంతో ఈగ బుచ్చిదాసు సాహిత్యాన్ని డా. పి. భాస్కరయోగి గారు నాకు అందించారు వారికి సదా రుణపడి ఉంటాను.

నాకు లభించిన ఈగ బుచ్చిదాసు సాహిత్యాన్ని తొమ్మిది అధ్యాయాలుగా విభజించుకున్నాను. అవి 1.ఈగ బుచ్చిదాసు జీవన రేఖలు 2. సంకీర్తనలు-వస్తు వైవిధ్యం 3.సంకీర్తనలు-తత్త్వం 4.శతకాలు-వస్తు వైవిధ్యం 5. శతకాలు-తత్త్వం 6. శ్రీ యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి బతుకమ్మ పాట 7. ఈగ బుచ్చిదాసు సాహిత్యం -సామాజికాంశాలు 8. ఈగ బుచ్చిదాసుపై ఇతర కవుల ప్రభావం 9. ఈగ బుచ్చిదాసు సాహిత్యం-భాషాంశాలు .

## మొదటి అధ్యాయం : ఈగ బుచ్చిదాసు జీవన రేఖలు

సంకీర్తనకారుడు ఈగ బుచ్చిదాసు 1907వ సంవత్సరంలో వరంగల్ జిల్లాలో జన్మించాడు. ఈయన తన తల్లిదండ్రుల వివరాలు గాని, తన ఊరి వివరాలు గాని ఎవ్వరికి తెలియజేయని కారణంగా ఈయన జీవన వివరాలు సమగ్రంగా తెలిసి రావట్లేవు. కాని ఈయన సంకీర్తనల్లో, ఈయన శతకాల్లో తన గురించి తెలువుకున్న ఆత్మ గతాంశాల ఆధారంగా, ఈయన శిష్యమణి సాధు బుచ్చిమాంబ గారు శ్రీ యాదగిరి లక్ష్మీ నారసింహ శతకానికి రాసిన ముందుమాట ''నా గురుదేవుడు" నుండి, డా.పి. భాస్కరయోగి గారు తన గ్రంథం "యాదగిరి సంకీర్తన కవి ఈగ బుచ్చిదాసు"కు ముందు రాసిన ఈగ బుచ్చిదాసు జీవన విశేషాలు, అలాగే ఈగ బుచ్చిదాసు ప్రస్తుత మఠాధిపతి శంకరానందగిరి స్వామీజీ గారిమాటలు బుచ్చిదాసు జీవన విశేషాలను తెలియజేస్తున్నాయి.

ఈగ బుచ్చిదాసుది పద్మశాలి కుటుంబమని జీవనం కోసం పలు వృత్తులు స్వీకరించాడని, ఈయనకు భార్య, ఒక కొడుకు ఉన్నారని తెలుస్తున్నది. 1937-38 వ సంవత్సరంలో

తనకు ముప్పై ఏళ్ళున్నప్పుడు తనకు కలిగిన అనారోగ్యాన్ని నివారించుకునే నిమిత్తం యాదగిరి గుట్టకు వచ్చాడని తెలుస్తోంది. నరసింహ స్వామి దీక్షను స్వీకరించి, నిష్టతో స్వామిని సేవించి తన అనారోగ్యాన్ని దూరం చేసుకున్నాడని తెలియవస్తోంది. నరసింహ స్వామి మహిమకు ముగ్ధుడై గుట్టపైనే ఉండిపోవడానికి నిశ్చయించుకున్నాడు. ఈ క్రమంలో యాదగిరిపై వేంచేసి వున్న కబీరు మతానుయాయి శ్రీ ఉత్పల చెన్నదాసు వద్ద గురూపదేశం పొందాడు. కొంతకాలం ఇక్కడే ఒక ఖాన్గి బడి నడిపి పేద బడుగు పిల్లలకు విద్యను నేర్పాడు. అనంతరం నరసింహ స్వామి కోసం ఘోరమైన సాధన చేసి స్వామిని ప్రసన్నం చేసుకున్నాడు. స్వామి స్వప్నాదేశంతో సంకీర్తనలు, శతకాలు, బతుకమ్మ పాట, శివ భజనలు వంటివి రచించి ధన్యుడైనాడు. ఈగ బుచ్చిదాసు 1957వ సంవత్సరం 19 జూన్, 11 గంటల సమయంలో నరసింహ స్వామిలో ఐక్యమైనాడు. ఈయన అనంతరం ఈయన శిష్యురాలు సాధు బుచ్చిమాంబ ఈగ బుచ్చిదాసు మఠాధిపతిగా ఉన్నారు.

**రెండవ అధ్యాయం: సంకీర్తనలు వస్తు వైవిధ్యం**

ఈగ బుచ్చిదాసు సంకీర్తనలు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సంకీర్తనలు మరియు శ్రీ యాదగిరి శివభజన కీర్తనలుగా లభ్యమవుతున్నాయి. వీటిని రెండు భాగాలుగా చేసుకొని విశ్లేషించడం జరిగింది. మొదటిది అయిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కీర్తనలను మూడు భాగాలుగా విభజించుకోవడం జరిగింది.అవి 1. భక్తార్తి 2.ప్రబోధం 3. మార్గ నిర్దేశం.

భక్తార్తిలో అనుబంధ అంశాలుగా 1.స్తుతి పూర్వకమైన ఆర్తి 2. సంవేదనాత్మకత 3 అన్యథా శరణం నాస్తి భావన 4. జగత్స్వామినికి వేడుకోలు 5. పుత్రవేదన అన్న అంశాలు తీసుకొని బుచ్చిదాసులోని భక్తార్తిని విశదపరచడం జరిగింది.

బుచ్చిదాసు తనలో ప్రగాఢంగా ఉబికివస్తున్న దర్శనాభిలాషను, ఆర్ద్రతను నరసింహ స్వామిముందు ఉంచుతాడు. బుచ్చిదాసులోని ఆర్తి రామదాసులోని ఆర్తిని తలపించడం మనం గమనిస్తాం.

**"తాలజాల పాలబడితిని నన్నేల జేసేవో నరసింహ**
**చాలగ వేడిన ఏలరావు నా చాతగాదు సుమీ నరసింహ"** అంటూ తనలోని ఆర్తిని బుచ్చిదాసు నరసింహస్వామితో పంచుకుంటాడు.

రెండవ ఉపాధ్యాయం ప్రబోధంలో 1.పరహిత బోధ 2. మానస బోధ 3. ఆత్మ ప్రబోధం 4. గురుశిష్య సంవాదం వంటివి విశ్లేషించడం జరిగింది. మూడవ ఉపాధ్యాయం మార్గ నిర్దేశనంలో 1. మోహం, అహంకారం వంటి దురాచారాల నిర్మూలనకు మార్గదర్శనం.2. గురుబోధ – ఆత్మ సాధన 3. ప్రభురక్షణ 4. జార మనసు చిత్త విభ్రమ ముక్తికి మార్గదర్శనం వంటి అనుబంధ అంశాలను చేర్చి శ్రీ యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి సంకీర్తనలలోని అంతఃసారాన్ని తెలియజేయడం జరిగింది. హరి కరుణ కోసం అనాదిగా భక్తులు ఏ విధంగానైతే ప్రాధేయపడ్డారో అదే విధంగా ఈగ బుచ్చిదాసు కూడా నరసింహస్వామి ఎదుట తన ఆర్తిని ప్రకటిస్తూ ప్రాధేయ పడతాడు. దారి తప్పిన భక్తులకు హరిప్రబోధం చేస్తూ ఒక మార్గదర్శిలా నిలబడతాడు.

**శ్రీ యాదగిరి శివ భజన కీర్తనలు**

రెండవ అధ్యాయంలో పేర్కొనబడిన శ్రీ యాదగిరి శివభజనల్లో యాదగిరిలో వెలసిన రామలింగేశ్వర స్వామిని హరి స్వరూపంగానే కొలుస్తూ శివాయ విష్ణు రూపాయ అన్న ఋషుల మాటలను బుచ్చిదాసు నిజం చేస్తాడు. పరమ శివుడితో తానూ తన బాల్యం, తరుణావస్థలో చేసిన అపరాధాలను తెలియజేసుకుంటూ పశ్చాత్తప్తుడవు తాడు.

**"యేమిసేతు యేమిసేతు – యేమిసేతూరా శివుడా – స్వామి**
**నీవని నమ్మినందుకు – మోము జూపారా**
**భూమిలో నే బుట్టిననుండి పుణ్యమేరుగారాపారా**
**భామినీలా పొందుగోరీ పాపినైతీరా"** అంటూ పరమశివుని ముందు తన తప్పులు ఒప్పుజెప్పుకోవడం మనం చూడవచ్చు.

పరమశివుని నామం ఎంతగొప్పదో తెలుపుతూ శివనామ మహిమను తెలిపే కీర్తనలద్వారా భక్తులకు నామజపం విశిష్టతను తెలియజేస్తాడు. చంచలమైన మనసుకు సుబుద్ధిని బోధిస్తూ చేసే మానస బోధలు నశ్వర ప్రపంచంపై మనిషికున్న, మనిషి పెంచుకున్న ఆశలను త్రుంచివేసి సత్యం వైపుకు నడిపిస్తాయి.

**మూడవ అధ్యాయం: సంకీర్తనల్లో తత్త్వం**

తత్ అంటే అది అని, వేదాంతపరంగా ఈశ్వరుడు అని అర్థం. త్వం అంటే నీవు అని అర్థం. తత్త్వం అన్న పదానికి అదే నీవు అని అర్థం. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ ఈశ్వరుడి స్వరూపానివే నువ్వు అని అర్థం. ఈగ బుచ్చిదాసు తన సంకీర్తనల్లో ప్రతీజీవిని పరమాత్మ స్వరూపంగా చెబుతూ సర్వప్రాణుల్లో తనను, తనలో సర్వ ప్రాణులను చూసుకొని పరబ్రహ్మ ఉనికిని అంతటా చాటాలని చెబుతాడు. తన సంకీర్తనల్లో 1. కాలతత్త్వం 2. పరతత్త్వం 3. సంసార తత్త్వం 4.ఆత్మ తత్త్వం 5. మనస్తత్త్వం వంటి పలు రకాల తత్త్వాలను ఆవిష్కరించాడు.

యాదగిరి శివభజన కీర్తనలలో పరమశివుని తత్త్వాన్ని ఆవిష్కరిస్తూ అతడే పూర్ణ పురుషుడు అన్న సత్యాన్ని తెలియజేస్తాడు . శివతత్త్వంతో పాటు పరతత్త్వం,ఆత్మ తత్త్వం కూడా ఈయన శివభజన కీర్తనలలో ఆవిష్కృతమవుతుంది.

**నాల్గవ అధ్యాయం : శతకాలు –వస్తు వైవిధ్యం**

తెలుగు గడ్డపై అందరి నోళ్ళలో నానేవి శతక పద్యాలు. శతకం నీతిని, ధర్మాన్ని, లోకరీతిని, ప్రజలకు నేర్పుతుంది. అటువంటి శతక

ప్రక్రియలోనూ బుచ్చిదాసు తనదైన ముద్రను వేశాడు. శ్రీ యాదగిరి నరహరి శతకం, శ్రీ యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి శతకం అన్న పేర రెండు శతకాలను రాసి యాదగిరీశునికి తనదైన సాహితీ కైంకర్యం చేసుకున్నాడు. తన శ్రీ యాదగిరి నరహరి శతకంలో నరసింహస్తుతిని, మహిమను మనం బుచ్చిదాసు అభిమతంలో చూడవచ్చు. తన పూర్వాశ్రమంలో చేసుకున్న తప్పుల్ని నరసింహ స్వామికి విన్నవించుకుంటూ చేసిన ఆత్మ నివేదనం ఎందరికో కనువిప్పును కలిగిస్తుంది. తానూ సంసార సాగరంలో పడి చేసిన దుష్కర్మలకు చేసుకున్న పశ్చాత్తాపంలో అతని జీవన అనుభవాలు దర్శనమిచ్చి మంచివైపు నడిపించడానికి సహాయపడతాయి. శ్రీ యాదగిరి నరసింహస్వామి శతకం ఖండగతిలో నడుస్తూ గాన యోగ్యంగా ఉంటుంది. తక తకిట తక తకిట అన్న మాత్రలలో ఈ శతకం పయనిస్తుంది. ఈ శతకంలో హరి ఎత్తిన దశావతారాలను చక్కగా చూపించాడు బుచ్చిదాసు. ఈ శతకంలోనూ తన ఆత్మ గతంశాలను వివరిస్తూ తన పశ్చాత్తాపాన్ని నరసింహ స్వామికి విన్నవించుకోవడం మనం ఈ నాల్గవ అధ్యాయంలో గమనించవచ్చు.

**ఐదవ అధ్యాయం: శతకాలలో తత్త్వం**

చంచలమైన మనసు పడే వింత పోకడలను తెలియజేస్తూ, అనశ్వర ప్రపంచం నుండి మనిషిని హరి భక్తిలోకి మళ్ళిస్తాడు బుచ్చిదాసు. ఈ ఐదవ అధ్యాయంలో మానవ మనస్తత్త్వం, సాధనా తత్త్వం, జీవ సమత్వ తత్త్వం, పరబ్రహ్మ తత్త్వం , కాలతత్త్వం మొదలైన తత్త్వాలను బుచ్చిదాసు అందిస్తాడు.

**ఆరవ అధ్యాయం: శ్రీ యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి బతుకమ్మ పాట**

బండ సోమారం గ్రామానికి చెందిన కృష్ణదాసు కోరిక మేరకు ఈ బతుకమ్మ పాటను రచించాడు బుచ్చిదాసు. ఈ బతుకమ్మ పాటను చదువుతున్నప్పుడు బుచ్చిదాసు ఒక టూరిస్ట్ గైడ్ లాగ అనిపిస్తాడు. యాదగిరి క్షేత్ర మహాత్మ్యాన్ని తెలియజేస్తూ నరసింహ స్వామి ఆవిర్భావ విశేషాలను వర్ణిస్తాడు. భక్తులకు గుట్టకున్న మెట్ల దగ్గరి నుండి గోపురాలు, విష్ణు పుష్కరిణి, గర్భాలయం, వంటశాల, నిత్య సేవల భవనాలు, కళ్యాణ మంటపం, నిత్యాన్నదాన సత్రంతో పాటు మొత్తంగా యాదగిరి వైభవాన్ని పాటలో దర్శింపజేస్తాడు. పాట అంతంలో మానవ నిర్మాణ విజ్ఞానాన్ని ప్రతిబింబించే ఘటశోధనను విపులంగా వివరించడం చూడవచ్చు.

**ఏడవ అధ్యాయం: ఈగ బుచ్చిదాసు సాహిత్యం– సామాజికాంశాలు**

ఈగ బుచ్చిదాసు సాహిత్యం ఆమూలాగ్రంగా పరిశీలిస్తే జీవసమానత్వం, స్త్రీ సమ్మానత, కులనిరసన, నైతిక విలువలు దర్శనమిస్తాయి. సమస్త జీవులు హరి స్వరూపాలే అంటూ ఏకాత్మ భావనను ప్రకటిస్తాడు కవి. స్త్రీ లేకపోతే సృష్టి లేదు. స్త్రీయే సమాజపు అస్తిత్వం. అమ్మలా, చెల్లిలా, అక్కలా స్త్రీయే జగతిని సంచాలనం చేస్తుందని పేర్కొంటూ స్త్రీని గౌరవించాలంటాడు. మదగర్వితులై పెద్దలని దూషించకూడదని, వారిపట్ల పూజ్యభావన కల్గి ఉండాలని వివరిస్తాడు. మనిషి తన మనుగడకు పాటించవలసిన సుగుణాలను తన సాహిత్యంలో అందిస్తాడు.

**ఎనిమిదవ అధ్యాయం : ఈగ బుచ్చిదాసుపై ఇతర కవుల ప్రభావం**

ఈగ బుచ్చిదాసుపై భద్రాచల రామదాసు, కాకుత్థం శేషప్ప, రాకమచర్ల వెంకటదాసు, మన్నెంకొండ హనుమద్దాసు, వీరబ్రహ్మేంద్ర స్వామి, కబీరదాసు మరియు వార్కరి వాగ్గేయకారుల ప్రభావం కనబడుతుంది. తన సంకీర్తనల్లో, శతకాలల్లో ఈ ఛాయలని చూడవచ్చు.

**తొమ్మిదవ అధ్యాయం : ఈగ బుచ్చిదాసు సాహిత్యం – భాషాంశాలు**

ఈగ బుచ్చిదాసు సాహిత్యంలో ముఖ్యంగా తెలంగాణాకే ప్రత్యేకమైన, తెలంగాణలోనే పలుకబడే జాతీయాలు, సామెతలు కనిపిస్తాయి. ఈయన సంకీర్తనల్లో హ్రస్వాలు దీర్ఘాలుగా, దీర్ఘాలు హ్రస్వాలుగా మారడం గమనించవచ్చు. కవి తన గురువు వల్లనే తాను సంకీర్తనం చేయగల్గుతున్నానని గురుభక్తిని ప్రకటిస్తూ తనదైన స్వీయ ముద్రను సంకీర్తనాంతంలో ప్రకటిస్తాడు. ఈ సంప్రదాయం మరాఠీ అభంగాలలో, గజళ్ళలో కనిపిస్తుంది. శ్రీ యాదగిరి నరహరి శతకంలో అంత్య ప్రాసలు, సంబోధనలు అధికంగా కనబడతాయి. ఈయన సాహిత్యంలో అడుగడుగునా అమూల్యమైన తెలంగాణా పదసంపదను, ఆదాన ప్రదానాలను చూడవచ్చు.

ముగింపు : తెలంగాణలో పరిఢవిల్లిన దాస సంప్రదాయం కన్న గొప్ప వాగ్గేయ శిరోమణి ఈగ బుచ్చిదాసు. యాదగిరి వాసుని మహిమ చేత వాగ్గేయ శక్తిని పొంది, భక్తిని, జ్ఞానాన్ని, వైరాగ్యాన్ని, తత్త్వాన్ని, మోక్షాన్ని అందించే అమూల్యమైన సంకీర్తనలను, శతకాలను రాసి అజరామరుడైనాడు.

**ఆధార గ్రంథాలు :**

1. డా.పి. భాస్కరయోగి (యాదగిరి క్షేత్ర సంకీర్తన కవి ఈగ బుచ్చిదాసు) సంకీర్తనలు, శ్రీ యాదగిరి నరహరి శతకం, బతుకమ్మ పాట.

2. ఈగ బుచ్చిదాసు (శ్రీ యాదగిరి లక్ష్మీ నారసింహ స్వామి శతకం)

3. ఈగబుచ్చిదాసు (శ్రీ యాదగిరి శివభజన కీర్తనలు)

## మూసీ పదవినోదం - 28

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 3 ర | 5 | పా | 6 | క | 9 | లు |
| 2 ర | | ర | | లు | X | | 10 కా |
| 4 | ము | | X | 8 | 11 | ము | X |
| వి | | X | 7 | పిం | జ | | X |
| | ట్టు | X | 13 | డి | | X | 19 |
| 12 కా | | 14 వా | | X | 17 మం | 18 | లం |
| డు | X | 16 | ర | | X | 20 | చే |
| X | 15 | ట | X | 21 | పా | ల | |

**ఆధారాలు (అడ్డం)**

1. ఎండాకాలంలో ఈ పానకాలు ఎంత బాగుంటాయో (08)
2. ఈ మనుష్యుల బుద్ధులు ఒకరకంగా ఉండవు...(5)
4. భూమి, అష్టదిగ్గజములలో ఒక ఏనుగు (3)
7. బంగారం (5)
8. దాసుడు (3)
10. సంస్కృతంలో నల్ల జీలకర్ర తిరగబడింది (2)
12. శ్మశానపు వాగు (4)
13. బండి నాగలి మొదలగువానిని నడపటానికి ఎద్దు మెడపై నుంచి కట్టెడు కఱ్ఱను పిలవండి (3)
15. పగులు (2)
16. ఆరు రుచులలో ఒకటి (3)
17. పెసలు మొదలగు గింజలను వేయించే పెంకును తెలంగాణంలో ఇలా అంటారు (3)
20. ప్రయత్నం అని అర్థం వచ్చే విచేష్ట పదంలో చివరి అక్షరం అలిగి పారిపోయింది (2)
21. మాపు వ్యాపించిందని నాలుగు అక్షరాలలో చెప్పండి (4)

**ఆధారాలు (నిలువు)**

1. చెరకు వీడికి విల్లు. అందుకే మన్మథునికి ఈ పేరు (7)
3. డబ్బులు చెల్లించడాన్ని తెలంగాణములో ఇలా అంటారు (6)
5. కలింగాంధ్ర మాండలికంలో తక్కువ అనటానికి ఇలా అంటారు (3)
6. వినాయకుడు దీనితోటే ఆకారం ధరించాడట (5)
7. అడవి కాకరని ఇలా అంటారు (4)
9. పైన పూసే మందును 'రం' అంటుకొంది (4)
10. క్రియలో కాలటం, నామవాచకంలో పాదం కిందినుంచి పైకి (2)
11. వివాహములో లాజ (పేలా)లతో చేయు ఒక హోమం (4)
14. తగాదాను ఇంకో తెలుగు పదంతో చెప్పండి (3)
18. కపిల ధేనువు (3)

**(సమాధానాలు ఈ సంచికలోనే మరో పేజీలో....)**

**నిర్వహణ**


**డా. తాడేపల్లి పతంజలి**

ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట.

ఫోన్ : 98666 91587

## సత్సంగం

### భగవంతుడు ఆత్మకి భిన్నమా?



ఆత్మే భగవంతుడు. "అహం" అంటేనే భగవంతుడు. నీవు అహంకారాన్ని పట్టుకొని ఉండడం వల్లనే ఈ ప్రశ్న ఉదయిస్తుంది. నీవు ఆత్మనే పట్టుకొని ఉంటే, ఉదయించదు. ఆ ఆత్మ దేనినీ అడుగదు, అడుగలేదు. ఆత్మకి భిన్నంగా భగవంతుడుంటే, ఆయనని అనాత్మమైన భగవంతుడనాలి. అది అసందర్భం కదా. వాస్తవంగా ఉన్నదల్లా, ఉన్నట్టు తెలియని, భగవంతుడే. ఉన్నట్లు అనిపించే వ్యక్తే ఎప్పుడూ ఉండని వాడు. తాను లేననీ, శూన్యమనీ గ్రహించిన స్థితే ఉత్తమమైనదని ఋషులు చెప్తారు.

నీవొక వ్యక్తివనీ, విశ్వమంటూ ఒకటున్నదనీ, దానికి అవతల భగవంతుడున్నాడనీ అనుకుంటావు. ఇందులో భేదభావముంది. ఈ భావం పోవాలి. నీకు కాని, విశ్వానికి గాని భగవంతుడు వేరుగా లేదు.

భగవంతుడు అందరి హృదయాలలోనూ ఉండటమే కాదు. అన్నిటికీ ఆధారమాయనే. అన్నిటికీ మూలమాయనే. అన్నీ చివరికి విశ్రమించేది ఆయనలోనే. అన్నీ ఆయన నుండే ఉదయిస్తాయి. ఆయనలోనే వసిస్తాయి, ఆయనలోనే లీనమవుతాయి. అందువల్ల ఆయన వేరు కాదు.

భగవంతుని నుండి ఒక రేణువు విడిపోయి విశ్వమవుతుందని, అర్థం కాదు. ఆయన శక్తి పనిచేస్తోంది. దానివల్ల ఆ శక్తిలోని ఒక పార్శ్వం విశ్వంగా అభివ్యక్తమయింది. అట్లాగే, పురుషసూక్తంలో అన్ని జీవులూ ఆయనకొక పాదమన్నప్పుడు బ్రహ్మానికి ఎన్నో భాగాలున్నట్లు అర్థం కాదు.

మూసీ సాహిత్యధార

పుస్తక సమీక్ష

# తీరం చేరని కెరటము [నవల]

వల్లంపట్ల గిరీశ్ కుమార్, ఫోన్ : 9849752600

సువిశాల తెలుగు సాహితీ జగత్తులో సుపరిచితమైన రచయితలతో పాటు రచయిత్రులు కూడా ఎందరో ఉన్నారు. అలాగే తెలుగు సాహితీ లోకానికి ఇప్పటివరకు పరిచయం లేని రచయితలు, రచయిత్రులు కూడా మరుగునపడి ఉన్నారు. అలాంటి కోవకు చెందిన ఒక రచయిత్రి బ్రహ్మదేవుల మనోహరాబాయిగారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోరుట్ల ప్రాంతానికి చెందిన మనోహరాబాయిగారు 8 నవలలు, 20 కథలను ఎన్నో కవితలను రచించారు. తెలిసో, తెలియకో వీరు తమ రచనలను పత్రికలకు పంపకపోవడం వలన అవి అంతగా ప్రాచుర్యానికి నోచుకోలేదు. వరంగల్ జిల్లా మహబూబాబాద్‌లో జన్మించిన మనోహరాబాయిగారు ఉద్యోగరీత్యా కోరుట్ల ప్రాంతానికి వచ్చి, ఇక్కడే స్థిరపడ్డారు. హెచ్.ఎస్.సి. వరకు చదివి, ఎస్‌జిబిటి అనే శిక్షణ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన అనంతరం కవితలతో ప్రారంభించి, కథలు, నవలల వైపు తన రచనా పరంపరను కొనసాగించారు 1947లో జన్మించి, 2020లో కైవల్యాన్ని పొందిన మనోహరాబాయిగారి నవలల్లో ప్రేమ, సంఘ సంస్కరణ, స్త్రీవాద, కుటుంబ నవలలున్నాయి. వాటిలో ప్రస్తుతం చర్చనీయమైనది **తీరం చేరని కెరటము** నవల. ఈ నవలను పవిత్ర ప్రేమకు ప్రతిరూపమైన నవలగా చెప్పవచ్చు.

ఈ నవలా రచనకు ప్రేరణ మణిబాయి అనే స్నేహితురాలు అని, ఈ నవల వారికే అంకితం అని నవలా ప్రారంభంలో రచయిత్రి చెప్పుకున్నారు. ఏ రచనకైనా ప్రారంభ ముగింపు తేదీలను ప్రకటించుకోవడం మనోహరాబాయిగారి ప్రత్యేకత.

(తీరం చేరని కెరటము నవలను జులై 10, 1929న ప్రారంభించి

మురారి, మంజు, వసంతలు ప్రధాన పాత్రలుగా సాగిన 'తీరం చేరని కెరటము' నవలలో ఈ ముగ్గురి మధ్య త్రికోణాకృతిలో ప్రేమ సాగుతుంది.

మురారి తల్లి తన పిల్లలకు తండ్రి లేని లోటు తెలియకుండా పెంచి, పోషిస్తుంది. మురారిని టీచర్ ట్రైనింగ్ వరకు చదివిస్తుంది. ఏ పనీ లేకుండా ఖాళీగా ఉంటున్నావని తల్లి కోపగించుకోవడంతో కట్టుబట్టలతో ఇల్లు వదిలి వచ్చేస్తాడు మురారి. హైద్రాబాద్ వెళ్ళి, తన ట్రైనింగ్‌మేట్ అయిన మంజుద్వారా ఒక ప్రైవేట్ స్కూల్లో ఉపాధ్యాయుడిగా చేరతాడు. ప్రతిరోజు సాయంత్రం తాను అద్దెకున్న ఇంటివారి పిల్లలకు ట్యూషన్ చెప్తుంటాడు. వారిలో యుక్త వయస్కురాలైన వసంతకు, మురారికి మధ్య ప్రేమ చిగురిస్తుంది. మురారికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన తరువాత పెళ్ళి చేసుకోవాలను కుంటారిద్దరు. కరీంనగర్‌లో ఉద్యోగ అవకాశం ఉందని తెలిసి, మురారి కరీంనగర్‌కు వెళ్తాడు. అక్కడ ఉద్యోగం దొరకడం ఆలస్యమవుతుంది. ఈలోగా వసంతకు పెద్దలు పెళ్ళి నిశ్చయిస్తారు. ఈ పెళ్ళి ఇష్టంలేదని వసంత ఎన్నిరకాలుగా చెప్పినా పట్టించుకోకపోవడంతో వసంత ఆత్మాహుతి చేసుకుంటుంది. ఉద్యోగంలో చేరిన తరువాత మంజునుండి ఉత్తరం రావడంతో హైదరాబాద్ వస్తాడు మురారి. వసంత చనిపోయిన విషయం తెలిసి, తట్టుకోలేని బాధతో కుప్పకూలి పోతాడు. మురారి కొద్దిగా కోలుకోగానే తన ప్రేమ విషయం బయటపెట్టి పెళ్ళి చేసుకోమని కోరుతుంది మంజు. కాని మురారి తన మనసులో వసంతకు తప్ప మరొకరికి చోటు లేదు అని చెప్పి వెళ్ళిపోతాడు.

ఇది సంక్షిప్తంగా **తీరం చేరని కెరటం** నవలలోని విషయం.

ఈ నవలలో ప్రేమతో పాటు మధ్యతరగతి కుటుంబీకుల జీవన విధానం కూడా ప్రతిబింబిస్తుంది. మధ్యతరగతి కుటుంబాలుగా, మురారి కుటుంబాన్ని, మురారి అద్దెకున్న ఇంటి కుటుంబాన్ని చూపించారు రచయిత్రి.

మురారి తల్లి సరళాదేవి తన భర్త మరణించినప్పటికీ ధైర్యం కోల్పోకుండా కిరాణాకొట్టు పెట్టుకొని తొమ్మిదిమంది సంతానాన్ని పోషిస్తుంది. ఐదుగురి చదువులు పూర్తి చేయిస్తుంది. పెద్దవాళ్లిద్దరికీ అతికష్టం మీద ఉద్యోగాలు ఇప్పించగలుగుతుంది. కాని వాళ్ళు చిన్నవాళ్ళను గాని, తల్లిని గాని పట్టించుకునేవారు కాదు. "అద్దాల నాడు బిడ్డలు కాని గడ్డాలనాడు బిడ్డలా" అని నిరాశతో ఓ నవ్వు నవ్వుకునేది సరళాదేవి.

ఎంత కష్టమైనా తల్లి తన పిల్లలను పోషిస్తుంది. కాని ఎంత సుఖంగా ఉన్నా పిల్లలు తమను కన్నవారిని పోషించలేరు అని చెప్పడానికి నిదర్శనంగా ఈ సన్నివేశాన్ని చూపించారు రచయిత్రి.

నేటి యువతీయువకులు మానసికమైన ప్రేమ కంటే భౌతికమైన ఆకర్షణకే ఎక్కువ లోనవుతున్నారు. కానీ తీరం చేరని కెరటం నవల అందుకు అతీతమైనది. ఈ సన్నివేశం చూడండి.

"రెయ్యిమని ఓ సుడిగాలి వీచింది. దాని తాకిడికి వసంత అనుకోకుండా అతని ఒడిలో వాలింది. అతని చేతులు ఆమె దేహాన్ని గట్టిగా చుట్టుముట్టాయి. ఏదో తెలియని ఆనందం, ఓ తియ్యని

అనుభూతి వారి శరీరాల్లో ప్రవేశించాయి. కళ్ళు మత్తుగా వాలి పోతున్నాయి. అతని పెదవులు ఆమె పెదవులను తాకడానికి ఆరాట పడుతున్నాయి. ఒక్కక్షణం ఈ లోకాన్ని మరచి, మన్మథలోకంలోకి వెళ్ళి, విహార యాత్ర చేయడానికి పరుగులు పెడుతున్నాయి వారి తనువులు. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కౌగిలి విడిపోయింది. ఒకరినొకరు ఏమైంది అన్నట్లు చూసుకున్నారు. తప్పు చేస్తున్నారు కదూ! ఆమె కండ్లు అతన్ని ప్రశ్నిస్తున్నాయి. అవును మనది పవిత్ర బంధం. కల్మషం లేని ప్రేమ వివాహబంధంతోనే నిన్ను నేను చేరుకోవాలి అన్నట్లు అతని కండ్లు ఆమెకు చెప్పాయి. తాళితోనే ఆలిని కావాలని ఉంది అని ఆమె చిరునవ్వు సమాధానం చెప్పింది."

మానసిక నిగ్రహానికి ప్రతిరూపమైన ప్రేమజంట పవిత్రతకు చిహ్నామైన ప్రేమతో మనసు ద్వారానే ఒకరినొకరు అర్థం చేసుకోగలరు అని చెప్పడానికి ఈ సన్నివేశాన్ని చిత్రీకరించారు రచయిత్రి.

ఎంతో కష్టపడి పెంచి పోషించిన తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా ప్రేమ పేరుతో తమకు నచ్చినవారితో లేచిపోయి పెళ్ళి చేసుకోవడం నేటి యువత చేస్తున్న పని. అలాగే కొన్ని ప్రాంతాల్లో పిల్లల అభిప్రాయాలకు ముఖ్యంగా ఆడపిల్లల అభిప్రాయాలకు విలువనివ్వకుండా స్వాభిప్రాయం మేరకే తమ పిల్లల పెండ్లిళ్ళు నిశ్చయిస్తున్నారు తల్లిదండ్రులు. ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉంది. ఈ సన్నివేశం చూడండి.

"అమ్మా! తనకు నచ్చితే సరా! నాకు నచ్చాలిగా. నాకూ ఒక మనసంటూ ఉంటుందిగా. దానికి ఇష్టాయిష్టాలు ఉండవా?" అని అడిగింది వసంత.

వసూ! నీవు అనవసరంగా మాట్లాడకు. పిల్లవాడు నీకన్నా అందంగా ఉంటాడట. చదువు, తెలివి, ఆస్తిపాస్తులు ఉన్నాయట. పైగా మీ మేనమామగారికి కావలసిన వాళ్ళు కూడా అని అంటుంది అనంతలక్ష్మి.

ఎక్కువమంది ఆడపిల్లల తల్లిదండ్రుల నియంతృత్వ ధోరణి ఇలా ఉంటుంది అని ఈ సన్నివేశం ద్వారా తెలియజేశారు రచయిత్రి.

తాళి కట్టి ఆలిగా మార్చుకుంటేనే పెళ్ళి అని భౌతిక సమాజం భావిస్తుంది. కాని మనసులు ఇచ్చిపుచ్చుకోవడమే అసలైన పెళ్ళి అని నిజమైన ప్రేమికులు భావిస్తారు. వసంత మరణం తరువాత "నా జీవితంలో శాశ్వతంగా ఉండిపోవడానికి అభ్యంతరం లేదుగా? అని మంజు ప్రశ్నించినపుడు తనకు మళ్ళీ పెళ్ళా? మళ్ళీ జీవితం ప్రారంభించడమా? అని మనసులో ప్రశ్నించుకుంటాడు మురారి."

వసంత, మురారిలకు పెళ్ళి జరుగలేదు. మనసులు మాత్రమే ఇచ్చిపుచ్చుకున్నారు. అదే తమకు జరిగిన పెళ్ళి అని మానసికంగా స్థిరపడ్డాడు మురారి అని చెప్పకనే చెప్పారు రచయిత్రి.

ఏదైనా ఒక సంఘటన జరిగినప్పుడు ఆ సంఘటనపై అందరి అభిప్రాయాలు ఒకేరకంగా ఉండవు. విభిన్న వయస్సుల వారి అభిప్రాయాలు, స్త్రీ పురుషుల అభిప్రాయాలు వేరువేరుగా ఉంటాయి. అలాంటి ఒక సన్నివేశాన్ని ఇలా చూపించారు రచయిత్రి.

వసంత శవం వీధిగుండా వెళ్తుండగా "పాపం పెళ్ళి చేసుకొని, పసుపు, కుంకుమలతో వెళ్ళవలసిన పిల్ల. అప్పుడే ఏం మునిగి పోయింది. అన్యాయంగా పిల్లను చంపుకున్నారు అన్నారు ముసలివాళ్ళు.

ఇష్టంలేని పెళ్ళిళ్లు చేసి ఇలాగే ప్రాణాలు తీస్తారు అన్నారు పడుచువాళ్ళు.

కాలం మారింది. మనం కూడా మారాలి అన్నారు నడివయస్కులు.

మనోహరాబాయిగారికి సినిమా పాటలంటే చాలా ఇష్టంగా ఉన్నట్టుంది. టీవీలు లేని కాలంలో అందరికి రేడియో కాలక్షేపంగా ఉండేది. ఈ నవలలో సందర్భానికి తగినట్టుగా పాటలను తీసుకోవడానికి రేడియోను ఒక ఆలంబనగా తీసుకున్నారు రచయిత్రి. కొన్నిచోట్ల వివిధ పాత్రల చేత కూడా సందర్భోచిత పాటలు పాడించారు.

వసంత రూపాన్ని చూసి మురిసిపోయాడు మురారి. 'అందానికి అందానివై ఏనాటికి నాదానివై నా ముందు నిలిచినదానా నాదానా' అనే పాట రేడియో నుండి వినబడుతుంది.

ఇలాంటి సన్నివేశాలు తీరం చేరని కెరటము నవలలో ఆసాంతం కనిపిస్తాయి. ఈ నవలకు ఈ పేరు పెట్టడానికి వసంత మురారి పాత్రలే ప్రధానం. వసంత అనే కెరటం మురారి అనే తీరాన్ని చేరకుండానే మధ్యలోనే అదృశ్యమైంది. మురారి తిరిగివచ్చే సరికి కనీసం వసంత చితాభస్మం కూడా మిగలదు. వసంత దహన సంస్కారం జరిగిన ప్రదేశానికి వెళ్ళి, వసంతను తలుచుకుంటూ ఓ తీరం చేరని కెరటమా! అని దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తాడు మురారి.

ఇలా నేటి సమాజంలోని యువతీ యువకుల తీరుతెన్నులను ప్రస్తావిస్తూ వారి తల్లిదండ్రులు చేస్తున్న తప్పులను పరోక్షంగా ఎత్తి చూపుతూ, మరోవైపు పవిత్ర ప్రేమకు ప్రతిరూపాలుగా మురారి, వసంత పాత్రలను చూపించి, రాబోయే తరాల ప్రేమికులకు మార్గదర్శకంగా తీరం చేరని కెరటము అనే నవలను రచించారు రచయిత్రి శ్రీమతి బ్రహ్మదేవుల మనోహరాబాయిగారు.

ISSN 2457-0796

# సామాజిక మాధ్యమ వేదికగా కొత్త పుంతలు తొక్కుతున్న పద్య ప్రక్రియ

**గడ్డం సత్యపాల్‌రెడ్డి,** తెలుగు అధ్యాపకులు, దిలావర్‌పూర్, ఫోన్ : 9963 668 822

కరోనా మహమ్మారి ప్రపంచానికే కొత్తపాఠాలు నేర్పింది. ఈ కరోనా లాక్డౌన్ వల్ల చాలాకాలం పాటు ప్రపంచమంతా ఇంటికే పరిమితం అయ్యింది. స్వార్థం నిండిపోయిన ఈ లోకానికి కరోనా తనను తాను పున:సమీక్ష చేసుకునేట్లు చేసింది. మనిషి జీవితం అశాశ్వతమని, మనుషుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు అవసరమని మళ్లీ ఒకసారి అందరిని ఆలోచింపజేసింది. ఈ కరోనా కాలంలో ప్రజలందరు ఇంటికే పరిమితమయినప్పటికి, వారి వారి ప్రతిభను వెలికితీసే సమయం దొరికింది. ప్రజలందరూ కూడా ఈ తీరికవేళ భయాన్ని ప్రక్కనపెట్టి,వారికి ప్రావీణ్యమున్న, ఆసక్తి ఉన్న విషయా లందు దృష్టిని పెట్టారు. ముఖ్యంగా ఈ కరోనా కాలంలో తెలుగు సాహిత్యానికి ఎంతో లాభం చేకూరింది. ఈ కరోనా కాలంలో వచన కవితలు, పద్యాలు, పాటలు, వ్యాసాలు పుష్కలంగా వచ్చాయి. ఎందరో కొత్త కవులు తెలుగు సాహిత్యంలో ప్రవేశం చేశారు.

సాంకేతిక విప్లవం తీవ్రంగా ఉన్న ఈ రోజులలో సమాచార మార్పిడికి గాని, సమూహ సమావేశాలకు గాని సాంకేతికను జోడించి వినూత్న రీతిలో సమాజం ముందుకు వెళ్తుంది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల జోరు ఇటీవల బాగా పెరిగింది. కరోనా కాలంలో తరగతులతో పాటుగా సమావేశాలు కూడా జూమ్, గూగుల్ మీట్‌ల ద్వారానే జరుగుతున్నాయి. ముఖ్యంగా సాహితీ సమావేశాలు, జాతీయ సదస్సులు, పుస్తకావిష్కరణలు, పుస్తక సమీక్షలు, అవధానాలు, పద్యపఠనాలు, కవితా సమ్మేళనాలు కూడా ఈ మాధ్యమాల ద్వారానే జరుగుతున్నాయి. అలాగే వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ మొ।। సామాజిక మాధ్యమాలు కూడా సాహత్యసేవలో ముందుంటున్నాయి.

తెలుగువారందరూ గర్వించదగ్గ సాహిత్య ప్రక్రియ పద్యము. ఛందోబద్ధమైన నియమాలతో, యతి, ప్రాసలు కూడి లయాత్మకమైన రీతిలో సాగుతుంది. పూర్వకాలంలో తెలుగు సాహిత్య రచన పూర్తిగా పద్యరూపంలోనే సాగేది. వైజ్ఞానిక రచనలు, గణిత రచనలు, సాహిత్యపరమైన రచనలు మొదలుకొని అన్ని రకాలైన రచనలు కూడా పద్యాల్లో సాగేవి. క్రీ.శ 848 నాటి పండరంగని అద్దంకి శాసనంలో ఒక తరువోజ పద్యం కనిపించింది. దీనినే మొట్టమొదటి పద్యంగా చెప్తుంటారు. క్రీ.శ. 934 నాటి యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో 5 సీసపద్యాలు, విరియాల కామసాని గూడూరు శాసనంలో 3 చంపకమాలలు, 2 ఉత్పలమాల పద్యాలు లభించాయి. వీటి ఆధారంగా నన్నయకు ముందే తెలుగు పద్యం ఉందని చెప్పవచ్చు. కాని లిఖిత గ్రంథాలు మాత్రం లభించలేదు.

ఆదికవి నన్నయ చేత అక్షర రమ్యతను కూర్చుకొని మొదలిడిన పద్యం శివయుగమున జాను తెనుంగై ద్విపద కావ్యాలుగా పండింది. తిక్కన చేత లలితపదాలద్దుకొని నాదమాధుర్యమైన పద్యాలుగా ప్రవహించింది. ఎర్రనచేత ప్రబంధపు పురుడు పోసుకొని, నాచన సోమన చేతిలో ధ్వని ప్రధానమైంది. శ్రీనాథుని గాఢ ప్రతిభచే ఉద్దండ లీలగా మారినట్టి పద్యము, పోతనచేతిలో శబ్దాలంకారమై భక్తి రసాన్ని ప్రవహింపజేసింది. రాయల భువన విజయంలో ప్రబంధాలుగా వెలుగొంది, శతక ప్రక్రియను చేరి వేమన పద్యాలుగా తెలుగువారందరి నాలుకలపై నాట్యములాడింది.




ఆధునిక యుగంలో తెలుగు సాహిత్యంలో వచనసాహిత్యం ప్రవేశించిన నాటినుండి పద్యము వెనుకంజవేయడం ప్రారంభించింది. నేడు తెలుగు సాహిత్యమంటేనే వచన సాహిత్యమనే దశకు చేరుకుంది. సాహిత్యంలో పద్యానికి పట్టుసడలింది. మెల్లమెల్లగా కనుమరుగై పోతుందేమో నని అనుకునేంతగా పద్యం వెనుకబడింది. కాని సామాజిక మాధ్యమాలు మళ్ళీ పద్యానికి ఊతమిస్తున్నాయి. ఇది నిజంగా ఆనందదాయకం. ముఖ్యంగా వాట్సప్ వేదికగా పద్య సాహిత్యం మళ్ళీ పున:వైభవం సంతరించుకుంటుంది.

**తెలంగాణ తెలుగు కళానిలయం** అనే సమూహం భైంసా నుండి కదారి దశరథ్ గారు నిర్వహిస్తున్నారు. వీరు నిత్య పద్యయజ్ఞం పేర ప్రతి రోజు ఒక




అంశంపై పద్యాలను రాయాలని కవులను ప్రోత్సహిస్తు న్నారు. ఈ సమూహంలో సుమారుగా 85 మంది కవులు నిత్యం పద్య రచనలో పాల్గొంటున్నారు. దీనికి గౌరవ సలహాదారుగా ప్రముఖ కవి శ్రీ మడిపల్లి భద్రయ్య గారు వ్యవహరిస్తూ, పద్య రచనలో మెళకువలు నేర్పుతున్నారు. ఈ సమూహం నుండి ఇప్పటి వరకు సుమారుగా 8వేలకు పైగా ఆటవెలది, తేటగీతి, కందం, ద్విపద పద్యాలు రాయబడ్డాయి. సుమారుగా వేయికి పైగా పద్యాలను శ్రీ మడిపల్లి భద్రయ్య గారు, కోనింటి రమేష్ (హైదరాబాద్) గార్లు రాయడం జరిగింది. శ్రీ కోవెల శ్రీనివాసాచార్య, కడారి దశరథ్, భీమకంటి రవీందర్, రావుల చంద్రకళ గార్లు 5వందలకు పైగా పద్యాలు రాయగా వి. జలంధర్ 3వందలకు పైగా పద్యాలు రాశారు. 2వందలకు పైగా పద్యాలు 8మంది కవులు, శతకము పూర్తి చేసినవారు 19 మంది కవులు ఉన్నారు. అలాగే ఈ సమూహం ద్వారా శతకం పూర్తి చేసిన శ్రీ గద్దం సత్యపాల్‌రెడ్డి గారి "సత్యసూక్తి శతకం" ముద్రణపూర్తి అయి పాఠకులకు అందుబాటులోకి వచ్చింది. ఇంకా సాగర్ల సత్తయ్యగారి ఖండకావ్యం, కొండూరి పోతన్న గారి సీసపద్యశతకం పూర్తయి ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్నాయి.

**పద్య పరిమళం** అనే సమూహాన్ని నిజామాబాద్ జిల్లా, డిచ్‌పల్లి మండలం మిట్టపల్లి వాస్తవ్యులు శ్రీ మఠిపల్లి శ్రీధరాచార్యులు, తెలుగు భాషోపాధ్యాయుల వారు నిర్వహిస్తున్నారు. ఈ సమూహం నందు 35 మంది కవులు నిత్యం పద్యరచన కావిస్తున్నారు. నిత్యం దత్తపదులు, చిత్రాలను ఇచ్చి పద్యరచనను ప్రోత్సహిస్తున్నారు. ముఖ్యంగా ఈ సమూహంలో వృత్తపద్యాలు రాసే కవులుండడం విశేషం. ఉత్పలమాల, చంపకమాలలతో పాటుగా మత్తకోకిల, మందాక్రాంత వృత్తము, సీసము, కందము మొ॥ పద్యాలు రాస్తున్నారు. శ్రీ మఠిపల్లి శ్రీధరాచార్యులు శ్రీ ధర్మపురి లక్ష్మీనరసింహ శతకం, శ్రీ తిరుమలేశ శతకాలను పూర్తిచేసి పాఠకులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. శేషం వేణుగోపాలశర్మగారు సరస్వతీదేవిపై శతకం పూర్తి చేయగా, సూరం ఆనంద్, పూర్ణకృష్ణ, చక్రపాణి సుమతి గార్లు చక్కని పద్యాలు రాస్తూ పద్యకవులుగా వెలుగొందుతున్నారు.

మెదక్ జిల్లా నుండి **"మెతుకు సీమ సాహితీ సాంస్కృతిక సంస్థ"** అనే సమూహాన్ని అష్టావధాని అవుసుల భానుప్రకాశ్ గారు నిర్వహిస్తున్నారు. ఈ సమూహం నుండి 250 మంది కవులు నిత్యం పద్యరచన కావిస్తున్నారు. సుమారుగా 10వేలకు పైగా పద్యాలు ఈ సమూహం నుండి వెలువడ్డాయి. 26 పుస్తకాలు ముద్రించబడ్డాయి. ఇటీవల వీరు **"పద్య ప్రభంజనం"** పేర 6వందల కవులచే రెండు వేల మూడు వందల పద్యాలతో సంకలనం వెలువరించారు. ఆధునిక కాలంలో పద్య ప్రక్రియలో వచ్చిన అతిపెద్ద సంకలనంగా దీనిని చెప్పవచ్చు.

**"సైనికార్చన"** పేర 3వందల కవులచే సైనికులపై పద్యాలు, పి.వి. శతకం, కరోనశతకం ఆన్‌లైన్ ద్వారా సంకలనాలుగా వెలువరించారు. శ్రీ అవుసుల భానుప్రకాశ్ గారి కృషి పద్య ప్రక్రియకు ఎంతో మేలు చేకూరుస్తుంది. ఈ సమూహం నుండి భానుప్రకాశ్ గారి వాగ్దేవతాశతకం, భూమయ్య గారి భూమనార్య శతకం, రాళ్ళబండి బసవయ్య గారి చిలుక శతకం మొ॥నవి వెలుబడ్డాయి.

మెదక్ జిల్లా ఏడుపాయల కేంద్రంగా **"మల్లినాథ సూరి కళాపీఠం"** వారు ఒక సమూహం ఏర్పరచి పద్య రచనకు ప్రోత్సహిస్తున్నారు. "అమరకుల దృశ్య కవి" గారు ఏర్పరచిన ఈ కళాపీఠం **"సప్తవర్ణముల సింగిడి"** పేర వారంలో రోజుకు ఒక అంశం చొప్పున వివిధ ప్రక్రియలను ప్రోత్సహిస్తున్నారు. కవన సకినం, దృశ్యపద్యము, సాత్వికం, స్వేచ్ఛాకవిత్వం, పురాణం, హృదయస్పందన ఇలా ఒక్కొక్క రోజు ఒక్కొక్క విషయంపై పద్యాలు రాస్తున్నారు. ఈ సమూహం విశిష్ట ఆస్థాన కవి బి. వెంకట్ గారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి పద్య రచనను సమీక్షిస్తున్నారు. **"తెలుగు కవివర"** పేరిట 105 అంశములపై ఇప్పటి వరకు పద్య రచనను పూర్తిచేసారు. ఈ సమూహం నుండి ఇంతవరకు సుమారుగా 5 వేల పద్యాలు వచ్చాయి. దీనికి అనుబంధంగా **"పద్యమంజీరం"** పేర ఒక సమూహం ఏర్పరచి పద్య రచనను ప్రోత్సహిస్తున్నారు. తిరుపతి నుండి శ్రీ కె.వి. శేషకుమార్ గారు పద్య రచనను సమీక్షిస్తూ కవులకు పలు సూచనలు చేస్తున్నారు. సుమారుగా 70 మంది కవులు పద్య రచనను చేస్తున్నారు. ఇంతవరకు ముగ్గురు కవులు వందకు పైగా పద్యాలు పూర్తి చేసుకున్నారు.

**"తెలుగు దళం"** పేర కరీంనగర్ నుండి మరొక సమూహం నిర్వహించబడుతున్నది. దీనిలో 174 మంది కవులు నిత్యం పద్యరచన కావిస్తున్నారు. ఈ సమూహం వారంలో కొన్ని రోజులు పద్య ప్రక్రియకు కేటాయించి చిత్రవ్యాఖ్య, దత్తపదులు, సమస్యాపురాణం మొ॥ విధాలుగా పద్యరచనను ప్రోత్సహిస్తున్నారు. ఈ సమూహాన్ని శ్రీ నంది శ్రీనివాస్, సాగర్ల సత్తయ్య, సంపత్‌రాజ్,

అపర్ణ మధు, సుమతి సారంగపూర్కర్, ఆవాసి జ్యోతి, గంగుల శ్రీకర్ గార్లు నిర్వహిస్తున్నారు. దీని నుండి గత 2 సం॥లలో 5 వేల పద్యాలు తెలుగు సాహిత్యానికి అందించబడ్డాయి. శ్రీమతి సుమతి సారంగపూర్కర్ గారి వాసుదేవ శతకం, చింతలతాడెం రజిత గారి సుపథ శతకం ముద్రించబడ్డాయి.

**"పద్య పరిమళం"** పేరుతో మరొక సమూహం సిరిసిల్లా కేంద్రంగా 25 మంది కవులతో నిర్వహించబడుతుంది. సాహితీ మిత్రులంతా కలిసి ఏర్పరచుకున్న ఈ సమూహంలో ప్రతిరోజు ఒక అంశంపై పద్య రచన కావిస్తున్నారు. ఓజ దేవేంద్రాచారి సలహాదారులుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు ఈ సమూహం నుండి 15 మంది కవులు శతకాలు పూర్తి చేసుకున్నారు. సుమారుగా 2500 పద్యాలు ఈ సమూహం నుండి వెలుబడ్డాయి. నగ్రా అంజన్ రెడ్డి రాసిన "మిసిమి" శతకం, గుర్రం అంజయ్య గారి "హంసనీతి శతకం", మోతుకుల నారాయణ్ గౌడ్ గారి "నారగౌడ్ శతకం" ప్రస్తుతము ముద్రణ దశలో ఉన్నాయి. అలాగే గోనె బాల్‌రెడ్డి, పాలోజి నారాయణ శతకాలను పూర్తి చేసుకున్నారు.

**"పద్య కవిత్వ కార్యశాల"** పేరిట వేములవాడ నుండి నల్లగొండ సురేష్ గారు ఒక సమూహం నిర్వహిస్తూ ఇప్పటి వరకు 5 వందల పద్యాలు వెలువరించారు. ప్రతిరోజు ఇచ్చిన అంశంపై ఆటవెలది, తేటగీతి, ఉత్పలమాల మొ॥ పద్యాలు వెలువడుతున్నాయి. ఈ సమూహంలో సుమారుగా వందమంది కవులు పద్యరచనలో పాల్గొంటున్నారు.

ఇవే కాకుండా తెలుగు రాష్ట్రాలలో ఇంకా చాలా సమూహాలు పద్యానికి పట్టం కడుతున్నాయి. ఈ సమూహాల ప్రోత్సాహం వల్ల చాలా మంది కవులు పద్య రచనలోకి అడుగిడినారు. ఇలా ఈ సమూహాల ద్వారా వచ్చిన పద్య సాహిత్యం అంతా కూడా సంకలనాల రూపంలోగాని, కవుల వ్యక్తిగత రచనల రూపంలోగాని ముద్రణా రూపం దాల్చి పాఠకులకు చేరినట్లైతే పద్య ప్రక్రియ పూర్వ వైభవాన్ని సంతరించుకునే అవకాశం ఉంది. అలాగే పద్యరచన వ్యక్తిలో ఆలోచనా శక్తిని, చురుకుదనాన్ని పెంపొందించే ప్రక్రియ కాబట్టి, కళాశాల స్థాయి, పాఠశాల స్థాయి విద్యార్థులకు పద్య రచనలో మెళకువలు నేర్పినట్లైతే అటు విద్యార్థులతో పాటు, తెలుగు సాహిత్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది.




# ఆమె కన్నీటి చుక్కలు

కన్నీటి చుక్కలతో కావ్యం రాస్తే
ఒక్కో చుక్కకి
ఒక్కో గ్రంథం అవుతుంది....



ఆ చుక్కల వెనక
రహస్యంగా దాగి వుంటాయి
ఎన్నో కథలు
మరెన్నో వెతలు....



చుక్కకి చుక్కకీ మధ్య
ఎన్నో రోదనలు
అంతుచిక్కనీ ఆవేదనలు....
భయంకరమైన భావాలేన్నో
పోగై ఉంటాయి....

ఇవి కథలు కావు
వేదనతో
బరువెక్కిన హృదయం నుండి
జాలువారిన వెతలు....



ఆత్మ గౌరవ అగచాట్లు
అన్ని ఇన్ని అనే లెక్కుండదు...
మరెన్నో కష్టాలు
ఇంకెన్నో కన్నీళ్లు....

కొన్ని కథల వెనుక కష్టాలు
ఇంకొన్ని కథల వెనుక సుఖాలు....
ప్రతీ కన్నీటి చుక్క నుండి
వెలకట్టలేని కథలెన్నో
కదలాడుతుంటాయి...




ప్రతీ కథెనుక ఓ జీవితం ....
ఈ సున్నితమైన కళ్ళకి
బరువైన భావాలు ఎన్నెన్నో....
త్రాసేమి లేదు తూచడానికి....

కన్నీటి నుండి వచ్చిన వెతలను
కథలుగా,
ఇలా కవిత్వాలు గా
రాయటం తప్పు....

**పి. హంసమ్మ**
పరిశోధక విద్యార్థి, ఉ.వి.వి., ఫోన్ : 7730047278

# కవిత్వం

అక్షర పదాల అంతరంగ రూపం
కవిత్వం
పద్యం, పాట, గేయం, వచన కవిత
హరికథ, బుర్రకథలు భౌతిక రూపాలు
ఉత్పత్తి శ్రమలకు ఊపిరులూదుతూ
మనసు గాయాలను మసి చేసే
నిప్పుల కుంపటి వేడి కవిత్వం
భౌతిక విషయాన్ని కల్పనమే కప్పుతో
మనసులను అలరించేదీ
వేడెక్కించేదీ కవిత్వం
అది కల్పనల ఊర్ధ్వలోకమూ కాదు
మేకప్పు లేని అథోలోకమూ కాదు
అంతరంగ సూచనల ప్రయోక్త కవిత్వం
జీవనంపై పండించే భావనది
వజ్రాయుధ సుదర్శన పాశుపత
పాంచజన్య దేవదత్తాది కల్పిత
వస్తు విన్యాసమూ కాదు
అవి ఉత్తుత్తి ఊహాలోక చిత్రాలు
అక్షరాల యిటుకలతో
పదవాక్యాల గోడలతో
భావాల సిమెంటుతో
ఎద కట్టె మాటల భవనమే కవిత్వం
అది విశ్రాంతి సౌందర్య దర్శన కేంద్రం
అక్షర సాహసయాత్ర స్వైర విహారం
అందుకే కవిత్వమంటే కవిత్వమే
అదే అర్థాంతరన్యాసం




**వల్లభాపురం జనార్దన**
ఫోన్ : 9440163687

# వసంత కోకిల

పండుగనినచో గలుగును పరవశంబు
పల్లె పట్టణంబులు చేరి వన్నె గూర్చు
ఉన్న లేకున్న యని జెప్ప ఊసు లేదు
పండుగందున కనిపించు నిండుగమ్మ


కనుల విందైన కాశ్మీర కన్య నటుల
కర్మ సాక్షిగ హరియింప కక్ష బూని
హద్దు మీరి భారత సరిహద్దు దాట
శత విధమ్ముల కుట్రలు సలుపుచుండె

భారతదేశము జూడగ భాగ్య తరువు
దేశజనుల జూడ నాశ చచ్చు
పాలనందున ధనవంతల పాలు పెరిగి
సంపదెల్ల వాళ్ళ సంచిలోకి

త్యాగముద్రలు సాక్షిగ తెలుగు తల్లి
కీర్తి శిఖరము నెక్క మక్కువగ నిలిచె
రండి, పాలకులెల్లరు వెంట మీరు
బాధ్యతగ నెంచి పెంచిన భాష నిలుచు

పచ్చదనమేగ ధరణిలో పల్లెలనిన
షడ్రుచుల పచ్చడే గద సందడౌను
కోకిలల గానములు చేరి 'కో' యనుచు
కోరికల రెక్కలు కదుపు కొంటెగాను

భయము వీడగ నిజమను భ్రాంతి గలిగె
కరొన పెరుగుట నాందోళన కారకమ్ము
ప్లవన నామ యుగాదియె పల్లవించి
లొసుగులన్నియు కూల్చును లోకమందు!



**ఎస్.ఆర్. పృథ్వి**
రాజమండ్రి, ఫోన్ : 9989223245

# మహానేత - భారతజాతికి రాజకీయ స్ఫూర్తి ప్రదాత

**డా. వొజ్జల శరత్ బాబు** , ప్రభుత్వ ఉపాధ్యాయులు, హైదరాబాదు. ఫోన్ : 9494183937



**ఉద్యోగా ధనవిత్తస్య, సుసహాయస్య**
**దారే వానుగతా తస్య, నిత్యం శ్రీ స్పృహచారిణీ** - కామందకుని నీతి సారం.

(నిరంతర ప్రయత్నశీలుర, చక్కని సహాయసంపత్తులను సమకూర్చుకొనే సద్బుద్ధివర్తనుల వెంట విజయలక్ష్మి,సత్సంపదలు అనునిత్యం సహచారిణులై ఉంటాయి.).

**వజ్రాదపి కఠోరాణి, మృదూని కుసుమాదపి**
**లోకోత్తరాణాం చేతాంసి, కోహి విజ్ఞాతు మర్హతి** - భవభూతి ఉత్తర రామచరితమ్.

(మహాత్ముల మనసు ఒకసారి వజ్రం వలె కఠోరంగా ఉంటుంది. మరోసారి పుష్పం వలె మెత్తగా ఉంటుంది. కావున మహాత్ముల మనసును తెలుసుకోవడం చాలా కష్టం.)

పై శ్లోకద్వయభావాలు సరిపోయే వ్యక్తులు అసాధారణంగా కనిపిస్తారు. ఎవరికైనా సాధారణ స్థితిలో సాధన జరగడం సామాన్య విషయమే. కష్టకాలంలో సాధన చేయడం అనేది కత్తి మీద సామే. అలా కత్తి మీద సాము చేయగలిగి విజయం పొందడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు.అలా భావానుగుణ్యంగా ఓ వ్యక్తి ఎదిగినాడు. ప్రతి సందర్భంలోనూ ఆ వ్యక్తి దాన్ని తన సొంతం చేసుకున్నాడు. అందుకే ఆయన్ని అపర చాణక్యుడు అని అంటారు. ఆ చాణక్యాన్ని ప్రదర్శించగల గలగడం అనేది దేశం యావత్తు అవ్యక్తి లో తప్ప మరొక వ్యక్తి లో చూడలేదని చెప్పడం అతిశయోక్తి కాబోదు. ఆ వ్యక్తే భారత మాజీ ప్రధానమంత్రి పాములపర్తి వేంకట నరసింహారావు గారు.

ఆయన బాల్యం నుండి అన్నింటా ప్రథముడు. బహుముఖీన తెలివితేటలు ఉన్నవాడు. బహుముఖీన తెలివితేటలు ఉన్న వారేమార్గంలో వెళ్ళాలో ఎంచుకోవడం కూడా ఒక సమస్య. కానీ అలా ఎంచుకోవడంలో పీ.వీ.కి ఇబ్బంది కలిగినట్లు ఏర్పడదు.

గ్రామంలోనే వీధి బడి విద్య పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత ఎదుగుదలనే కానీ తరుగుదల లేదు. పంతొమ్మిది వందల ముప్పై-ముప్పై ఐదవ సంవత్సరాల మధ్యకాలంలో ఆయన జీవితంలో మలుపు సంభవించిందని చెప్పవచ్చు. కారణం ఆనాటి సామాజిక రాజకీయ పరిణామాల ప్రభావం ఆయనపై సంపూర్ణంగా ఉన్నట్లు తోస్తున్నది. హనుమకొండలో మెట్రిక్యులేషన్ పరీక్ష లో ప్రథమశ్రేణిలో విజయ దుందుభి మోగించారు. అదే సమయంలో ఆర్య సమాజ ప్రభావానికి కొంత గురైనట్లు కనపడుతుంది. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ కార్యక్రమాలు ఆయనపై పూర్తి ప్రభావాన్ని చూపాయి. ఒక మాటలో చెప్పాలంటే ఆయన హైదరాబాద్ స్టేట్ కాంగ్రెసు, రామానంద తీర్థ కార్యక్రమాలకు వశమైనట్లు కనబడుతారు. ఆ తర్వాత పెద్ద ఆలస్యం ఏమి లేకుండా ప్రత్యక్ష కార్యాచరణ లోకి దిగినాడు. వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నాడు. అదీ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో. తత్ఫలితంగా విశ్వవిద్యాలయం నుండి బహిష్కృతుడైనాడు. ఆ సమయంలో చదువు కొనసాగించాలి. లేకపోతే ఇబ్బందులు కలిగే పరిస్థితి. అయినా ఆయన భయపడలేదు. మిత్రుల సహాయంతో నాగపూర్ విశ్వవిద్యాలయంలో చదువు కొనసాగించాడు. విజేతగా నిలిచాడు. ఆ సమయంలో ఆయన చిన్నపాటి ఉద్యోగం కూడా చేసుకున్నాడు. 1939లో త్రిపుర లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభల్లో మిత్రులతో కలిసి పాల్గొన్నారు. దాంతో ఆయనకు కొంత రాజకీయ అభినివేశం, ఆసక్తి కలిగింది. అప్పటికే ఆయనకు కళల పట్ల ఆసక్తి ఉండేది. సాహిత్యం పట్ల ఆసక్తి ఉండేది. ఇంకా ఇతరత్రా అనేక విధాలుగా ముందుకు వెళ్ళకలిగిన ప్రతిభ ఆయన సొంతం.

**స్టేట్ కాంగ్రెస్ సభ్యుడుగా రాజకీయ పంథా :**

కానీ స్వామి రామానంద తీర్థ ప్రభావంతో 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ లో సభ్యుడైనాడు. ఆ సభ్యత్వం మరియు 1939 నాటి భారత జాతీయ కాంగ్రెస్ మహాసభ ఆయనకు రాజకీయ మార్గాన్ని చూపించాయి.అయినా అలా అని ఆయన పూర్తిగా రాజకీయాల్లో నిమగ్నం కాలేదు. చదువు కొనసాగించాడు. ఇక్కడ తెలంగాణలో బూర్గుల రామకృష్ణారావుగారి విధానాలకు

ఆకర్షితుడయ్యాడు. బూర్గులకు ఉత్తమ శిష్యుడుగా పరిణతిచెందాడు. మర్రి చెన్నారెడ్డి వీరేంద్ర పార్టీ లాంటి సహచరులతో కలిసి అడుగులు వేశాడు. 1938 లోనే హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ లో చేరినప్పటి నుండి రాజకీయ శ్రద్ధాసక్తులు కనబరిచారు.

భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడు గా 1951లో భారత జాతీయ కాంగ్రెస్ కమిటీ లో సభ్యుడయ్యాడు. అలా కాంగ్రెస్లో ప్రవేశించినది మొదలు ఒక్కో మెట్టు పార్టీపరంగా ముందుకు వెళ్ళాడు.

రాజకీయ విధానాల్ని ఆకళింపు చేసుకున్నాడు. అనేక మంది నాయకుల పందాలను జీర్ణం చేసుకున్నారు. దేశ పరిస్థితులను అవగతము చేసుకున్నాడు. రాష్ట్రంలోని రాజకీయ స్థితిగతులను బేరీజు వేసుకున్నాడు.

**రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యక్ష భాగస్వామ్యం:**

పౌరాణికంగా సుప్రసిద్ధ అగ్రహారమైన మంత్రపురి శాసన సభ్యుడిగా1957వ సంవత్సరంలో ఎన్నికల్లో పోటీ చేశాడు. ఆ మంత్రపురి నుండి అంటే అదే .... నేటి మంథని నియోజక వర్గం నుండి విజయ ఢంకా మోగించారు. వరుసగా నాలుగు సార్లు అక్కడినుండే ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుడిగా ఎన్నికైనాడు. 1977 వరకు అంటే ఇరవై ఏళ్ళు ఆయన మంథని నియోజకవర్గ శాసనసభ్యులు. ఆయన తెలివితేటలు, అనుభవము ఆయనను రాష్ట్ర మంత్రిపీఠం మీద కూర్చోబెట్టాయి. 1962 నుండి 64 వరకు సమాచార మరియు న్యాయశాఖ మంత్రిగా తనదైన శైలిలో ముందుకు వెళ్ళినారు. ఆ పని తనం మరో దఫా మరో శాఖలో సేవచేసే భాగ్యాన్ని ఆయనకు అందించింది. అదే న్యాయశాఖ మరియు వైద్యశాఖ మంత్రిగా. 1964 నుండి67 వరకు ఈ రెండు శాఖలకు మహత్తర దశలు పట్టించాడు. తత్ఫలితంగా విద్యాశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం. ఇక విద్యాశాఖ మంత్రిగా ఆయన పని గూర్చి ఇక్కడ ప్రస్తావించవలసిన అవసరం లేదు. యావద్దేశం ఆశ్చర్యపోయే రీతిలో అద్భుతమైన పనితనాన్ని ప్రదర్శించారు. 1968 నుండి 71 వరకు విద్యాశాఖ మంత్రిగా సన్మార్గాన్ని ప్రవేశపెట్టారు. నేటికీ అవే ఉత్తమ మార్గాలలో మన ప్రయాణం కొనసాగుతునే ఉంది. ఉంటుంది.

1969లో ఆనాటి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమం తీవ్ర స్థాయికి చేరుకున్నది. అయినా ప్రభుత్వం దాన్ని అణచివేయ గలిగింది. కానీ ఆ పరిస్థితుల్లో తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడం అత్యావశ్యకం అని భావించింది. ఎవరా అని వెతికే క్రమంలో పివి గారు కనబడ్డారు. ఎందుకంటే ఆయనకు ఒక ప్రత్యేక వర్గం లేదు. అభిమాన సంఘాలు లేవు. వివాదాల ఊసేలేదు. పైగా పార్టీకి విధేయుడు. నిరాడంబరుడు. సహృదయుడు. మంత్రిగా పనిచేసిన అన్ని శాఖల్లోనూ క్రియాశీలుడు. విజయాన్ని సాధించినవాడు. అందుకే ఆనాటి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ముళ్లకిరీటాన్ని ఆయన శిరస్సుకు ముద్దుగా తొడిగింది. అది ఆయనకు లెక్క కాలేదు. ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా, కఠిన వాతావరణంలో అయినా ముందుకు వెళ్ళడం అనేది ఆయన నైజం. అందుకే ధైర్యంగా అడుగులు వేసాడు. తాను పని చేసినంత కాలం ప్రజలకు ఉపయోగపడే పనులను చేసాడు. ఒక్క మాటలో చెప్పాలంటే తాను ప్రజలకు ఆ పీఠం మీద ఉన్నంత సేపు ఎంత చేయగలడో అంతా చేసాడు. జై ఆంధ్ర ఉద్యమం మరియు భూసంస్కరణల వ్యతిరేక పైశాచిక శక్తులు ఆయనను మెదలనియ్య లేదు. చివరగా ఆయన వంగర వైపు ప్రయాణం చేయాల్సి వచ్చింది. పందొమ్మిది వందల డెబ్బై ఒకటి నుండి డెబ్బై మూడు దాకా ముఖ్యమంత్రిగా పనిచేసిన పీ.వీ. చిరు దరహాసం తోటే వంగరకు వెళ్లటం ఆయనకే చెల్లింది. ఇది ఒక రాజకీయ నాయకుడికి ఉండ వలసిన అద్భుతమైన లక్షణం గా అందరికీ చూపించాడు.

**జాతీయ – అంతర్జాతీయ రాజకీయ యవనికలపై :**

మరి అంతటి మేధావి వంగర లో కూర్చుంటా అంటే ఎవరూరు కుంటారు. తక్షణమే ఢిల్లీకి రమ్మని కాంగ్రెస్ అధిష్టానం పీ.వీ.కి కబురు పంపింది. ఇక ఆనాటి నుండి వెనుతిరిగిన దాఖలాలు కనబడవు. అలా కాదు వెనక్కు వెళ్లే అవకాశం ఆయన కలగలేదు. 1975 76 సంవత్సరంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనాడు. కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను చురుకుగా నడిపించినాడు. అధిష్టానం ఆజ్ఞమేరకు హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గ స్థానం నుండి 1977లో విజయ దుందుభి మోగించారు. భారత పార్లమెంటులో ప్రవేశించినాడు. రెండవసారి కూడా హన్మకొండ ప్రతినిధిగానే లోకభకు వెళ్ళినాడు. మూడవసారి తాను చదువుకున్న రాష్ట్రమైన మహారాష్ట్రలోని రామ్ టెక్ నుండి లోక్ సభ ప్రతినిధి గా పార్లమెంటుకు వెళ్ళినాడు. 1989లో నాలుగవ సారి కూడా అక్కడి నుండి వెళ్ళాడు. 1991లో విధి లేని పరిస్థితి ఆయనను లోక్ సభలో కి వెళ్లేలా చేసింది. కర్నూలు జిల్లా నంద్యాల లోకసభ సభ్యుడు గంగుల ప్రతాపరెడ్డి గారు పీ.వీ. కొరకు రాజీనామా సమర్పించాడు. పి.వి ఆ స్థానం నుంచి ఎన్నికల బరిలో నిలిచాడు. ఇక్కడ మరో విశేషం ఏంటంటే ఆనాటి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్టీ రామారావు గారు పీ.వీ. పైన పోటీకి ఎవరిని నిలవలేదు. కారణం **"మన తెలుగు వాడు ప్రధానమంత్రి హోదాలో ఉండటం మనకు గర్వకారణం అని".** పోటీలో ఉన్న వారితో ఎన్నికలు జరిగాయి. అఖండమైన విజయం సాధించాడు. దాదాపు ఏకగ్రీవమే. భారత ప్రధానమంత్రి నంద్యాల లోకసభ సభ్యుడే.

ఢిల్లీ వెళ్లిన తర్వాత ఆయన రాజకీయ కార్యకలాపాల్లో లేకుండా ఎన్నడూ లేదు. 1978లో పివి గారు ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఉన్నారు. ఆ సమయంలోనే పి.ఎ.సి. అంటే పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ గా బాధ్యాతలు నిర్వహించారు. 1980 నుండి 1984 జూలై వరకు ఇందిర హయాంలో పీ.వి.గారు విదేశాంగ మంత్రిగా

బాధ్యతలు స్వీకరించారు. భారత విదేశాంగ మంత్రిగా ఐక్యరాజ్య సమితి అంటే UNO general అసెంబ్లీలో ఆయన చేసిన ప్రసంగం అనర్గళం. అది 1980లో. ఆనాటి విషయం నిరాయుధీకరణ. ఆనాటి ఆ అద్భుత ప్రసంగం ఆయనకు దేశానికీ ఎనలేని కీర్తిని తీసుకువచ్చి పెట్టింది. ఎందుకంటే ఆనాటి ఐక్య రాజ్య సమితి సభ్యులు అందరూ అనేక పర్యాయాలు లేచి నిల్చొని చప్పట్లతో అభినందించడం చాలా గొప్ప విషయంగా చెప్తారు. సభ ముగిసిన తర్వాత కూడా ఆయన దేశ విదేశాల్లోని కొన్ని వందలమందిచే ప్రశంసా పూర్వకంగా వాక్యాలను అందుకున్నారు. అదీ ఆయనకున్న ప్రజ్ఞ పాటవ విశేషం. విదేశాంగ మంత్రిగా మన కీర్తి ప్రతిష్టలు ఇనుమడించేసారు. 1981 ఫిబ్రవరిలో జరిగిన అలీన దేశాల సభలో ఆయన పోషించిన పాత్ర ఆయనకు రాజకీయంగా మరింత అంతర్జాతీయ కీర్తిని తీసుకొచ్చి పెట్టింది. అదేవిధంగా మరో కీర్తి కిరీటం పాలస్తీనా – ఇజ్రాయెల్ సమస్య విషయంలో. 1983లో అలీన దేశాల బృందం నాయకుడిగా కీర్తి పొందారు. వివిధ దేశాల సంయుక్త కమిషనర్ గా భారత్ తరఫున నాయకత్వం వహించి మన దేశ సమున్నత గౌరవాన్ని నిలబెడుతూ ఆయన అంతర్జాతీయంగా ఎనలేని రాజకీయ కీర్తిని పొందాడు.

1984 జూలై 19 నుండి హోం మంత్రిగా గా దేశ పరిస్థితులను అపూర్వంగా తీర్చిదిద్దాడు. ఆ తర్వాత కేంద్ర ప్రణాళిక శాఖ మంత్రి అయినారు. గురుతర బాధ్యతలు నిర్వర్తించారు. జాతీయ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా కీలక పాత్రను పోషించారు. 1984 నవంబర్ 5న ప్రణాళిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. దేశ ప్రణాళికా విభాగం లో నూతన పోకడలకు పురుడు పోసే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత తన రంగం రక్షణ శాఖ మంత్రిత్వ శాఖకు మారింది. రక్షణ శాఖలోనూ ఆయనది నూతన ఒరవడే. ఆ తర్వాత మానవ వనరుల అభివృద్ధి శాఖను విశేషంగా నిర్వహించారు.

1986లో నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టారు. 88 జూన్ వరకు మానవ వనరుల అభివృద్ధి శాఖలో తనదైన ముద్ర వేయగలిగారు. అదే ఒక కొత్త శాఖ. దాని సృష్టికర్త కూడా ఆయనే. మనకు నవోదయ విద్యాలయాల మార్గం ఆయన చూపించింది ఆయన్నే. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగా, పునః విదేశాంగ శాఖ మంత్రిగా తన విధులు నిర్వహణలో కృతకృత్యులయ్యారు.

1989 డిసెంబర్ తర్వాత తన రాజకీయ జీవితానికి స్వస్తి చెప్పాలని అనుకున్నాడట. కానీ విధి దానికి ఆయన సమ్మతించలేదు. ఎందుకంటే ఆయనకు కుల ప్రాబల్యం లేదు. వర్గ ప్రాబల్యం లేదు. పెద్దగా అభిమాన సంఘాలూ లేవు. హంగు ఆర్భాటాలు లేవు. రాజకీయ నేపథ్యం లేదు. వివాద రహితుడు. ఏ సమూహపు అండదండలు లేవు. అలా ఆయన రాజకీయ జీవితం నడుస్తున్నది. కాబట్టే అతి కష్టతరమైన పరిస్థితుల్లో అగమ్యగోచరంగా ఉన్న వాతావరణంలో, దేశ కీర్తిప్రతిష్టలకు ఇక భంగం వాటిల్లుతుందనే విపత్కర సమయంలో "అన్యథా శరణం నాస్తి" అన్నట్లుగా భారత జాతీయ కాంగ్రెస్ పీవీ నరసింహారావును 1991 మే నెల 29న పార్టీ అధ్యక్షులుగా ఎన్నుకున్నది. అంతేకాదు లోక్‌సభలో పార్టీ అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టింది. దాంతో 1991 జూన్ 21వ తేదీన ముళ్ళతో పొదగబడిన, పైసా లేమితో అద్దబడిన, రాజకీయ అనిశ్చిత గంధం పూయబడిన సమయాన ప్రధానమంత్రి పీఠంపై ఆయన కూర్చున్నాడు. ఎంత సాహసం! దారి లేని స్థితిలో విజయవంతంగా నూతన దారిని ప్రవేశపెట్ట గలిగాడు. దేశాన్ని కంటికి రహితంగా చేసాడు. ఆర్థిక లేమిని సమూలంగా కంట కనబడకుండా చేశాడు. రాజకీయ అనిశ్చితి గంధాన్ని పాతాళంలోకి తుంగలో తొక్కినాడు. అది పీవీ చాణక్యం. ఒక వ్యక్తికి ఒకే పదవి అనే సూత్రానికి బద్ధుడై పార్టీ అధ్యక్ష స్థానానికి వదులుకున్నాడు. దానివల్ల ఎంత నష్టం జరుగుతుందో తనకు తెలుసు. అయినా నా ఒక సత్ సంప్రదాయాన్ని తీసుకురావడంలో భాగస్వామి అయ్యాడు.

నిజాం విముక్తి ఉద్యమంలో సొంత విశ్వవిద్యాలయం నుండి బహిష్కృతులు అయిన నాటి నుండి తన దేశ కీర్తి ప్రతిష్టల్ని ఇనుమడింపజేసే వరకు తన రాజకీయ ప్రస్థానం ఎన్ని ఆటుపోట్లను ఎదుర్కొన్నదో? ఎన్ని విధాల గౌరవాలు అందుకున్నో. ఎన్ని రకాల అవమానాలు భరించిందో! ఎన్ని పొగడ్తలకు కారణభూతమైన లో! ఎన్ని తెగడ్తలకు ఆలవాలమైందో? ఎంతమంది దగ్గరకు తీశారో! ఎంతమంది దూరంగా ఉంచాలనుకున్నారో? అవన్నీ ఈ దేశ రాజకీయ చరిత్రలో నిక్షిప్తమై ఉన్నాయి. ఆ చరిత్ర లోని ఒక ప్రత్యేకమైన, విశేషమైన అధ్యాయము పీవీ రాజకీయ జీవితం.

నెహ్రూ కుటుంబ సభ్యులు కాని వ్యక్తి ఈ దేశాన్ని పాలించడం – కాదు కాదు విజయవంతంగా పరిపాలించడం లో సంపూర్ణుడు అనే దానికి తార్కాణంగా పివి నిలిచినాడు. ఎన్ని ఎన్ని ఆటంకాలు అవలీలగా దాటాడో! ప్రధానమంత్రిగా సేవలు అందించిన తర్వాత కోర్టు ఖర్చుల కొరకు ఆస్తులను అమ్మినాడు. ఇది తాను చేయని తప్పులకు శిక్ష. తనపట్ల అంటే మౌనంగా ఎదుగుతున్న పీవీపై వారికున్న కక్ష. చివరకు తన మరణం విషయంలోనూ ఆకక్షను బయటపెట్టుకున్న వారి మనస్తత్వం యావత్ప్రపంచం చూసింది. ఒక నాయకుడు దేశ ప్రజల హృదయాన్ని నేటికీ చూరగొంటున్నాడు. విశేషమైన మార్గదర్శి అని కొనియాడ బడుతున్నాడు. పి.వి దేశ హృదయ అంతర్గత సజీవుడు. ఎదుగుదలలో మౌనంగా ఉన్నాడు. మౌనంగా ఉంటూనే ఎదుగుతూ వచ్చాడు. ఈ భారత జాతికి బహుముఖీన స్ఫూర్తిదాత అయినాడు. కనుచూపు మేరలో అలాంటి నాయకుడు మరొకరు కాన వస్తారన్న నమ్మకం కనబడడం లేదు అని చెప్పడం తప్పు కాదేమో!

ఆయనకు ముందూ తదుపమానులు లేరేమో! ఇదీ మౌనముని రాజకీయపు విజయ దరహాసం.

## నవాబ్దమా ! నమో !!

అనంతకాల గమనంలో ఉగాదులు – ఉషస్సులు,
మానవాళి జీవనగతికి ప్రగతికి నిర్దేశనలు సంకేతాలు
అరవై వసంతాల స్ఫురణలు ఆరు ఋతువులు,
ఆరు రుచులు శాకా చంక్రమణలు
నిండుగా మెండుగా కలగల్పిన పూతపచ్చడి తెలిపే పూర్ణభవితలు

పంచాంగాల ప్రామాణికతల్లో, ద్వాదశరాశుల సంచాలనాలు
ఆదాయ వ్యయాలు, రాజ్యపూజ్య అవమానాలు
గతానుగతాల సమస్యల రథ్యలకు
స్వాంతన లేపనాలవుతుండడం పరిపాటి

మావిపూతలు మమతల మాధుర్యాలు
ఎదడ కోర్కె చివుళ్ళు ఎర్రమావి ఇగుళ్ళు
విడిచిన జీర్ణపత్రాల వెల్లువ దూసిన ఇక్షుఖండాలు
తరులతల అలరింపులతో వెరసి విరి కోర్కెల మనోతావికి
కోటి కాంతులు సహజాతాలవుతుంటాయి
భరతోర్వికి మారుటాకుల శోభలు శ్రేయస్కరంగా శుభస్కరంగా
రహస్య లాస్యాలను అలదుతూ అలరింపచేస్తుంటాయి

విశ్వవ్యాప్త విలయాలతో
మహమ్మారుల విషూచికలు
మిగిల్చి వెళ్లిన విషాదాలకు
అగమ్య గోచరాల జీవన సంకలనాలకు
కొస మెరుపులుగా వ్యాప్తిస్తున్న ఔషధాల నివారణలు
మనుషులకి, మనస్సులకి ఊరట కలిగిస్తే
సూదిమందులు మరింత ప్రభావిత స్వస్థతలను చేకూరిస్తేనే
జనతకు ఆరోగ్య వసంతాలు ప్రాప్తించిన వరప్రసాదాలవుతాయి

కాలం అనంతం!
ప్రభవాది అరవై వసంతాల శ్రేణిలో
'ప్లవ'కిప్పుడు 'షష్ఠ్యబ్ది'
కాలోహి పడగ మీద కాలూని నిల్చేందుకు కొంగ్రొత్తగా
కూర్మపాదం మోపుతున్న నేపథ్యం
ఏమి ఆశలు చూపునో ఈ ఉ(యు)గాది పిలుపు
వింతగా మనస్సెంత వేడ్క తెలుపు?!

**వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు**
కాకినాడ, ఫోన్ : 9441148158

## ఉగాది గీతం

శార్వరి శాంతి లేకుండ చేసి చల్లగ జారుకుంది
పాత సంవత్సరమా వీడుకోలు
ప్లవంగం ఆనంద విహంగమై నూతన వత్సరాజు ఆగమనం
కొత్త సంవత్సరమా వేడుకోలు
గత సంవత్సరం చేసిన గాయాలకు
నూతన వత్సరం మమతల మలాం పట్టీలు
ప్రతి సంవత్సరం వస్తూనే వుంటావు
ప్రతిసారి ఏమి తెచ్చావని, ఏమి ఇస్తావని
వేస్తావు ఆశలకు పునాది
నీవు ఏమి ఇచ్చినా ఇవ్వకున్నా
మా హృదయ కవాటాలను తెరచి
మా ఎదనిండా ఉత్సాహం నింపుకొని స్వాగతిస్తాం
ఉగాది తెలుగువాడి తొలి పండుగ
ఆశల తోరణాలు కట్టి ఆశయాల ముగ్గు కట్టి
పిల్ల పెద్దలందరు సంబరంగా ఉగాది ఊసులు చెబుకుంటాం
మాగాణులు నిండకున్నా సరే
అయిదు వేళ్ళు నోటిలో కబళం వేస్తే చాలు
అనుకునే బడుగు జీవులకు అదే పదివేలు
వసంత కోకిల స్వరం వినే తీరిక ఎక్కడ
అసలే కరోనా కల్లోలం మాస్కు ముఖాల మందహాసం
స్వేచ్ఛముసుగులో మసకబారిన జీవనం
ఏది ఎట్లున్నా పండుగ అందులో ఉగాది
తొలి ఆశల పెన్నిధి ఉగాది పచ్చడి షడ్రుచుల
సగటు మానవ సుఖదుఃఖాల ప్రతీకలు
ప్లవంగమా ఏమి విప్లవం తెస్తావో
నవ జీవన శకానికి నాంది కావాలి ఈ ఉగాది
సర్వేజనాః సుఖినో భవంతు
సర్వ లోకాః ఆరోగ్యమస్తు
సకల లోకాను శాంతిర్భవతు

**కొలనుపాక మురళీధర రావు**
నల్లగొండ, ఫోన్ : 9247159203

# పాలమూరు పరిశోధకా వతంసులు

**కె. మారెప్ప,** తెలుగు అధ్యాపకులు, మహబూబ్‌నగర్, ఫోన్ : 9701419945

పాలమూరు ప్రాంతం సంస్థానాలకు నిలయం. ఆ సంస్థానాలు తెలుగు సాహిత్య వికాసానికి తమవంతు కృషి చేశాయి. వనపర్తి సంస్థానం బ్రహ్మవిద్యా విలాస ముద్రాక్షరశాలను ఆరంభించి, ప్రాచీన తెలుగు కావ్యాల ముద్రణకు నడుం బిగించింది. వనపర్తి సంస్థానాధీశు డు ఉదారుడైన సవై రాజా రామేశ్వరరావు అంతరంగిక కార్యదర్శిగా మానవల్లి రామకృష్ణకవి (1904)ని నియమించుకొన్నాడు.

వనపర్తి సంస్థానంలోని నిధి నిక్షేపాల్లాంటి ప్రాచీన గ్రంథ రాజాలు, ఇక్కడి సాహితీ వాతావరణం మానవల్లి గారి మనోనేత్రాన్ని విప్పారునట్లు చేశాయి. గవేషణకు పురిగొల్పాయి. ఫలితంగా తెలుగు కావ్యాల గూర్చి తెలుగు కవుల గూర్చి మౌలికమైన పరిశోధనలకు పూనుకొన్నాడు. ప్రాచీన తెలుగు కృతులు అజ్ఞాతంలో ఉండటాన్ని గమనించి, వాటిని వెలుగులోకి తీసుకురావాలనే తపనతోనే 'విస్మృత కవుల' శీర్షికతో పరిశోధనకు ఉపక్రమించాడు.

మానవల్లి గ్రంథ పరిష్కార కార్యం తలపెట్టిన నాటికి మద్రాసులో ప్రాచ్యలిఖిత పొత్తపు గుడి ఏర్పడలేదు. తంజావూరులోని సరస్వతీ మహలే ఏకైక వనరు. తను వ్యయ ప్రయాసలకు ఓర్చి తీరిక చేసుకొని, తంజావూరు నుండి గ్రంథాలను తెప్పించుకొని, పరిష్కరణలతో పాటు ప్రచురణలను ఒక యజ్ఞంలా భావించి, విస్మృత కవుల శీర్షికతో గ్రంథముద్రణలను తెలుగు సాహితీ లోకానికి పరిచయం చేసిన పరిశోధనా వతంసుడు మానవల్లి రామకృష్ణకవి.

ప్రాచీన కావ్యాలను రామకృష్ణకవిగారు తన శక్తికొలది దిద్ది, గ్రంథకర్త చారిత్రకాది విషయాలను చేర్చి, విస్మృత కవుల శీర్షికలో 10 గ్రంథాలను ముద్రింప చేశాడు. వీటన్నింటికి తాళపత్రాలే ఆధారాలని సూచించాడు.

1. కుమార సంభవం (ప్రథమ భాగం) – నన్నెచోడుడు – ప్రబంధశాఖ – 1908
2. క్రీడాభిరామము – వినుకొండ వల్లభరాయుడు – నాటక శాఖ – 1909
3. నీతిశాస్త్ర ముక్తావళి – బద్దెన / భద్రభూపాలుడు – సంకలనశాఖ – 1910
4. ప్రబంధ మణిభూషణం – సంకలనశాఖ – 1910
5. పరతత్త్వ రసాయనము – ఫణిభట్టు – వేదాంతశాఖ – 1911
6. అనర్ఘరాఘవము – తిమ్మభూపాలుడు – అనువాదశాఖ – 1911
7. త్రిపురాంతకోదాహరణము – తిమ్మరాజు / త్రిపురాంతకుడు – ఉదాహరణశాఖ – 1912
8. శ్రీరంగ మహాత్మ్యము – భైరవకవి – క్షేత్ర మహాత్మ్యశాఖ – 1912
9. కుమార సంభవము (ద్వితీయాభాగం) – నన్నెచోడుడు – 1917
10. సకల నీతి సమ్మతము – మడికి సింగన – సంకలనశాఖ – 1923

పై గ్రంథాలు తాళపత్రాల పరిష్కరణతో ముద్రితాలైనవి. తరువాతి ప్రచురణలకు మానవల్లి రామకృష్ణకవి ముద్రణా ప్రతులే ఆధారంగా నిలిచాయి. వీరి నిస్వార్థ సాహితీసేవా విశిష్టత సాహితీ లోకానికి తెలియడానికి 16 సంవత్సరాలు పట్టింది. 1930 తర్వాత విస్మృత కవుల శీర్షికన ప్రకటించిన గ్రంథాలు పునఃముద్రణకు నిలిచాయి. సుపరిష్కృతాలని తేలాయి. తెలుగు సాహిత్యంలో ఈ గ్రంథాలకు గల స్థాన నిర్ధారణలతో విపుల పీఠికలు వెలిశాయి. కవిగారి పరిశోధన పటిమ లోకానికి విదితమైంది. పాలమూరు మట్టిశ్రమ పరిమళం మానవల్లి కృషి రూపంలో తెలుగు ప్రాంతాలకు వ్యాపించింది.




వీరేశలింగం ప్రకటించిన ఆంధ్రకవుల చరిత్రలో చోటు పొందని కవులను వెలుగులోకి తేవడానికి మానవల్లి రామకృష్ణ సంకల్పించు కొన్నాడు. మొదటగా **'తెలుగు భాషలో రాజకవులు'** పేరుతో పరిశోధనాత్మక వ్యాసం 1910లో ప్రకటించాడు. దీనిలో నన్నెచోడుని నుండి కదిరిపతి దాకా దాదాపు 16 మంది కవులను వెలుగులోకి తీసుకొచ్చాడు. 1915లో **తెనాలి కవుల** శీర్షికతో మరో పరిశోధనాత్మక వ్యాసం ప్రకటించాడు. తెనాలి రామకృష్ణ కవి, తెనాలి అన్నయ్య, తెనాలి గిరియప్ప, తెనాలి రామ భద్రుడు, తెనాలి రామలింగడు మున్నగు కవుల చారిత్రకాది ప్రమాణాలతో విపులీకరణ చేశాడు. **"నాకు తోచిన యంశములు బయలుపరిచితిని, చరిత్రకారులు తమ**

**పరిశ్రమతో జేర్చి యూహించినచో నిశ్చయము బయలుపడును"** అని నా పరిశోధన ప్రామాణికమనే ధిషణ నాకు లేదని, తన వినమ్రతను చాటుకొన్నాడు రామకృష్ణకవి.

పాలమూరు గడ్డమీది నుండి పరిశోధనా శ్రమతత్వాన్ని అలవర్చుకొని, శోధించి అనేకాంశాలను వెలుగులోకి తెచ్చిన కవిగారి ఆరంభశ్రమను మాత్రమే స్థాలీపులాక న్యాయంగా వివరించాను. వీరు పరిశోధనలో దేశం గర్వించదగ్గ మహనీయులు. వీరి పరిశోధనా తత్త్వం పాలమూరు నుండి పురుడుపోసుకోవడం మనం స్మరించుకోదగిన అంశం ఇదే వారికి మన నివాళి.

సురవరం ప్రతాపరెడ్డి ప్రధానంగా మౌలిక పరిశోధకుడు ఆ తర్వాతనే పత్రికా సంపాదకుడు, వ్యాసరచయిత, కవి, నాటక కర్త, గ్రంథాలయోద్యమకారుడు, వివిధ సాంఘిక సేవా సంస్థల నిర్వహణకు తోడ్పడిన మహనీయుడు. ఇతని అపూర్వ శోధన ఫలితంగా గోలకొండ కవుల సంచిక, ఆంధ్రుల సాంఘిక చరిత్ర, రామాయణ విశేషాలు, హిందువుల పండుగలు, హైందవధర్మవీరులు వెలువడినవి.



శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారు

**'స్వస్థానంలో ఉన్న పరభాషీయులచేత, పరస్థానంలో ఉన్న స్వభాషీయులచేత తృణీకరించబడ్డ చరిత్ర తెలంగాణ కవులది'** అని నందిని సిధారెడ్డి మాటలు, ఆనాటి ప్రతాపరెడ్డి ఆవేదనకు ప్రతీకలు, గోలకొండ కవుల సంచిక వెలువడటానికి ప్రేరణనిచ్చిన నేపథ్యాన్ని పట్టిస్తాయి.

సురవరం ప్రతాపరెడ్డికి అందివచ్చిన సమాచారాన్ని 11 భాగాలుగా విభజించి 354 మంది కవుల సాహిత్యాన్ని పొందుపరిచి, 1934లో సంచికను వెలువరించాడు. కవికాలం, స్థలం, నిర్ణయించడంలో పరిశోధకులు పడిన శ్రమ పాండవుల అజ్ఞాతవాసం కన్న మించినదని సురవరం వాపోయారు.

**"ఆధునిక భావ పరిణామమునను సరించి నూతనముగా వెలువడిన భావ కవిత్వ సంప్రదాయమును గ్రహించి ఆంధ్రభారతి నుపాసించు నవయువ కవులు అనేకులు గలరు. కాని మారుమూలలనున్న వీరు తమతమ అభిరుచుల ననుసరించియు, తమకానందము నభిలషించియు వాఙ్మయకృషి సల్పుచుండుటయేగాని ఆధునిక పద్ధతుల ననుసరించి ప్రచారము చేసికొనుట, చేయించుకొనుట నెరుగరు"** అనే ప్రతాపరెడ్డి మాటలు ఆనాటి తెలంగాణలోని సాహితీపరుల స్థితిని కళ్ళముందు నిలుపుతాయి.

రాజుల రోజులు పోయినవి. ప్రజలే రాజులౌతున్నందున ఇక చరిత్ర స్వరూపం మారాలి. ఇక మీదట చరిత్రకారులు మనకు చెప్పాల్సింది. రాజులు, రాణులు, వారసులు, యుద్ధాలు, దివిడీలు కావు. ప్రజా చరిత్రలు, ఇవే సాంఘిక చరిత్రలు. ఈ దృష్టితోనే తెలుగువారి గతాన్ని తవ్వి తీసిన పరిశోధనా ఫలితమే ఆంధ్రుల సాంఘిక చరిత్ర.

**"పలువురు మన పూర్వుల సాంఘిక జీవనమును గూర్చి ముఖ్యముగా క్రీడాభిరామముపై కొన్ని వ్యాసాలు వ్రాసిరి. కాని సమగ్రమగు ఆంధ్రుల చరిత్ర ఇంతవరకు వెలువడలేదు. నేను మే నెల 1929లో హైదరాబాదు నుండి వెలువడుచుండిన 'సుజాత' మాస పత్రికలో తెనాలి రామకృష్ణుని కాల మందలి ఆంధ్రుల సాంఘిక జీవనము అను వ్యాసమును కేవలము పాండురంగ మహాత్మ్యములోని వర్ణన సమయ సందర్భములను బట్టి విషయమును తేల్చి వ్రాసితిని. ఆ పద్ధతి నాకు సరిగా కనబడెను. ఆ జాడను బట్టుకొని అప్పుడప్పుడు కాకతీయుల కాలమందలి సాంఘిక చరిత్ర, కృష్ణరాయలకాలపు సాంఘిక చరిత్ర, కదిరిపతి కాలపు సాంఘిక చరిత్ర, రెడ్డి యుగపు సాంఘిక చరిత్రము తెలుపు తెలుగువారి సాంఘిక చరిత్ర మొదలగు వ్యాసాలను వ్రాస్తిని. తత్పర్యవసానమే యీ గ్రంథము"** అని సురవరం వారు పుస్తకం రూపుదిద్దుకొన్న తీరును, వారి పరిశోధన జిజ్ఞాసువును అక్షరీకరించుకొన్నాడు.

సురవరం వారు తమ పరిశోధనకు ఆకరాలను పట్టీకరణ తీరులో పేర్కొన్నాడు. రాజుల రాజ్యాల చరిత్ర రాయడం అంత కష్టం కాదు. కాని సాంఘిక చరిత్ర రాయుట కష్టం. దీనికాధారాలు తక్కువ. తెనుగు సారస్వతం, శాసనాలు, స్థానిక చరిత్రలు, నాణెములు, సామెతలు ఇతర వాఙ్మయములోని సూచనలు, దాన పత్రాలు, సుద్దులు, జంగమ కథలు, పాటలు, చాటువులు, పురావస్తు సంచయాలు మున్నగునవి సాంఘిక చరిత్ర నిర్మాణానికి దోహదకారులు.

నన్నెచోడుని కుమార సంభవంలో కుమార స్వామిని సేనాధిపతిగా ప్రకటించిన వేళలో యుద్ధభేరులు మోగినవి. యుద్ధానికి సేనలను సన్నిద్ధ పరిచాడు స్కందుడు. ఎలగోలు సైన్యాన్ని ముందుపంపిరి. యుద్ధ విశేషాలు నన్నెచోడుని సమకాలీనాంశాలు కావ్యమందు

చోటుచేసుకొన్న తీరును వర్ణనల ఆధారంగా విశ్లేషించాడు సురవరం. పశ్చిమ చాళుక్యుల యుద్ధంలో గుర్రాల ప్రాముఖ్యతను గమనించాడు. సోమేశ్వరుడు – అభిలాషితార్థ చింతామణిలో పేర్కొన్నాడు. **"యవనదేశమందును కాంభోజదేశమందును పుట్టిన గుర్రములను పొందినచో జయమువీలగును. ఆ గుర్రాలచే కీర్తి లభించును. ఎవనికి అశ్విక బలం ఉండునో వాని రాజ్యము స్థిరముగా నుండును."** ఇలా చాళుక్య యుగ విశేషాలను వివరించుటకు అభిలషితార్థచింతామణి, కుమార సంభవం ప్రధానంగా ఎంచుకొని సాంఘిక విషయాలను వివరించాడు ప్రతాపరెడ్డి.

కాకతీయుల సాంఘిక పరిస్థితుల పరిశోధనకు ఆకరాలుగా నికలోకొంటి రాతలు, నాచన సోమన ఉత్తరహరివంశం ఏకామ్రనాథుని ప్రతాపచరిత్రలలోని వర్ణనాంశాలను బట్టి పరిస్థితులను నమోదు చేశాడు ప్రతాపరెడ్డి. పాచికలాట పోలిన ఆటలను 'కరలు' అని పిలిచినట్లు సాహిత్యాధారాల వల్ల పేర్కొన్నాడు. వేదాలలో, పురాణాలలో దీనినే 'అక్షఖేలన' పేరుతో పిలిచినట్లు ఋగ్వేద సంహితను ఆధారంగా చూపాడు. (ఋగ్వేద 10వ మండలం సూత్రం–34) ఋగ్వేదంలో కవష ఐలూష అనే ఒక శూద్ర రుషి ఈ దుర్వ్యసనాన్ని ఖండిచినట్లు ఆధారముందని ఉటకింపులను జతపరిచి విశ్లేషించాడు సురవరంగారు. ఇది వీరి పరిశోధన తార్కిక విశ్లేషణకు ఇదొక తార్కాణంగా భావింపవచ్చును.

రెడ్డి రాజుల కాలంలోని సాంఘిక విషయాలను నమోదు చేయడానికి శ్రీనాథుని భీమేశ్వర పురాణం, కొరవిగోపరాజు సింహాసన ద్వాత్రింశిక, మంచన కేయూర బాహు చరిత్రలను ఎక్కువగా శోధించాడు. రెడ్డి రాజ్యకాలంలో ప్రసిద్ధిపొందిన ఓడరేవు మోటుపల్లికి ముకుళాపురం అనే నామాంతరం కలదని, అక్కడ జొంకు అనే ఓడలు ఉండేవని కావ్య వర్ణనల ఆధారంగా తెలిపాడు. సంతానం కలగని కాపు ఆడపడుచులు కూనలమ్మ (తెల్లచీర, పసుపు రంగు అంచు) చీరలు ధరించి మూలగురమ్మ పూజల్లో పాల్గొంటారని పేర్కొన్నాడు. పెదకోమటి వేమారెడ్డి కూర్చిన నాట్యశాస్త్రములో ఒక పారసీక నర్తనాన్ని చేర్చి దానికి 'మత్తిలినర్తనం' అనే పేరు సూచించి వర్ణించాడని సురవరంగారు విశ్లేషించాడు. చారిత్రక విభిన్నాంశాలను సాహిత్య వర్ణనల ద్వార విశ్లేషించి నమోదు చేయడం సురవరం గారి పరిశోధనలోని ప్రమాణతలు.

విజయనగర కాలంలో పేరొందిన విలాసవంతమైన పండుగ మదనోత్సవం / వసంతోత్సవం / హోళి, దీనిని నికలోకొంటి అక్షరబద్ధం చేశాడు. పారిజాతాపహరణ వర్ణనల్లోనూ విపుల వర్ణన లున్నాయి. వీధులలో ఎరుపు రంగు నీరుంచెడివారు. వసంతోత్సవ దినాలలో ఆ వీధుల వెంట వెళ్ళేవారిపై ఆ నీళ్ళు చల్లడం ఒక సంప్రదాయమని చివరకు రాజుకాని, రాణికాని ఆ దారిన వెళ్ళితే వారికి ఆ సంప్రోక్షణ తప్పకుండెను. ఆనాటి వినోద విశేషాలలో వసంతోత్సవ వినోదం బహుళ ఆదరణను పొందినట్లు సురవరం పేర్కొన్నాడు.

**ప్రతి వర్ష వసంతోత్సవ కుతుకా గత సుకవి నికరగుంభి**
**స్మృతి రోమాంచ విశంకిత చతురాంతఃపుర వధూ ప్రసాదనరసికా**
(పారిజాతాపహరణం)

కదిరిపతి – శుకసప్తతి, సారంగు తమ్మయ్య – వైజయంతీ విలాసం ద్వారా విజయనగర అనంతర పరిస్థితులను ప్రతాపరెడ్డి నమోదు చేశాడు. బొబ్బిలి కాయల, (కాలిమట్టెలు / కాలి మూడవ వేలికి ధరించేవి) శూరభటుల ధారణ విశేషం, వేషధారణ, మృణ్మయ పాత్రలను దేవుని పాత్రలుగా భావిస్తారని పాండురంగ మాహాత్మ్యం ఆధారంగా పేర్కొన్నాడు. నేటికిని శుభకార్యాలలో మట్టిపాత్రలు వాడే సంప్రదాయం వుంది.

కుతుబ్‌షాహిల కాల పరిస్థితులను విశ్లేషించుటకు, పోతులూరి వీరబ్రహ్మం, యోగి వేమన రాతలను, గోగులపాటి కూర్మనాథకవి, సింహాద్రి నారసింహ శతకాన్ని ఆధారాలుగా స్వీకరించి సాంఘిక చిత్రణ చేశాడు సురవరంగారు. మనదేశంలో పొగాకును ప్రవేశపెట్టినవారు పోర్చుగీసువారని చరిత్ర పరిశోధనలు నమోదు చేశారు. కర్త తెలియని చంద్రశేఖర శతకంలో పొగాకు వల్ల కలిగే బాధలను పేర్కొన్నట్లు, మిరపకాయలు కూడ అమెరికా నుండి దిగుమతి అయిన పంటగా సురవరం ప్రతాపరెడ్డి విశ్లేషించాడు.

తప్పెట్లు, కాహళములు, కాలికొమ్ములు, బూరలు, శంఖములు, సన్నాయిలు, డోళ్ళు, రుంజలు, చేగంటలు ఇవి చేరగ ఏర్పడినదే మన పూర్వుల మిలటరీ బ్యాండ్ అని కావ్యాలలోని యుద్ధ వర్ణనల ద్వారా సురవరం గారు విశ్లేషించాడు.

ముక్కెర, నెత్తిబిళ్ళలు, దండెకడెములు, వంకీలు, జోమాల దండలు, తాటంకములు, ముత్యాలకమ్మలు, కాంచీనూపుర కంకణములు, త్రిసరములు మొరవంక కడియములు, వడ్డాణము ఇవి మన అవ్వలు ధరించిన నగలు అని పూర్వ కావ్యవర్ణనల ఆధారంగా రెడ్డి పేర్కొన్నాడు.

వెంజావళి, జయరంజి, మంచుపుంజము, మణికట్టు, భూతిలకము, శ్రీవన్నిమ, చీని, మహాచీని, పట్టు, సోంపట్టు, నెరపట్టు, పచ్చనిపట్టు, నేత్రంపట్టు, సంకుపట్టు, భావజ తిలకము, రాయశేఖరం, రాయవల్లభం, వాయుమేఘం, గజవాళం, గండవరం, వీణావళి ఇట్టివన్నీ ఒకనాడు మన తెలుగు ప్రాంతాలలో నేయబడిన పట్టువస్త్ర విశేషాలను పల్నాటి వీర చరిత్ర ఆధారంగా సురవరం ప్రతాపరెడ్డి నమోదు చేశాడు.

తాటాకు పుస్తకములు, గంటములు, బొందకొయ్య, కొడెము, పొగడదండ, పూర్వపు చిత్తరువులు, దుస్తులను, వేషాలను


తెలుపుపటాలు, ప్రాచీన నాణెములు, గడియారపు కుదుక, పూర్వకాలపు చెండ్లు, కోళ్ళ చరుణాయుధలు వంటివి సేకరించి, ఒక మ్యూజియం ఏర్పాటు చేయాలని, భావితరాలకు పరిచయం చేయాలని సురవరం ప్రతాపరెడ్డి సూచించాడు.

రాజుల చరిత్రలు మనకంతగా సంబంధించినవికావు. సాంఘిక చరిత్రలు మనకు పూర్తిగా సంబంధించినట్టివి. అవి మన పూర్వుల చరిత్రను మనకు తెలుపును. మన తాత ముత్తాతలు ఎట్టివారై ఉ ండిరో మన అవ్వలు ఎట్టి సొమ్ములు తాల్చినది. ఎట్టి అలంకరణలు ధరించినది. మనపూర్వులు ఏ దేవతలను కొల్చినది. ఏ విశ్వాసాలు కల్గి ఉండినది. ఏ ఆటపాటలతో వినోదించినది దొంగలు దోపిడీలు చేసినపుడు వేసేడి శిక్షలు, ఏ జాడ్యాలకు ఏ చికిత్సలు చేసినది. ఎట్టి కళలయందు ప్రీతికలవారైరి, ఏయే దేశాలతో వ్యాపారాలు చేసినది. ఎట్టి కళలయందు ప్రీతికలవారైరి, ఏయేదేశాలతో వ్యాపారాలు చేసినది. తెలిసికొనుటకు చేసిన ప్రయత్న సారాంశమే **ఆంధ్రుల సాంఘిక చరిత్ర** గ్రంథం. సాంఘిక చరిత్రల ప్రయోజనాన్ని సురవరం తన మాటల్లో ఎరుకపరిచాడు. ఇది సురవరం ప్రతాపరెడ్డి పరిశోధనా విరాట్ రూపానికి నిలువెత్తు సాక్షం.

సురవరం వారు **రామాయణ విశేషాలలో** రెండు అంశాలను పరిశోధనాత్మకంగా వివరించాడు. 1. రామాయణ ఆధ్యాత్మిక తత్వాన్ని భక్తి విషయాన్ని రామావతార మహత్వాన్ని వివరించేది. 2. రామాయణంలోని వాస్తవాంశాలను పరిశీలించే విధానాన్ని విపులంగా శోధించి, ఫలితాంశాలను విస్తృతంగా చర్చించాడు.

చ్యవనుడు ఏదో ఒక రీతిలో రాసిన రామాయణాన్ని వాల్మీకి పెంచి రాశాడని ఊహించాడు. చ్యవనుడు వాల్మీకి తండ్రి అయి ఉంటాడు. ఇద్దరూ భృగువంశానికి చెందినవారని ఈ భృగువు పారసీకులకు గురువై ఉంటాడని పేర్కొన్నాడు. (కేక) కైకేయి తండ్రి రాజ్యం గిరివ్రజం లేక రాజగృహం ఇరాన్ మండలమని పేర్కొన్నాడు. కైకేయి ఇరాన్ జాతికి చెందిన సుందరాంగి అయి ఉంటుందని అంచనావేశాడు. రామాయణ రహస్యాలలో ఇలాంటి నూతనాంశ సమన్వయం. **హిందువుల పండుగల** మీద కసిరెడ్డి వెంకటరెడ్డిగారు రాసిన వ్యాసంలో సురవరంవారి పరిశోధన శ్రమను సూచిస్తూ – ఒక అపూర్వ ప్రణాళికతో, కొంతమేర ఆనాటికి గల ధర్మాన్ని అనుసరించి అపూర్వసామాగ్రిని ఆధారంగా గ్రహించి (వరాహపురాణం, గరుడపురాణం, ఆదిత్య పురాణం, దేవలస్మృతి, మనుస్మృతి, పరాశరస్మృతి, హారీతస్మృతి) ఈ గ్రంథాన్ని అందించారు అని పేర్కొన్నాడు.

**బూర్గుల రామకృష్ణారావు**గారిలో సాహిత్య పరిశీలకులుగా విశిష్ట స్థానం ఉంది. వీరికి సంస్కృతాంధ్రాంగ్ల, మరాఠి, కన్నడ, పారసీ, ఉ ర్దూ సాహిత్యాలతో చక్కని పరిచయం ఉండడం వల్ల తులనాత్మక



పరిశీలన కూడ సమర్ధతతో చేయగలిగాడు. వీరు తొలితరం తెలంగాణ తెలుగు భాషాసాహిత్య చారిత్రక పరిశోధకులలో ఒకరని నమోదు చేయవచ్చును. వీరి **'సారస్వత వ్యాసముక్తావళి'** పరిశోధన తత్త్వానికి అద్దం పడుతుంది.

వీరి పరిశోధన దృష్టికి **'కాకునూరి అప్పకవి జన్మస్థానం, రెడ్డిరాజుల కాలపు మత సంస్కృతులు'** అనే వ్యాసాలలో చరిత్ర, సాహిత్యం అవినాభావ సంబంధం కల్గినవని కాల నిర్ణయం, కవి జీవిత విషయాల వివరణలో ఒకదానికొకటి పూరకాలుగా దోహదపడుతాయని బూర్గుల నిరూపించారు.

**'నవీన వాఙ్మయము – యెంకిపాటలు'** అనే వ్యాసంతో వీరికి ప్రాచీన సాహిత్య పరిచయంతో పాటు సమకాలీన భాషల్లో వెలువడుతున్న ఆధునిక సాహిత్యంతో లోతైన పరిచయం ఉందన్న విషయం ఈ వ్యాస పరిశీలనతో ద్యోతకమౌతుంది. ఈ వ్యాసంలో తెలుగులోని భావకవిత్వంపై వీరికి సంపూర్ణ అవగాహన ఉన్నట్లు మనకు బోధపడుతుంది.

బూర్గులవారికి బహుభాషల పాండిత్యంతోపాటు, సాహిత్య అధ్యయనం, పరిశోధనాత్మక రచనా వ్యాసంగం ప్రవృత్తిగా కొనసాగి నట్లు బోధపడుతుంది.

పాలమూరు ప్రాంత పండితులు నిరంతర అధ్యయన శీలురే కాక గతాన్ని తవ్వితీసి నిజాలను బయలుపరిచి తెలుగు సాహిత్యానికి వెలుగులు నింపిన మార్గశోధకులు కూడ ఉన్నారని ఎరుక పరచడమే వ్యాస ప్రయత్నం.

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు -
సామాజిక అవలోకనం - 12

# అమ్మ మనసు

**టి. లక్ష్మినారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

కళాతపస్వి గారి చిత్రాలను మరోసారి గుర్తుచేసుకునే ప్రయత్నంలో భాగంగా " కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం" నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం "అమ్మ మనసు". ఈ చిత్రం 1974వ సం॥లో విడుదలైంది. చిత్రం యొక్క నిడివి రెండు గం.పదిహేడు నిమిషాలు. ఈ చిత్ర ప్రధాన తారాగణం చలం, కైకాల సత్యనారాయణ, జయంతి, భారతి తదితరులు. కె.విశ్వనాథ్ గారి అంతకుముందు చిత్రాలన్నీ ఎన్.టి.ఆర్., ఏ.ఎన్.ఆర్., శోభన్ బాబు లాంటి కథానాయకులతో నిర్మించినప్పటికీ ఈ చిత్రం మాత్రం చలం, కైకాల సత్యనారాయణలు ప్రధాన తారాగణంగా తెరకెక్కడం విశేషం. ఈ చిత్రం విజయలక్ష్మీ మూవీస్ ఆధ్వర్యంలో నిర్మించబడగా జీవీఎస్ రాజు నిర్మాతగా వ్యవహరించారు.



**'అమ్మ మనసు'** చిత్రం యొక్క పేరును బట్టి చిత్రం ఎలాంటి కథను చెప్పబోతుందో అర్థం చేసుకోవచ్చు. చిత్ర కథలోకి వెళితే చిత్ర ప్రారంభం కస్తూరిబా బాల విహార్ అనే అనాథ పిల్లలను చేర దీసే ఒక ప్రాంగణంలో మొదలవుతుంది. అక్కడ ఉన్న పిల్లలందరినీ పర్యవేక్షించే వ్యక్తి రాజు(చలం). 'సుప్రభాతము శుభకరము' అంటూ సాగే పాటతో రాజు, పిల్లల మధ్య వుండే ఆహ్లాదకరమైన దృశ్యాలతో చిత్రం ముందుకు సాగుతుంది. ఆ బాలల కేంద్రాన్ని నిర్వహించే వ్యక్తి డాక్టర్ మాధవి (జయంతి). ఆ బాలల కేంద్రంలో చాలా మంది చిన్న పిల్లలున్నప్పటికీ మాధవికి రవి అనే ఆరేళ్ళ బాబు అంటే ప్రత్యేక అభిమానం వుంటుంది. రవి మూగవాడు. మాటలు రాకపోయినా చలాకీ కుర్రాడు, పిల్లలందరిలోకీ చురుకైన వాడు. అదే బాలల కేంద్రంలో రాజుతో పాటు రాజుకు సహాయంగా ఒక యువతి వుంటుంది. ఆమె రాజుతో పాటు బాలల కేంద్రంలో పనిచేస్తూ రాజుకు చేదోడు వాదోడుగా వుంటుంది. రాజుపై లోలోపల ప్రేమను పెంచుకున్న అమ్మాయి ఆ పనిమనిషి.

అప్పుడప్పుడూ బాలల కేంద్రానికి వచ్చి డబ్బులు సహాయం చేస్తూ డాక్టర్ మాధవితో మలినం లేని అనుబంధాన్ని కల్గిన వ్యక్తి వాసుదేవరావు (కైకాల సత్యనారాయణ). వాసుదేవరావు వృత్తి రీత్యా ఇంజినీర్. అతను తన వృత్తి నైపుణ్యంతో విదేశాల్లో సైతం ఉద్యోగం నిర్వహించి వచ్చిన వ్యక్తి. వాసుదేవరావు ఆ బాలల కేంద్రానికి వచ్చే ప్రతిసారి మాధవిలాగే మూగబాలుడైన రవిని అభిమానంతో చేర దీస్తుంటాడు. వాసుదేవరావు భార్య స్వరాజ్యలక్ష్మి. స్వరాజ్యలక్ష్మి చెల్లి విజయలక్ష్మి(భారతి). వాసుదేవరావు దంపతులది సంపన్న జీవితం. వాసుదేవరావు స్వరాజ్యలక్ష్మిని ప్రేమగా రాజ్యం అని పిలుస్తుంటాడు. విజయలక్ష్మి యుక్తవయసులో ఉన్న అమ్మాయి, ఐశ్వర్యవంతురాలు అవ్వడం చేత విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తుంటుంది. దానిలో భాగంగా ఆమె గుర్రపుపందాల పోటీల్లో పాల్గొంటూ డబ్బులు సంపా దించాలనే విషయాన్ని తన విహాహాల్లో భాగంగా మార్చుకుంటుంది.

బాలల కేంద్రంలో ఉన్న రాజు అక్కడ పనిచేస్తూనే గుర్రపు పందాలలో పాల్గొంటూ ఏదో ఒకరోజు స్థాయికి మించిన డబ్బులు సంపాదించాలి అనే ఊహలో జీవిస్తుంటాడు. ఏదో ఒకరోజు అలాంటి అదృష్టం తనను వరిస్తుందనే ఆలోచనతో వుంటాడు. కాని తాను గుర్రపు పందాల్లో పాల్గొనే విషయం తన యజమాని మాధవికి తెలియకుండా జాగ్రత్తపడ్తుంటాడు. ప్రతిసారి తను పందానికి వెళ్ళే రోజు బాలల కేంద్రంలోని ఏదో ఒక పిల్లాడితో కొన్ని నెంబర్స్ ఎంచుకొంటూ వుంటాడు. ఒకరోజు రాజు పందానికి కాలినడకన వెళ్తూ వుంటాడు. కొన్ని నాటకీయ పరిణామాల మధ్య విజయలక్ష్మితో రాజుకు పరిచయం ఏర్పడుతుంది. విజయలక్ష్మికి రాజుకు మధ్య తక్కువ రోజుల్లోనే మంచి సాన్నిహిత్యం ఏర్పడుతుంది. వారి మధ్య తక్కువ కాలంలోనే ప్రేమ చిగురిస్తుంది. రాజు, విజయలక్ష్మిల మధ్య ప్రేమ కొన్నాళ్ళ తర్వాత తన అక్కకు తెలుస్తుంది. వారి ప్రేమను గూర్చి తన భర్త వాసుదేవరావుతో చర్చించి, రాజు పేదరికాన్ని గురించి తెలుసుకొని వారి ప్రేమను వారిస్తుంది.

స్వరాజ్యలక్ష్మి–వాసుదేవరావు దాంపత్య జీవితం సాఫీగా సాగుతుంది. ఈ క్రమంలో ఆమె గర్భవతి అవుతుంది. ఆ సమయంలో డాక్టర్ మాధవిని సంప్రదించి తన గర్భానికి

సంబంధించిన జాగ్రత్తలు తీసుకుంటూ వుంటుంది. కాని దురదృష్టవశాత్తు ఒకరోజు ఆమె గృహంలో మెట్లపై నుండి జారిపడడంతో తన గర్భానికి ప్రమాదం జరుగుతుంది. ఆమెకు ప్రాణాపాయ స్థితి ఏర్పడుతుంది. డాక్టర్ల శ్రమతో రాజ్యం గర్భంలో ఉన్న పాప మరణించినా ఆమె బతికి బట్టకడుతుంది. కాని ఆమెకు జరిగిన ప్రమాదం వల్ల ఆమె తర్వాతి కాలంలో ఎప్పటికీ గర్భం దాల్చదు అనే చేదు నిజం తెలుస్తుంది. ఆ విషయం తెలిసి వాసుదేవరావు దంపతులు క్రుంగిపోతుంటారు. ఏ పాపనైనా దత్తత తీసుకొని పెంచుకుందాం అనే ఆలోచన వారిలో కలిగినప్పటికీ దేవుడిని నిందిస్తూ ఉండిపోతుంటారు. మరోవైపు డాక్టర్ మాధవి మాత్రం తన బాలల కేంద్రంలో ఎంతమంది పిల్లలున్నప్పటికీ రవిని ప్రత్యేకంగా చేరదీస్తుండడాన్ని రాజుతో పాటు పనిచేసే యువతి పరిశీలిస్తూ వుంటుంది. మాధవికి చిన్నపిల్లాడైన బాబుకి మధ్య గల అనుబంధానికి కారణం ఏమై వుంటుందా అనే విషయాన్ని అన్వేషిస్తూ వుంటుంది. కాని డాక్టర్ మాధవి జీవితంలో బయటి ప్రపంచానికి తెలియని ఏదో ఒక కోణం దాగి వుంటుంది అనే విషయాన్ని మాత్రం పనిమనిషి బలంగా నమ్ముతుంది. దానికి తోడు తరచుగా వాసుదేవ రావు డాక్టర్ మాధవిని వచ్చి కలుస్తుండడాన్ని, ఆమెతో ఏవో విషయాలను తీక్షణంగా సంభాషిస్తూ వుండడాన్ని రహస్యంగా తెలుసుకొంటూ వుంటుంది.

రాజు తన యజమాని మాధవికి తెలియకుండా గుర్రపు పందాల కు వెళ్తున్న విషయాన్ని ఒకానొక సందర్భంలో ఆమె తెలుసుకుని మందలిస్తుంది. కాని రాజు తనకున్న అలవాటును మార్చుకోలేక పోతాడు. అయినప్పటికీ తాను చాలాసార్లు పందాలకు వెళ్తాడు. తాను పందానికి వెళ్ళే ప్రతిసారి బాలల కేంద్రంలో ఉన్న బాలల్లో ఎవరో ఒకరిచేత నెంబర్స్‌ను ఎంచుకుంటూ వుంటాడు. ఒకానొక సందర్భంలో రాజు మాటలు రాని రవి సహాయంతో కొన్ని నెంబర్స్ ను ఎంపిక చేయించుకుంటాడు. సరిగ్గా రవి ఎంపిక చేసిన నెంబర్ ఉన్న గుర్రాలు ఆ వారం పందెంలో గెలుస్తాయి. రాజు ఆ విషయం తెలుసుకుని ఆశ్చర్యపడుతూ చిన్ననాటి నుండి తాను అనుభవించిన పేదరికానికి స్వస్తి పలికే క్షణాలు వచ్చాయని సంబరపడతాడు. మరోవైపు రాజును ప్రేమించిన విజయలక్ష్మి తాను రాజును తప్ప మరెవ్వరినీ వివాహం చేసుకోనని తన అక్క స్వరాజ్యంతో మొండి కేస్తుంది. కాని తన అక్క మాత్రం రాజుతో తన సోదరి వివాహాన్ని ససేమిరా ఒప్పుకోదు. ఆమె బావ వాసుదేవరావు మాత్రం ఆమెకు పరోక్షంగా మద్దతుగా వుంటాడు.

రాజు పందాన్ని గెలిచిన ఆనందంలో తన యజమాని మాధవిని కలిసి తాను పందెం గెలవడానికి కారణం రవి ఎంపిక చేసిన నెంబర్స్ కారణం అని తెలియజేస్తాడు. తన జీవితాన్ని మార్చిన రవిని తాను దత్తత తీసుకోవాలనుకుంటున్నట్లు తన నిర్ణయాన్ని తెలియజేస్తాడు. రవిని రాజుకు దత్తత ఇచ్చే విషయంలో మాధవి ముందు తటపటాయించినా చివరకు అంగీకరిస్తుంది. రాజు తనకు వచ్చిన పందెం డబ్బులలో మూడు లక్షలు రవి పేరుపై రాస్తాడు. ఆ విషయం పేపర్లలో కూడా వస్తుంది. ఆ విషయాన్ని పేపర్లో చూసిన వాళ్ళలో కొంతమంది రవి తమ కుమారుడే అంటూ మాధవికి సంబంధించిన బాలల కేంద్రానికి వస్తారు. కారణం రవిపై రాజు రాసిన డబ్బుల కోసం. మరోవైపు రాజు ధనవంతుడిగా మారడంతో విజయలక్ష్మి రాజుతో జీవితాన్ని పంచుకోవాలనుకున్న నిర్ణయాన్ని అక్క రాజ్యం అంగీకరిస్తుంది. తదుపరి విజయలక్ష్మి, రాజును వివాహం చేసుకుంటుంది. కాని రాజు తన దాంపత్య జీవితంలో సంతానం వద్దనుకుంటాడు. తాను అప్పటికే దత్తత తీసుకున్న రవి పెంపకంలో, ప్రేమలో వారికి కలగబోయే సంతానంపై ఏర్పడే ప్రేమ ఎక్కడ అడ్డంకిగా మారుతుందో అనే భయం. అదే విషయాన్ని రాజు తన యజమాని అయిన మాధవితో ప్రస్తావిస్తాడు. ఈ ప్రస్తావన సమయంలో జరిగిన సంభాషణను అంతా విజయలక్ష్మి వింటుంది. ఆ మాటలకు సంబంధించిన అంతరార్థాన్ని పూర్తిగా అర్థం చేసుకోకుండా మాధవి, రాజుల మధ్య సంబంధాన్ని విజయలక్ష్మి పూర్తిగా తప్పుగా అర్థం చేసుకుంటుంది.

బాలల కేంద్రంలో రాజుతో పాటు పనిచేసిన పని మనిషి రాజు తనను వివాహం చేసుకోలేదనే కారణంగా పగను పెంచుకుంటుంది. రాజుపై ఎలాగైనా ఆ కక్షను తీర్చుకోవాలని నిర్ణయించుకుంటుంది. దానిలో భాగంగా ఆమె వాసుదేవరావు దంపతుల గృహంలో పనిమనిషిగా చేరుతుంది. అంతేకాక స్వరాజ్యలక్ష్మి, విజయలక్ష్మిలకు రాజు, మాధవి, పసిపిల్లాడి గూర్చి లేనిపోని మాటలు నూరి పోస్తుంది. ఆ మాటలకు విజయలక్ష్మి పసిపిల్లాడైన రవిని నిర్లక్ష్యంగా చూడడం, దురుసుగా మాట్లాడడం చేస్తుంది. రాజు భార్య విజయలక్ష్మి గర్భవతి అవుతుంది. ఆ విషయం తెలిసి రాజు రవి విషయంలో కొంత ఆందోళన చెందుతాడు. జరుగుతున్న విషయాలన్నింటినీ అంచనా వేయగల్గిన వాసుదేవరావు మాధవిని కలిసి రాజు, విజయలక్ష్మి, రాజ్యంల మధ్య ఉత్పన్నమైన పరిస్థితులను గురించి చర్చిస్తాడు. ఏ రోజుకైనా నిజాలను చెప్పక తప్పదు కాబట్టి నిజాలను తన భార్య రాజ్యానికి, విజయలక్ష్మికి వివరించి చెప్పదలిచాను అని ప్రస్తావిస్తాడు. దానికిగాను మాధవి, వాసుదేవరావుతో రవికి సంబంధించిన ఏ విషయాన్ని కూడా నీకూ, నాకూ తప్ప మూడో మనిషికి తెలియకూడదు అని షరతు విధిస్తుంది. ఒకవేళ రవికి సంబంధించిన రహస్యం మరో మనిషికి తెలిస్తే ఆ మరుక్షణం తాను ప్రాణాలతో వుండను అని చెప్తుంది.

రాజుతో గొడవపడి విజయలక్ష్మి అతడిని వదిలి తన అక్క రాజ్యం చెంతన చేరుతుంది. అప్పటికే రవికి విజయలక్ష్మితో తల్లితో సమానమైన అనుబంధం ఏర్పడ్తుంది. కాని విజయలక్ష్మి మాత్రం

పసిబాలుడైన రవిని చీదరింపులు చేయడం మొదలుపెడుతుంది. కాని రవి మాత్రం తల్లితో సమానమైన ప్రేమానురాగాలను పొంది వుండడం వల్ల ఆమె చీదరింపులను పట్టించుకోకుండా తల్లిలా భావిస్తూ వుంటాడు. అక్క చెంతన చేరిన విజయలక్ష్మి పాపకు జన్మనిస్తుంది. విజయలక్ష్మి ఇంటిని వదిలి వెళ్ళిన నాటి నుంచి ఆమెపై బెంగతో రవి మంచం పట్టాడు. రాజుకు తన భార్య ప్రసవం విషయం తెలిసి దానికిగానూ సంతోషపడి కూడా, రాబోయే కాలంలో రవి ఆమె చేత ఎక్కడ నిర్లక్ష్యం చేయబడ్తాడో అని భయపడతాడు. విజయలక్ష్మి పాపకు జన్మనివ్వడం అనే విషయం రాజు భయానికి మరింత ఊతాన్నిస్తుంది. పసిబాబు రవిని, తనను వదిలి వెళ్ళిన తన భార్య విజయలక్ష్మిని వారి ఇంటికి వెళ్ళి చూడడానికి కూడా రాజు మనసు ఒప్పుకోదు. విజయలక్ష్మికి సంతానం కల్గిన విషయం తెలిసిన మాధవి రాజును నీ భార్య విజయలక్ష్మి వద్దకు వెళ్ళి ఆమెను పలకరించి నీ పతిధర్మాన్ని నిలుపుకొమ్మంటూ హెచ్చరిస్తుంది. అంతేకాక రవి ఆరోగ్యం కుదుటపడాలంటే రవిని అతడు తల్లిలా ప్రేమించిన విజయలక్ష్మి వద్దకు పంపడమే ఔషధంలా పనిచేస్తుంది అంటూ సలహా ఇస్తుంది.

రాజుకు ఇష్టం లేకపోయినా మాధవి సలహా మేరకు రవిని తీసుకొని భార్య విజయలక్ష్మి వద్దకు వెళ్తాడు. కాని విజయలక్ష్మి మాత్రం ఎడమొహం, పెడమొహంగానే వుంటుంది. తప్పనిసరి పరిస్థితుల్లో రాజు రవిని విజయలక్ష్మి వద్ద ఉంచుతాడు. కాని అప్పటికే ఆ గృహంలో పనిచేస్తూ రాజుపై పగ తీర్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్న పనిమనిషి రవిని హింసిస్తూ వుంటుంది. అంతేకాక రవి ముచ్చటపడి పసిపాపతో ఆడుకోవడానికి ప్రయత్నం చేసే ప్రతిసారి మందలిస్తుంది. విజయలక్ష్మితో రవిపై పసిబాబు అనే విషయాన్ని కూడా చూడకుండా లేనిపోని అబద్ధాలు చెప్పి తల్లి వరసైన విజయలక్ష్మి చేత కొట్టించేలా చేస్తుంది. ఒకరోజు రవిని రాజ్యం, విజయలక్ష్మి, పనిమనిషి చీవాట్లు పెట్టడం, కొట్టడం చూసి తట్టుకోలేక పోయిన వాసుదేవరావు పనిమనిషి పై చేయి చేసుకుంటాడు. అడ్డుతగలబోయిన తన భార్య రాజ్యాన్ని సైతం కొడతాడు. దానికి రాజ్యం భర్తకు ఎదురుతిరుగుతూ వాడిపై చేయి వేస్తే మీకు అంతలా కోపమెందుకో అంటూ నిలదీస్తుంది. దానికిగాను వాసుదేవరావు మాధవికి ఇచ్చిన వాగ్దానాన్ని లెక్కచెయ్యకుండా బదులిస్తూ “ఎందుకంటే రవి మీరు తప్పుగా అర్థం చేసుకుంటున్న డాక్టర్ మాధవి కుమారుడు కాబట్టి” అంటాడు. దానికిగాను రాజ్యం “అయితే మీకెందుకంత బాధ” అంటుంది. దానికి మళ్ళీ బదులిస్తూ వాసుదేవరావు “ఎందుకంటే వాడి తండ్రిని నేనే కాబట్టి” అంటాడు. ఆ మాటలకు రాజ్యం, విజయలక్ష్మిలు నిర్ఘాంతపోతారు. అప్పుడు వాసుదేవరావు “మీరు విన్నది నిజమే, మాధవి, నేను చదువుకునే రోజుల్లో ప్రేమించుకున్నాం, వివాహం కూడా చేసుకోవాలనుకున్నాం, కాని చిన్ననాటి అల్లుడిని అని చేరదీసి




పెంచాడు మీ నాన్న. నా పై నువ్వు పెంచుకున్న ప్రేమ వల్ల నేను లేకపోతే నువ్వు చనిపోతావు అని మీ నాన్నను భయపెట్టడం వల్ల కూతురు పై వున్న ప్రేమతో, నన్ను చిన్ననాటి నుంచి పెంచాడు అనే స్వార్థంతో నేను నిన్ను మాత్రమే పెళ్ళి చేసుకోవాలని నిబంధన పెట్టాడు. అంతేకాదు మా ప్రేమ విషయం తెలియగానే మీ నాన్న మాధవి కాళ్ళు పట్టుకుని నా నుంచి దూరం కావాలంటూ ఆమెను వేడుకున్నాడు. ఆయన విన్నపాన్ని మన్నించి తన జీవితాన్ని గురించి ఆలోచించకుండా మాధవి నాకు దూరమైంది. కాని దూరమైన కొన్నాళ్ళకు తెలిసింది ఆమె నా వల్ల తల్లి కాబోతుందని. ఆ తర్వాత మాధవి మరో వివాహం చేసుకోకుండా, బయటి ప్రపంచానికి తాను తల్లి అనే విషయాన్ని తెలియనీయకుండా బాలల కేంద్రాన్ని నిర్వహిస్తూ జీవిస్తోంది” అంటూ వివరిస్తాడు. ఆ మాటలు విని రాజ్యం, విజయలక్ష్మిలు పశ్చాత్తాపం చెందుతారు. అంతలో పసిబాలుడు రవి తన అమాయకత్వంతో విజయలక్ష్మికి పుట్టిన పాపను తీసుకుని ఇంట్లో నుంచి పారిపోతాడు. అందరు కలిసి రవిని వెతుకుతుంటారు. పారిపోయే క్రమంలో రవికి ప్రమాదం అవుతుంది. రవిని ఆసుపత్రిలో చేర్చుతారు ఆ ప్రమాదం గురించి తెలిసి మాధవి ఎలాగైనా రవిని కాపాడాలని మంచి డాక్టర్లకు కబురు పంపి వారిచేత చికిత్స చేయిస్తుంది. అదే సందర్భంలో రాజ్యం మాధవితో నిన్ను తప్పుగా అర్థం చేసుకొన్నందుకు క్షమించమని వేడుకుంటుంది. రాజ్యం మాటల వల్ల వాసుదేవరావు తన వాగ్దానాన్ని అతిక్రమించి నిజాన్ని అందరికీ వివరించి చెప్పాడనే విషయాన్ని గ్రహిస్తుంది. నేరుగా తన గదిలోకి వెళ్ళి నిశ్చేష్టురాలిగా కూర్చుంటుంది. కాని తన జీవితంలో తన కుమారుడు రవి గురించి ఎలాంటి విషయం వినకూడదని అనుకుందో అలాంటి విషయం వినాల్సి వస్తుందనే భయంతో కూర్చున్న చోటే మరణిస్తుంది. రవికి ప్రాణాపాయ స్థితి నుంచి

కోలుకున్నాడని తెలిసాక వాసుదేవరావు అందరితో కలిసి మాధవి దగ్గరకు వస్తాడు. రవి గురించి చెప్పడానికై కుర్చీలో కూర్చున్న మాధవిని కదుపుతాడు. కాని ఆమె అప్పటికే మరణించి వుంటుంది. అంతా విషాదంలో మునిగిపోతారు. కథ సమాప్తం అవుతుంది.

***చిత్ర విశేషాలు :*** ఈ చిత్రం ప్రధాన తారాగణం పెద్ద, పెద్ద నటులతో కాకుండా కథానుగుణంగా దాని పరిమితిలో ఏ మేరకు నటులు అవసరమో ఆ స్థాయిలో వుంటారు. కథంతా ఆరు, ఏడు పాత్రల చుట్టూనే తిరుగుతుంది. ప్రతీ పాత్రకు దాని తాలూకు బలం వుండి కథకు కీలకం అయ్యే విధంగా వుంటుంది. వాస్తవానికి విశ్వనాథ్ గారు ఇంతకుముందు చిత్రాల్లో కూడా ప్రతీ పాత్ర కథలో కీలకమై కథను ముందుకు నడపడంలో ప్రభావశీలంగా వుండేలా చూసుకుంటారు. కథలో వుండే ప్రతీ పాత్రకు ఒక ఔచిత్యం వుంటుంది. రాజు పాత్ర హీరో పాత్రలా కొన్నిసార్లు అన్పిస్తే, వాసుదేవరావు హీరో పాత్రలా మరికొన్ని సన్నివేశాలు అనిపిస్తాయి. కాని చిత్ర నామానికి అనుగుణంగా కథలో అన్ని విషయాల్లో ఏదో ఒకవిధంగా అంతర్లీనంగా సంబంధాన్ని కలిగి వుండి కథలో జీవాన్ని నింపే పాత్ర మాత్రం కచ్చితంగా "మాధవి"దే. కథంతా కన్న తల్లి మనసు కొడుకు కోసం ఎంతలా వెంపర్లాడుతుందనే విషయాన్ని మాధవి పాత్ర చూపుతుంది. మాధవి పాత్రలో జయంతి గారి నటన అద్భుతం అని చెప్పొచ్చు. కథ మొత్తంలో కూడా జయంతి గారి పాత్ర స్వభావం గాఢతతో కూడిన నటనను వ్యక్తం చేసేలా వుంటుంది. ఇక అప్పటికే అన్ని రకాల పాత్రలు పోషించిన కైకాల సత్యనారాయణ గారు ఈ చిత్రంలో పాజిటివ్ ఆలోచన, వ్యక్తిత్వం కలిగిన పాత్రను పోషించడం విశేషం. వాసుదేవరావు పాత్రలో ఒకవైపు భర్తగా, మరోవైపు మాధవి పాత్రకు రహస్య ప్రేమికుడిగా వుంటాడు. చలం గారి పాత్ర సన్నివేశాలకు అనుగుణంగా కొంత హాస్యాన్ని పుట్టించేదిగా వుంటుంది. దానితోపాటు విజయలక్ష్మికి భర్తగా మారినప్పుడు, పేదరికం నుండి గుర్రపు పందాలలో గెలిచి ధనికుడిగా మారినప్పుడు, రవిని దత్తతకు తీసుకొని తండ్రిగా మారినప్పుడు ఇలా విభిన్న సందర్భాల్లో ఆ సన్నివేశాలకు అవసరమైన స్థాయిలో నటన కనబర్చారు.

బాలల కేంద్రంలో పనిచేసే రాజును విజయలక్ష్మి అతడి ఆస్తి, అంతస్తులను గురించి ఏ మాత్రం ఆలోచించకుండా అతడిని వివాహం చేసుకోవాలనుకుంటుంది. కాని ఆమె అక్క స్వరాజ్యలక్ష్మి అతడికి ఎటువంటి ఆస్తి, అంతస్థులు హోదా లేవనే కారణంగా వారి ప్రేమను తిరస్కరిస్తుంది. కాని రాజు గుర్రపు పందాలలో గెలిచి ధనవంతుడిగా మారగానే విజయలక్ష్మి – రాజుల ప్రేమను అంగీకరిస్తుంది. నాటి నుంచి నేటి దాకా కూడా మనుషుల స్వభావాల్లో దాగిన సర్వకాలీన, సార్వజనీనమైన విషయం ఏమిటంటే మనిషిని గుర్తించడానికి మనిషి వ్యక్తిత్వానికన్నా అతడి ఆస్తి,అంతస్థులకే మనుషులు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు అనే అంశాన్ని సన్నివేశం రూపంలో అభివ్యక్తి చేశారు. రాజు ధనవంతుడిగా మారినా మళ్ళీ బాలల కేంద్రంలోనే పనిచేయడానికి సిద్ధపడడం ఆ సన్నివేశంలో డాక్టర్ మాధవి– రాజుల మధ్య జరిగే సంభాషణలు, సన్నివేశ చిత్రణ అద్భుతంగా వుంటుంది. పేదవాడైన రాజు ధనవంతుడిగా మారి మూగవాడైన రవిని దత్తత తీసుకుని మూడు లక్షలు అతడి పేరుపై రాసినప్పుడు ఆ విషయం న్యూస్ పేపర్‌లో చూసి రవి ఆస్తిపై ఆశతో, అతడి ఆస్తిని కాజేయాలన్న స్వార్థంతో అతడికి తల్లిదండ్రులు తామే అంటూ పలువురు ముందుకు వచ్చే సన్నివేశం, డబ్బు కోసం మనుషులు ఎలాంటి స్థితికైనా దిగజారతారు అనే లోకం తీరు అవగతం అవుతుంది.

ఇక రాజు, విజయలక్ష్మిని వివాహం చేసుకున్న తర్వాత వారికి సంతానం కలిగితే ఎక్కడ తాను దత్తత తీసుకున్న రవిపై ఆమెకు ప్రేమ తగ్గిపోతుందోనని ముందు, ముందుగానే ఆమె వ్యక్తిత్వం పట్ల అనుమానంగా వుండడం, అదేవిధంగా విజయలక్ష్మి రాజు– మాధవిల సంబంధాన్ని తప్పుగా ఊహించుకోవడం, వారిమధ్య ఒకానొక సన్నివేశంలో జరిగిన సంభాషణను ఆధారంగా చేసుకుని ఆమె వారిని అపార్థం చేసుకోవడం మరియు రాజు వ్యక్తిత్వంపై నమ్మకం లేకుండా పనికిమాలిన ఊహాగానాలతో చెడుగా ఆలోచించి వారి బంధానికే ప్రమాదం తెచ్చుకోవడం వంటి దృగ్విషయాలు సాధారణ మనిషి నిత్యం ఎలాంటి తప్పులు చేస్తుంటాడు అని సమీక్షించుకునేలా వుంటాయి. రాజు తనను వివాహం చేసుకోలేదు అనే కారణంతో పగను పెంచుకున్న పనిమనిషి అతడి దాంపత్య జీవితాన్ని నాశనం చెయ్యడానికి విజయలక్ష్మి, స్వరాజ్యలక్ష్మిలకు రాజు – మాధవిల మధ్య సంబంధాన్ని గురించి కుటిల పూరిత మాటలు నూరిపోస్తుంది. ఇలాంటి సందర్భాలు తరచుగా ప్రతి సాధారణ మనిషి జీవితంలో ఉత్పన్నమవుతూ వుంటాయి కాని ఒక మనిషి కుటిల పూరిత వ్యక్తిత్వం ఇతరుల జీవితాలను ఏ రీతిలో సంక్షోభ పరిస్థితులలోకి నెట్టివేస్తుందో పనిమనిషి పాత్ర ఋజువు చేస్తుంది.

చిత్రంలో హాస్యానికి తక్కువ ప్రాధాన్యతను ఇచ్చారు. బాలల కేంద్రంలో రాజుకు, పిల్లలకు మధ్య వచ్చే సన్నివేశాలు మరియు రాజు– విజయలక్ష్మిల మధ్య పరిచయం ఏర్పడే సన్నివేశాలు, వారిద్దరి మధ్య ప్రేమకు దారితీసే సన్నివేశాలు మాత్రం కొంతమేర హాస్య పూరితంగా వుంటాయి. మిగిలిన కథంతా కూడా గాఢమైన భావోద్వేగాలతో కొనసాగుతుంది. కాని కథ యొక్క కథన విధానాన్ని ప్రేక్షకుడు ముందుగానే అంచనా వేయడానికి అవకాశం ఎక్కువగా వుంటుంది. మాధవి పాత్ర మరణిస్తుంది అనే అనుమానానికి సంకేతంగా కూడా ఒక సన్నివేశం వుంటుంది. పతాక సన్నివేశానికి కొన్ని సన్నివేశాలకు ముందు వాసుదేవరావు– మాధవిల మధ్య సంభాషణలో రవికి సంబంధించి మనిద్దరి మధ్య వున్న రహస్యం

మనిద్దరికి కాకుండా మూడవ వ్యక్తికి తెలిసిన మరుక్షణం తాను ప్రాణాలతో వుండను అని చెప్పడం. కాని అంతకు మునుపే పలుసార్లు వాసుదేవరావు మాధవితో రహస్యాన్ని ఎన్నాళ్ళు దాచుంచగలం ఏదో ఒకరోజు బయటపడక తప్పదు. రహస్యాన్ని దాచి అపరాధ భావంతో వుండడం కంటే నిజాన్ని రాజ్యంతో చెప్పడమే సబబు అని చెప్తూ వుండడం. ఆ సందర్భాల్లోనే మాధవి ప్రమాణాన్ని వాసుదేవరావు అతిక్రమించక తప్పదు కాబట్టి కథను దర్శకుడు విషాదాంతంగా ముగించబోతున్నాడు అనే విషయం అవగతమవుతుంది.

ముఖ్యంగా చిత్ర పతాక సన్నివేశాన్ని గురించి విశేషంగా చర్చించాలి. కారణం డాక్టర్ మాధవి పాత్ర మరణించడంతో చిత్రం యొక్క ముగింపు సన్నివేశం పూర్తి విషాదంగా మారుతుది. కాని ఆ సందర్భంలో విశ్వనాథ్‌గారు ప్రేక్షకుడిని ఆ మూడ్ నుంచి మరల్చడానికి చేసిన కసరత్తు అద్భుతం. ఏ తల్లికైనా తన సంతానం మరణవార్త వినడానికి మించిన విషాదకర క్షణాలు వుండవు. అలాంటిది ఆ సందర్భమే ఎదురైతే ఆ తల్లిది బతికుండగానే ఊపిరి వదిలేసినంతటి పరిస్థితి. మాధవి పాత్ర కూడా తన కుమారుడు రవి గురించి ఎలాంటి విషయం (మరణ వార్త) వినకూడదు అనుకుంటుందో అలాంటి విషయాన్ని వినే పరిస్థితి రాబోతుందనే భయంతో మరణిస్తుంది. అప్పుడు వాసుదేవరావు మాధవిని చూసి దుఃఖిస్తున్న సమయంలో అతడి భార్య స్వరాజ్యలక్ష్మి వాసుదేవరావు చేతివేలికి వున్న ఉంగరాన్ని తీసి అతడి చేత మాధవి వేలికి ధరింపజేస్తుంది, దాంతోపాటు స్వరాజ్యలక్ష్మి నుదుటికి ఉన్న తిలకాన్ని తీసి మాధవి నుదుటన రుద్దుతుంది. ఆ సన్నివేశం ద్వారా మాధవి సౌభాగ్యవతిగా మరణించిందనే విషయాన్ని వ్యక్తం చేస్తూ స్వాంతనపూరిత ముగింపును ప్రేక్షకుడు అనుభూతి చెందేలా చేస్తాడు. మన సమాజంలో ఏ స్త్రీకి అయినా సౌభాగ్యవతిగా మరణించడానికి మించిన అదృష్టం వుండదు అనే భావనకు అనుగుణంగా ఆ సన్నివేశాన్ని తీర్చిదిద్దారు. ఈ ఒక్క సన్నివేశం చాలు కె.విశ్వనాథ్ గారి దర్శకత్వ పటిమ ఎలాంటిదో చెప్పడానికి. ఈ సన్నివేశాన్ని చూసినప్పుడు ఏ ప్రేక్షకుడు అయినా కచ్చితంగా విషాదం నుండి ఉపశమనం చెందాల్సిందే.

ఈ చిత్రానికి సంగీతాన్ని కె.వి.మహదేవన్ గారు అందించారు. చిత్రంలోని పాటలన్నీ కూడా వినసొంపుగా వుంటాయి. కె.వి.మహ దేవన్ గారి సంగీతం గురించి ప్రత్యేకంగా మాట్లాడాల్సిన అవసరం లేదని చెప్పొచ్చు. పాటలకు సాహిత్యాన్ని సినారె, దేవులపల్లి వంటి మహానుభావులు అందించారు. ఈ చిత్రానికి సంభాషణలు డి.వి. నరసరాజు గారు అందించారు. చలన చిత్రాలు అనేవి ప్రధానంగా దృశ్యమాధ్యమాలే అయినప్పటికీ ఏ సన్నివేశాన్ని అయినా ప్రేక్షకుడి మనసులోకి బలంగా నాటుకుపోయేలా చేయడానికి, ఆలోచింప




జేయడానికి సంభాషణలు ప్రధాన భూమిక పోషిస్తాయి. ఈ విషయంలో డి.వి.నరసరాజు గారి సంభాషణలు చిత్రానికి బలంగా నిలిచాయి.

మనుషుల జీవితాల్లో ఎన్ని పొరపొచ్చాలున్నా, ఎన్ని రహస్యాలు దాచే పరిస్థితులు ఎదురైనా కన్నతల్లి మనసు మాత్రం తన సంతానాన్ని ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమిస్తుందనే విషయాన్ని దృశ్యరూపకంగా కళాతపస్వి కె.విశ్వనాథ్ గారు "అమ్మ మనసు" చిత్రం ద్వారా అభివ్యక్తి చేశారు.

**చిత్రం : "అమ్మ మనసు"**
**సంవత్సరం : 1974**
**తారాగణం : చలం, కైకాల సత్యనారాయణ, జయంతి, భారతి, శుభ మొదలైనవారు**
**నిర్మాత : జీవీఎస్ రాజు**
**దర్శకత్వం : కె.విశ్వనాథ్**


# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం 'కదంబం'.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## సాధన పంచకమ్

**వేదో నిత్య మధీయతాం తదుదితం కర్మ స్వనుష్ఠీయతాం**
**తేనే శస్య విధీయతా మపచితిః కామ్యే మతిస్త్యజ్యతామ్**
**పాపౌఘః పరిధూయతాం భవసుఖే దోషోऽను సంధీయతాం**
**ఆత్మేచ్ఛా వ్యవసీయతాం నిజగృహాత్తూర్ణం వినిర్గమ్యతామ్**

**5. పాపౌఘ: పరిధూయతామ్ –**

పాపసముదాయాన్ని మనస్సునుండి తొలగించి దూరంగా విసరికొట్టవలెను.

ఆగామి, సంచిత, ప్రారబ్దములు అని కర్మలు మూడు విధములు. నేడు మనిషి అనుభవిస్తున్న దు:ఖాలకు కారణం ఈనాటి పాపఫలమే కాదు. గతంలో చేసిన పాపాలు కూడా తోడుగా ఉన్నాయని మరువవద్దు. గతలంలో చేసి కూడబెట్టిన సంచిత కర్మల ఫలములే ఈనాడు అనుభవానికి వస్తున్న కర్మలుగా మారి రాబోయెడు జన్మలకు కారణమవుతుంటాయి. ఈవిధంగా పాప సముదాయం పెచ్చు పెరిగిపోతూ వుంటుంది. పరిమిత జ్ఞానం గల మనిషి అనుభవానికి వచ్చిన కార్యాలను దర్శించగలడే కాని, అన్ని సందర్భాలలోగల కారణాలను అన్ని సమయాలలో ఊహించలేడు. ఏది? ఎలా? ఎప్పుడు?ఎందుకు? ఎట్లు? జరుగుతుందో సర్వజ్ఞుడైన భగవంతుడికే తెలియును.


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**


**నీవనుకొన్నదంతయును నిక్కముగా నెరవేరుతోడనే**
**నీవనుకోనిదేదియును నేనొనరింపగజాల దైవమా?**
**నీవె సమస్తమంచు మదినిండుగ నమ్మితినయ్య సర్వదా**
**కావగ నీవె దిక్కు త్వరగన్ కరుణింపుము చంద్రశేఖరా!**

సాధారణంగా పాపం మూడు స్థాయిలలో జరుగుతూ ఉంటుంది. 1. దేహము 2. ఇంద్రియాలు 3. మనస్సు. అయితే ఇంద్రియాలతో చేసినంత పాపం దేహంతో చేయలేడు మనిషి. అట్లే మనస్సుతో చేసినంతటి పాపం ఇంద్రియాలతో చేయలేడు. కర్మలోకి దిగితేనే దేహం పాపం చేయగలదు. ఎందుకంటే **'ఇంద్రియాణి పరాణ్యాహు: ఇంద్రియేభ్య పరం మన:'** (3–43) స్థూలశరీరము కంటే ఇంద్రియములు బలీయములు. ఇంద్రియముల కంటే మనస్సు సూక్ష్మమైనది. బలమైనది అని గీతా వచనము. కనుక ఇంద్రియాలు చాలా ప్రమాదకరమైనవి. **'ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మన:'** (2–60) – ఇంద్రియాలు ప్రమథన శీలములు. మనస్సును తమ విషయాల వైపు బలవంతంగా లాగుకొనిపోవుచుండును. అంతేకాదు–

**"అథ కేన ప్రయుక్తోऽయం పాపం చరతి పూరుష:**
**అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజిత:"** (గీత 3/36)

అని మానవుల మేలుకోరి అర్జునుడు అడిగిన ప్రశ్న. తనకు ఇష్టము లేకున్నను ఇతరులు బలవంత పెట్టినట్లుగా దేని ప్రభావము చేత ప్రేరేపింపబడి మానవుడు పాపములను చేయుచుండును?

గతంలో చేసిన పాపములే వాసనారూపంలో మనస్సులో ఉంటూ నూతనమైన పాపాచరణకు మనిషిని ప్రేరేపిస్తూ ఉంటాయి. అందువల్లనే ప్రారబ్ధవశాత్తుగా దుర్భరమైన దు:ఖాన్ని అనుభవిస్తున్నప్పటికీ తాను చేసే దుష్ట కార్యాలను మాత్రం విడువకుండా ఉంటాడు మనిషి. కావున సదా, సర్వదా మనస్సును జాగ్రత్తగా గమనిస్తూ పాపభూయిష్టమైన ఆలోచనలను విచారణ ద్వారా నివారించడానికి ప్రయత్నించాలి.

# మల్యాల వంశ శాసనాలు - చారిత్రక విశ్లేషణ

**డా. పాత అశోక్,** తెలుగు అధ్యాపకులు, కరీంనగర్. ఫోన్ : 9703042628

చరిత్ర నిర్మాణానికి శాసనాలు అత్యంత ఆవశ్యకమైన ఆధారాలు. అశోకుని శాసనాల లిపిని జేమ్స్ ప్రిన్సెప్ 1830 ప్రాంతంలో కనుగొన్న తర్వాత మాత్రమే భారతదేశ చరిత్రకు ఒక నిర్దిష్టమైన కాల నిర్ణయం చేయడం జరిగింది. అంతకుముందు పురాణాల ఆధారంగా చరిత్రను, రాజ వంశాలను క్రోడీకరించడం జరిగి సరియైన కాల నిర్ణయ విషయంలో గందరగోళం ఏర్పడినది. అశోకుని శాసనాలు అధ్యయనం ప్రారంభం అయిన తర్వాత లిపి పరిణామం, భాషా పరిణామం, పరిణామ అధ్యయనానికి స్పష్టమైన రూపం ఏర్పడినది. తెలుగునాట తొలితరం పరిశోధకులు ముఖ్యంగా తెలంగాణలో కొమర్రాజు వేంకట లక్ష్మణరావు, దూపాటి వెంకటరమణ కవులు, పుట్టపర్తి శ్రీనివాసా చార్యులు, బి.ఎన్. శాస్త్రి గారు, పి.వి. పరబ్రహ్మశాస్త్రి గారు, కీ.శే. సంగనభట్ల నరహరి, ఈమని శివనాగిరెడ్డి, కుర్రా జితేంద్రబాబు, దామరాజు సూర్యకుమార్‌ల పరంపరల కృషి పలితంగా తెలంగాణ నుండి అనేక కొత్త శాసనాలను వెలుగు చూడటం జరిగింది. ముఖ్యంగా తెలంగాణ చరిత్ర నిర్మాణానికి 20 వ శతాబ్ది ఆరంభంలో మానవల్లి రామకృష్ణ కవి, దూపాటి వెంకటరమణాచార్యులు, పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు విశేషంగా కృషి చేయగా 1965 ప్రాంతం నుంచి బి.ఎన్. శాస్త్రి గారు వారి వద్ద శిక్షణ పొందిన డా. ఈమని శివనాగి రెడ్డి, కుర్రా జితేంద్ర బాబు, సూర్యకుమార్ 1990 తర్వాత అనేక కొత్త శాసనాలను వెలుగులోకి తెచ్చారు. శాసన పరిశోధనను ఆధునిక కాలంలో చాలామంది విద్యార్థులు ఆసక్తితో అధ్యయనం చేయడం జరుగుతున్నది. ముఖ్యంగా అలంపూర్ (మహబూబ్ నగర్ జిల్లా) శాసనాలను ఆ గ్రామ వాస్తవ్యులైన గడియారం రామకృష్ణ శర్మ గారు అధ్యయనం చేయటమే కాకుండా 'లక్ష్మణరావు పరిశోధక మండలి' తరుపున ప్రచురించబడిన తెలంగాణ శాసనాలు సంపుటం I లో అవి ప్రచురించబడినవి. ఈ సంపుటానికి మద్రాసు హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేసిన గొప్ప ఖగోళ పరిశోధకుడు, వేపా రామేశం పంతులు గారు ముందుమాట రాసినారు. దీని ప్రచురణ ప్రధాన సహాయం చేసిన వారు మునగాల సంస్థానధీశులు, శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం, హైదరాబాద్, రాజరాజనరేంద్ర భాషా నిలయం హన్మకొండలో వ్యవస్థాపకులు నాయని వేంకటరంగారావు, వారి వద్ద దివానుగా పని చేసిన కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు ప్రఖ్యాత చరిత్ర పరిశోధకులే కాక, ప్రథమ తెలుగు విజ్ఞాన సర్వస్వాల రూప శిల్పి హిందు మహాయుగం, మహ్మదీయ మహాయుగం లాంటి అనేక గ్రంథాల రచయిత మాత్రమే కాక రావిచెట్టు రంగారావు, అయ్యదేవర కాళేశ్వర రావు, ఆచంట లక్ష్మీపతి, నాయిని వేంకట రంగారావులతో కలిసి విజ్ఞానచంద్రికా గ్రంథమండలిని స్థాపించి తెలంగాణ ప్రాంత ప్రజలను చైతన్యం చేయడానికి అనేక శాస్త్ర, సాంకేతిక, చరిత్ర గ్రంథాలను ప్రజలకు అందించిన మహనీయుడు రావిచెట్టు రంగారావు. నాయిని వేంకట రంగారావు, కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు తెలంగాణాలో గ్రంథాలయోద్యమానికి ఆద్యులుగా పేర్కొనవచ్చు. ఈ తెలంగాణా శాసన సంపుటిని ప్రచురించడానికి ప్రధాన కారణం 12 నవంబర్ 1921 న 'ఆంధ్ర జనసంఘం' అనే సంస్థను తెలంగాణలోని ఆనాటి ప్రముఖులు ఏర్పాటు చేసి తెలంగాణ ప్రాంతపు చారిత్రక సాధనాలను కూడా సేకరించాలని 27 డిసెంబర్ 1922 న నిర్ణయం తీసుకొన్నారు. ఈ సేకరణకు కొమర్రాజు వేంకట లక్ష్మణరావు గారిని సభ్యులుగా సలహాలు, సూచనలు ఇవ్వమని కోరినారు. వారు 1923లో ఆకస్మికంగా మరణించడంతో తెలంగాణ ప్రాంతానికి ఉద్యోగపరంగా విచ్చేసిన శ్రీ శేషాద్రిరమణకవులను తెలంగాణ శాసన ప్రతిబింబాలు, తాళపత్ర గ్రంథాలు, నాణాలు సేకరించమని కోరగా వారు ఆంధ్ర జనసంఘం పక్షాన సేకరించిన 123 శాసనాలు మొదటి సంపుటంగా ప్రచురించినారు. వాటిలో 82 శాసనాలకు దూపాటి వెంకటరమణ చార్యులు, 40 శాసనాలకు మారేమండ రామారావులు టిప్పణిని (footnotes) సమకూర్చినారు. ఈ శాసన సంపుటిలోని మహబూబ్ నగర్ జిల్లా బూదపూరు నందలి 36వ శాసనంను తీసుకొని ముఖ్యంగా మల్యాల గుండయ్య భార్య కుప్పాంబికా వేయించిన శాసనంను విశ్లేషించదలచుకున్నాను.

బూదపూరు శాసనము

1 స్వస్తి సమధిగతపంచ మహామండలేశ్వ రానుమకొండ పురాధీశ్వర కాకతీయ రుద్ర దేవమహారాజులు ఒరుంగంటను పృథివి రాజ్యంబు

2 సేయుచుండంగా దత్ప్రసాదాసాదిత రాజ్యలక్ష్మీనివాసుండయిన శ్రీ మల్యాల గుండ దండాధీశ్వరునిదమ్మఃపత్ని కుప్పమాంబిక తన పతి పరలోకానికింజని తేని

3 బూదుపురను గుడికట్టించి శతవషంఃబులు 1198 వర్తింపం గాను ధాతృసంవ

త్సర మాఘ శుద్ధ 10 గు ౧౦ గుండయ పేరను లింగ ప్రతిష్ట సేసి ఆ కాలమునందు

4 ఆకుప్పసానంమంగారు తన కొడుకులు బాచయబొప్పండు

గణపతి దేవందు పర్వ్వ తము మల్లయ తమ్ముందు మల్లయ, బుద్ధయ విఠ్ఠయ కాటయ కొడుకు

5. గుండయ వీరుసహితమయి ఆ గుండేశ్వర దేవరకు ధారాపూర్వ్వకమయినవృత్తి నీరు నేల బాస్సముద్రాన మ 2 కుప్ప సముద్రాన మ 1 గణ సముద్రాన మ ? బుధుని కుంటను

6. మ ? వెరసి మ 5 వెలివొలము బూదుపూరను మ 12 పోతులమదుగున మ ౯

వెరసి మ 21 ఇంతవట్టు ఆ చంద్రార్క్కస్థాయిగనిచ్చి

చిలజియ్యలకొదుకు సిద్ధ జియ్యలాను

7. బాచజియ్యల కొదుకువై జిజియ్యలాను ఈ స్థానాలకు ఒడయులై బిడ్డతరము ప్రసాదోప

జీవులై ఉందుందని పంచి తద్ధర్మ్మసంరక్షణార్థంబయి పద క్రమయుత యజుర్వ్వేద పారగ

8 శబ్దవిద్యావిశారద కవీశ్వరుడయిన ఈశ్వరబట్టోపాధ్యాయులను శాసనంబు సెప్పం బంచినం దత్ప్రారంభంబెట్టిదనిన శ్రీవరాహ రహస్సత్వం శ్రీవరాహజగత్ప్రభో

ఈ శాసనాన్ని కాకతీయ రాజులకు సామంతులుగా ఉన్న మల్యాల గుండయ భార్య కుప్పమాంబిక భర్త మరణించిన సందర్భంలో అతని పుణ్యంగా అక్కడ దేవాలయ ప్రతిష్ట చేయించిన సందర్భంలో వేసినది. మల్యాల గుండా చెమూపతి కాకతీయ గణపతిదేవ చక్రవర్తికి సామంతుడుగా, దండనాయకుడుగా ఉన్నాడు. రంగనాథ రామాయణం రచించిన గోన బుద్ధారెడ్డి కుమార్తె కుప్పాంబిక (కుప్పమాంబిక)ను మల్యాల గుండయ వివాహం చేసుకున్నాడు. ఈమెయే ఈ శాసన కర్త. ఈమెకు బాచయ బొప్పదు, గణపతిదేవుదు, పర్వత మల్లయ అనే కుమారులు ఉన్నారు.

ఈ గోనబుద్ధారెడ్డి కాకతీయ సామంతులుగా మహబూబునగర్ జిల్లాలోని వర్ధమానపురము ప్రాంతానికి పాలకుడుగా ఉన్నాడు. ఈ వర్ధమానపురము నేటి నంది వద్దమాను (నాగర్ కర్నూలుకు, పాలెం లకు దగ్గరగా ఉంది). అతడు తన కుమార్తెను ఇచ్చి వర్ధమానపురము రాజ్యాన్ని కూడా మల్యాల గుండయకు అప్పజెప్పినాడు.

మల్యాల గుండయ దండాధీశుడు క్రీ.శ. 1245లో వర్ధమాన పురములో వేసిన శాసనములో "దన్న సేనాని మల్యాల వంశ తిలకః కలికాల కర్ణో దన్నా హ్యయస్సమభవద్భువనైకవీరః" అని తన గురించి చెప్పుకున్నాడు. క్రీ.శ. 1259లో బూదపురంలో వేసిన మరొక శాసనంలో మల్యాల వంశ పూర్వీకుల మూలపురుషుల గురించి "అస్తి స్వస్తి మదులాగి మల్యాల కుల మూర్జితం అగణిత రిపున్నపనికరో వితరణ గుణచణ గణే గణ్యః దన్యోదన్నయ నామ సమజని నయ వినయ మయతను స్తస్మిన్" అనగా గొప్పదైన మల్యాల కులము కలదు అందులో అనేక శత్రు సమూహాము కలవాడు, దానగుణ ప్రవీణుడైన వారి సమూహామున అగ్రగణ్యుడు, నయవినయ శీలుడు, ధన్యుడు అగు దన్నయ జన్మించాడు అని భావము. ఈ దన్నయ మల్యాల వంశపు మూలపురుషుడు. అతను కాకతీయ రాజులకు అత్యంత ఆప్తవర్గములోనివాడు. ఇతని ప్రశంస మల్యాల వంశీయులు వేసిన అన్ని శాసనాలలో ఉంది. కటుకూరు శాసనంలో ఇతని గూర్చి

"శిర: పురారేరివ చంద్రలేఖయా దివాకరస్యేవ రుచా దివస్థలం య యోన్నతం దన్నయ మంత్రిణ: కులం మనోజ్ఞ యా భూరి విభూషయిష్యతే చమూపతే ర్దన్నయ నామధేయో"

నెలవంకచే శంకరుని శిరస్సు వెలిగినట్లు, సూర్యుని కాంతిచే ఆకాశం వెలిగినట్లు, మనోహరమైన ఈ మైలమ చేత ఉన్నతమైన దన్నయ మంత్రి కులము విభూషింపనున్నది అని భావము.

ఇతని వంశము దుర్జయ వంశము అని, చౌండ సేనాని కొండపర్తిలో వేసిన శాసనంలో పేర్కొనారు. ఈ దండ సేనాని యుద్ధవీరుడు. కాకతీయులకు అత్యంత ఆప్తుడైన సామంతుడు, అతివీర భయంకరుడు, ఖడ్గవిద్యా విశారదుడుగా ప్రఖ్యాతి చెందటం వల్ల తెలంగాణలో అనేక గ్రామాలు 'మల్యాల' పేరున వెలసినాయి. అందువల్లనే కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్ దగ్గర ఒక మల్యాల, జగిత్యాల జిల్లాలో ఒక మల్యాల, నాగుల మల్యాల, ఖమ్మం, వరంగల్, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లో కూడా మల్యాల పేరున అనేక గ్రామాలున్నాయి. ఈ దన్నయకు సబ్బసేనాని, బాచవరూధినీశుడు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. బాచవరూధినీశునికి 'బెడముట్టుగండ' అనే బిరుదు కూడా ఉంది. ఇతని భార్య బాచాంబ. వారి కుమారుడే మల్యాల గుండాధీశుడు. ఇతని గూర్చి

తస్మాద భూత్ప్ర భూతారి గర్వ్వ దర్వీకరౌజనః! గారుత్మక మీవాం బోధేరత్నం బాచ చమూపతిః! మారస్యేవ రతిస్తస్య జాయా బాచాంబికాయధా శృంగార రస..

క్రీ.శ. 1259లో బూదపురంలో వేసిన శాసనంలో దండ సేనానికి కుమారుడుగా జన్మించిన బాచసేనాని శత్రువుల గర్వముచే సర్వము అణిచే గరుత్మంతుడు వంటివాడు. మల్యాల వంశాబుధిలో జన్మించిన రత్నంలాంటి వాడు. మన్మథునికి రతీదేవి వలే బాచసేనానికి బాచాంబిక భార్య అయ్యెను. బ్రహ్మదేవుడు ఈమెను శృంగార రసము చేత నిర్మించాడా? అనే విధంగా అతిలోక సౌందర్యవతిగా వెలుగొందినది అని వర్ణించబడినది. బూదపురం నందలి క్రీ.శ.1272లో వేసిన మరొక శాసనంలో "తస్మాద భూదతుల భవిత పుణ్యమూర్త్తి శ్రీ బాచ సైనిక పతిః ప్రథిత ప్రభావః ఉద్దామరాత గరుడధ్వజ వీరలక్ష్మీ లక్ష్మక్షమాతల సురక్ష బాచసేనాని నిత్యదక్షః" అని వర్ణించినాడు. బాచవరూధినీశుడు దన్నసేనాని కుమారుడు. ఇతనికి "పెద ముత్తుగండ" అను బిరుదు ఉన్నది. బాచసేనాని ధర్మపత్ని బాచాంబ. ఈ దంపతుల కుమారుడు గుండగండాధీశుడు. గణపతిదేవ చక్రవర్తిచే వర్ధమానపుర ప్రాంతపాలకుడుగా

నియమించబడినాడు. ఈ మల్యాల గుండయ తాను వేయించిన వర్ధమానపుర శాసనంలో తనను గురించి

'తత్పాద ప్రసాదాన రాజ్యలక్ష్మి నివాసుండును, వినుత విలాసుండును, సంకీస పురాధినాథ, తిమిర మార్తాండుండును, బెడ ముట్టు గండండును, వీర వితరణ గుణగణాలంకారుడును, సుచరిత వ్రతాచారుండును, బాచాంబికోదర క్షీరపారావార సంజాత హరిచందనుండును, బాచవరూధినీశ వర నందనుండును నసి, ముసల, కణయ, కంపణ ముద్గర, తోమర, ముషిండి భిండివాల, చక్ర, క్రకచ,నారాచ, కార్ముకాద్య నేకాయుధ ప్రవీణుండును, ననవరత పరమ కల్యాణుండును, దుష్టతురగరేఖారేవంతుండును, వారనారీయౌవన వసంతుండును, వీణా, వేణు, తాళ, కాహళ, తుణవ, పణవ, పటహ, మృదంగాద్యనేక విద్యా కుశలుండును, వివిధ కీర్తి విశాలుండును, గుప్పాంబా మానస సరోవర విహార మాణ రాజహంసుండును, నిజకులోత్తముండును, సముత్పాదిత దీనానాథ చిత్త వికాసుండును, నిర్మ్మల నిఖిల రమ్మ్యావాసుండును, శ్రీ విశ్వనాథ దేవ దివ్య శ్రీ పాద పద్మారాధకుండును, రిపుకుల భేదకుండును నైన శ్రీ మన్మల్యాల గుండ దండాధీశ్వరుండు మంత్రి పురోహిత సేనాపతి దౌవారిక మహా ప్రధానానంత సామంత సుభట, విట, విదూషక, పాఠక, పీఠమర్ధ్ద, నట, నర్తక, రసిక రంజక, కవి, గమికి, వాది, వాగ్మి, వంది, వైతాళిక, హావక, భావక, గాయకాద్యనేక విద్వజ్జనంబులు గొలువ సుఖోపవిష్టుండై ఇష్ట కథా వినోదంబుల నుండి ఆనియు…" అని పేర్కొన్నాడు.

ప్రస్తుత శాసనం మల్యాల గుండాధీశుని ధర్మపత్ని, గోన వంశస్థురాలైన కుప్పాంబిక, సుప్రసిద్ధ కాకతీయ సేనాని, గోన గన్నారెడ్డి సోదరి మరియు గోన బుద్ధారెడ్డి కుమార్తె. ఈ శాసనాన్ని క్రీ.శ. 1276లో వేయించినది. ఆ నాటికే తన భర్త గుండయ కాలం చేసినందున భర్త పేరున 'గుండేశ్వరాలయం' నిర్మించి ఆ ఆలయపూజల కొరకు భూమినిదానము చేయు సందర్భంలో వేయించిన శాసనం. ఈ శాసన కాలంలో కాకతీయ రాజ్యాన్ని రుద్రమదేవి ఓరుగల్లు పట్టణాన్ని రాజధానిగా చేసుకొని పరిపాలిస్తున్న కాలంగా పేర్కొనబడింది. ఈ శాసనమున శకసంవత్సరం 1198 ధాత్రి సంవత్సరం మాఘశుద్ధ దశమి గురువారము రోజున గుండయ పేరున లింగ ప్రతిష్ఠ చేసి కుప్పసానమ్మ తన కుమారులు బాచయ బొప్పదు, గణపతి దేవడు, పర్వతమల్లయ, తన తమ్ముడు గోన బుద్ధయ, వితయ కొడుకు గుండయ సహితంగా గుండేశ్వర దేవరకు దానపూర్వకంగా వృత్తులు, నీరునేల ఇచ్చిన సందర్భంలో వేయించిన శాసనం.

ఈ శాసనంలో బాస సముద్రాన రెండు మర్తులు, బొప్ప సముద్రాన ఒక మర్తు గణప సముద్రాన అర మర్తు, బుధుని కుంట యందు ఒకటిన్నర మర్తు మొత్తం ఐదు మర్తులు, బూదపురంన పన్నెండు మర్తులు, పోతుల మడుగున తొమ్మిది మర్తులు మొత్తం ఇరవై ఒకటి మర్తులు, ఆ చంద్రార్కముగా అనుభవిస్తూ చీల జియ్యల కొడుకు వైజ జీయలాను, ఈ స్థానాలకు ఒడయులై తరతరాలుగా ప్రసాదోపజీవులై ఉండండని ధర్మ సంరక్షణార్థం ఈ శాసనం వేయించెను. ఈ శాసన రచయిత యజుర్వేద పారాణి, శబ్ద విశారద, కవీశ్వరులు ఈశ్వరభట్టోపాధ్యాయులు, ఈ శాసనంలో కుప్పాంబిక సకల గుణగణాలంకృత పతివ్రత, వ్రతములను ఆచరించిన వనిత, లక్ష్మీనారాయణ, జలశయన, అశూన్యశయ్య, అనంత అరుంధతీయ, ద్వాదశి తదితర వ్రతములు, అనేక వ్రతములు నిర్వహించిన పుణ్యాత్మురాలు. విధూషీమణి నూతులు, పశువులకు నీటికుంటలు, అనేక నీటి వనరులు ఏర్పరిచి శివాలయములను ప్రతిష్టించి, తోటలు వేయించి, చెరువులు తవ్వించి విష్ణు విగ్రహములను ప్రతిష్టించి అనేక సత్కార్యములొనర్చి ప్రజాదరణ పొందిన వనిత.

అనేక పర్యాయములు మంచివారికి, కులీనులకు, దీనాంధ కృపణులకు స్వర్ణము, రథములు, గుర్రములు, అన్నము దానమొనర్చి మల్యాల, గోన వంశముల కీర్తిని వ్యాపింప చేసిన నారీమణి.

గోన, మల్యాల వంశాలు తెలంగాణ చరిత్రలో కాకతీయుల సామంతులుగా కరీంనగర్, మహబూబ్ నగర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల పాలకులుగా చరిత్రలో విశిష్టమైననటువంటి ఖ్యాతి సంపాదించినారు. వీరి శాసనాలు కటుకూరు, కొండిపర్తి, వర్ధమానపురము, బూదపురం మొదలైన ప్రాంతాల్లో లభ్యమైనాయి.

18 ఏప్రిల్ 2016 నుంచి 30 ఏప్రిల్ 2016 వరకు డాక్రి తరుపున శాసనాల అధ్యయన శిక్షణ తరగుతులను నిర్వహించి నాలాంటి అనేకమంది పరిశోధక విద్యార్థులకు శాసనలిపిని సులభంగా బోధించి, అధ్యయన పద్ధతులను నేర్పిన డైరెక్టర్ కుర్రా జితేంద్రబాబు గారికి, సహృదయతో పరిశోధకులందరికి ఆతిథ్యం ఇచ్చిన డా. ఎస్. జైకిషన్ గారికి మా పరిశోధకుల తరుపున మరియు నా తరపున ప్రత్యేక ధన్యవాదాలు.

***ఉపయుక్త గ్రంథ సూచిక***

1. 'తెలంగానా శాసనాలు' సంపుటి I, 1935. కొమర్రాజు వెంకట లక్ష్మణరావు పరిశోధక మండలి.
2. 'వరంగల్లు జిల్లా శాసనాలు' AP Govt. Epigraphical Series No. 3
3. 'మహబూబు నగర్ జిల్లా సర్వస్వం'. బి.ఎన్. శాస్త్రి. పుట: 80–87.

# వెలకట్టలేని ముత్యాలు "నిజాలు - నైజాలు"

డా. రంగి కమల. రీడర్, తెలుగుశాఖ (విశ్రాంత), ఫోన్ : 99898 72723

అల్పాక్షరాల్లో అనంతార్థాన్ని అందించినవారు చంద్రశేఖర కృష్ణ గారు. కలం పేరు కృష్ణశ్రీ. స్వస్థలం ధర్మపురి "నిజాలు - నైజాలు" అనే పుస్తకం ద్వారా లోకం పోకడను అనేక కోణాల్లో చూపించా రాయన. అచ్చమైన బంగారమౌనా! కాదా! అని గీటురాయితో పరిశీలించిన పండితులు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారు. వెలకట్టలేని ముత్యాలంటూ తన అభిప్రాయాన్ని వెలువరించినవారు ఆచార్య వెలుదండ నిత్యానందరావుగారు. ఆణిముత్యాలందించారని అభినందించినవారు వల్లీశ్వర్ గారు. సానబెట్టిన చక్కని రచన అని సదభిప్రాయాన్ని అందించినవారు సంతోష్‌బాబు గారు. ఈ మాటలన్నీ అక్షర సత్యాలే.

తెలుగుపై మక్కువ ఎక్కువ ఉన్న ఈ రచయిత మాతృభాషనిలా కొనియాడారు.

**మాతృభాష కన్న మధురము, సులభమౌ**
**మరొక భాష కలదె మానవులకు?**
**విషయమెట్టిదైన వివరించ వీలౌను**
**బాల్యమందు అమ్మ భాషె మేలు!** అంటారీయన.

అన్ని భాషలు నేర్వాలి, అమ్మ భాషలోనే మాట్లాడాలంటూ..

**"అన్యభాష మనకు అవసరమ్మే గాని**
**అమ్మభాష కన్న అధికమౌనె"** పరభాష వ్యామోహంతో పక్కదారిలో పోతున్నవారిని ప్రశ్నించారిలా.

జీవనదుల వంటి **"సారవంతమైన సాహితీ ఝరులింకె"** నేటికవులు చక్కని భావ ప్రకటన చేయలేక, పరభాష పదాల నద్దెకు తీసుకొనుట చక్కని తెలుగు భాషకు తెలుగుసోకినట్లైందని వాపోయారు. కృష్ణశ్రీగారు వృత్తిరీత్యా ఇంగ్లీషు అధ్యాపకులు, ప్రవృత్తి రీత్యా రచయిత.

జీవితానుభవాలను నిశితంగా పరిశీలించి నిగ్గుదేల్చిన విషయాల నిందులో వివరించాడు. తల్లిదండ్రులపై, భార్యాబిడ్డలపై తనకున్న మమతానురాగాలను మల్లెపూపొట్లం వలె విప్పిచెప్పారు. పంచభూతాలకు లేని కులమతాల కుమ్ములాట మనకెందుకని నిలదీశాడు.

**పుట్ల పంటలిచ్చు భూమాత కులమేది?**
**పూలకేది మతము గాలికేది?**
**నీటిగోత్రమేది? నిమ్నజాతెవరిది?**
**అగ్రవర్ణులెవరు? అధములెవరు?**

పెడదారి పడుతున్న యువతనుద్దేశించి, చక్కని చురకలందించారు కృష్ణశ్రీ గారు.

**అడ్డగోలు తిండ్లు అపరాత్రి తిరుగుళ్ళు**
**అడ్డు అదుపులేని ఆగడాలు**
**చిరుగులున్న జీన్సు, జీను షర్టు ప్యాంట్లు**
**అవని చూడు నేటి యువత తీరు**

యువత మేల్కొనాలి.. దేశ భవిష్యత్తు వారిపైనే ఉన్నదాని నొక్కి వక్కాణించారు. "ముత్తైదువతనం ముద్దు, మగడవద్దు" అని గాజులు, జాజులు పెట్టుకొని భర్తను, బాధ్యతలను లెక్కచేయక తిరుగుతున్న వారిని వదిలిపెట్టలేదు.

పునరపి జననం, పునరపి మరణం అని తెలిసినా మరణవేళ ఎందుకింత తపిస్తున్నాడీ మానవుడు. అస్తమించిన సూర్యుడుదయించడా! పండుటాకు రాలి, చిగురుటాకు పుట్టదా! అనే ఆశాభావాన్నందిస్తున్నంది.

ఇందులోని పద్యములన్నీ ముక్తకాలు. దేనికవే స్వేచ్ఛాగీతాలు. శతకాలను పోలిన ఈ కవితలు నీతినియమాలను వేదాంత ధోరణిని, అనవసరంగా కాలాన్ని వృథా చేయకని హెచ్చరిస్తున్నాయి.

200 కవితలలో జీవితానుభవాలను, సున్నితంగా, సునిశితంగా ఓట్లను, నేటి రాజకీయాలను, మూఢ నమ్మకాలను సుతిమెత్తగా, సూటిగా విమర్శించారు. అంతేకాక ఎండిపోతున్న ఆనాటి గోదావరికి, ఎందరికో ఆప్తుడైన గానగంధర్వుడీలోకానికి వచ్చివెళ్ళిన ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యానికి స్మృత్యంజలి ఘటించారు. సమాజానికి సాహిత్యం అద్దం అన్నమాట అక్షరసత్యంగా గోచరిస్తున్నది "నిజాలు-నైజాలు" పుస్తకంలో.

**నిజాలు - నైజాలు**
**రచన :** కృష్ణశ్రీ
**వెల :** 60/-
**ప్రతులకు :** రచయిత, 16-2-742/ఈ/జి2,
బ్రహ్మనివాస్ అపార్ట్‌మెంట్స్, గడ్డి అన్నారం, హైదరాబాద్.
**ఫోన్ :** 9701928759

కీ.శే. బి.ఎన్.శాస్త్రి

# శాసనములలో తెలుగు భాషా పరిణామము

అముద్రిత సిద్ధాంత గ్రంథం

**బహువచన ప్రత్యయములు**

ఈ కాలపు శాసనములందు బహువచనాంత రూపములు కొన్ని పూజ్యార్థమున వాడబడినది. ఏక వచన రూపములు కొన్ని బహువచనములుగా నున్నవి. బహువచన రూపములుగా నుండవలసిన రూపములు కొన్నిచోట్ల ఏకవచన రూపములుగా కనిపించుచున్నవి.

ఒడయులుంగారు.. S.i.i Vol x, No.743

మొదలైన దుగాలు.,.. S.i.i Vol x, No.747

దీనాంధ కృపణపంగులు.. S.i.i Vol x, No.748

అన్ని దశములు... S.i.i Vol x, No.748

బ్రంహ్మంలు శుభవాసులు... S.i.i Vol x, No.748

యిళ్లు... S.i.i Vol x, No.748

సూర్యోదయం అఇతేను చీంకట్లు... S.i.i Vol x, No.751

యక్కడివాడ్లు... S.i.i Vol x, No.751

హరాంఖోలున్... S.i.i Vol x, No.751

పకీర్ల అన్నవస్త్రాలకు.. S.i.i Vol x, No.751

తురకలు.. S.i.i Vol x, No.753

గుఱ్ఱము బండ్లు... S.i.i Vol x, No.753

చలివెందిరిలు.. S.i.i Vol x, No.753

మొఖాసీలు.. S.i.i Vol x, No.753

బొటిగండ్లు... S.i.i Vol x, No.756

వత్తకులు.. S.i.i Vol x, No.756

కమికాండ్లు... S.i.i Vol x, No.757

గోపాలభట్ల వారికి... S.i.i Vol x, No.757

సంగ్గు శాసనాలు.. S.i.i Vol x, No.757

తిర్తులు.. S.i.i Vol x, No.759

గుంటలు... S.i.i Vol x, No.772

**విభక్తులు – విభక్త్యంగములు**

ఈ కాలపు శాసనములందు విభక్తి ప్రత్యయములు వాడబడినవి. ఉర్దూ, అరబీ పదములు, విభక్తి ప్రత్యయములు చేర్చుట వలన తెలుగు పదముల వలె గన్పట్టుచున్నవి.

ప్రథమా విభక్తి – డు,ము,వు,లు ప్రథమా విభక్తి ప్రత్యయములు. 'ము'కు పూర్వ రూపమగు 'బు' ఈ కాలపు శాసనమున వాడబడినది.

1. ఒడయలుంగారు.. S.i.i Vol x, No.743
2. సోమరాజు కుమారుండు... S.i.i Vol x, No.749
3. ఆలమఖానుండు.. S.i.i Vol x, No.751
4. బ్రంహ్మాలు శుభవాసులు... S.i.i Vol x, No.748
5. సహాయబు... S.i.i Vol x, No.748

**ద్వితీయా విభక్తి: ని,ను**

వూళ్లఉరి కవురురున్ను.. S.i.i Vol x, No.743

పెయ్యలుగలుపకను.. S.i.i Vol x, No.743

యాకంభంగోళ్లు ననుపోతేను... S.i.i Vol x, No.745

కాశీ విశ్వనాథుని... S.i.i Vol x, No.749

తమతోంటలోను.. S.i.i Vol x, No.749

చతుర్థీ విభక్తికి సంబంధించిన పదములీ శాసనములందు తక్కువ. అంద్ధి శతకై అనుది. మాత్రము కనిపించుచున్నది.

**షష్ఠీ విభక్తి**

యిధంమ్మంకు ఎవ్వరుదప్పిరి... S.i.i Vol x, No.743

ఆదికేశవునికి... S.i.i Vol x, No.746

లెఖను యిందుకు ధాన్యం... S.i.i Vol x, No.748

శత సుంఖాలకుం.... S.i.i Vol x, No.745

**సప్తమీ విభక్తి**

చైత్ర శుసోమహమందు.. S.i.i Vol x, No.743

క్రిష్ణ వేణ్యాతీరమంద్దు... S.i.i Vol x, No.745

**సర్వ నామములు**

గోలకొండ నవాబుల కాలపు శాసనములందు ప్రథమ పురుష సర్వనామములు ఎక్కువగా కనిపించును. సర్వ నామములతో గూడిన అసమాన క్రియా వాక్యములు సైతము శాసనములందు కలవు. శాననములందు వాడబడిన నర్వనామములు ఉదాహరింపబడుచున్నవి.

1. ఇవి ఆచంద్రాక్క స్తాయగా... S.i.i Vol x, No.743

2. ఎవ్వరు సాగించిరి వార్కి... S.i.i Vol x, No.743

3.మాకుధారవోడి యస్తిరి.... S.i.i Vol x, No.747

4. ఆచేనంబండిన ధాన్యం... S.i.i Vol x, No.748

5. ఇందుక ఎవరంగనక తప్పినాను... S.i.i Vol x, No.748

6. ఆయన కుమారుండు... S.i.i Vol x, No.748

7. తమతోంటలోను... S.i.i Vol x, No.749

8. వాండ్లు అంద్దరున్ను.... S.i.i Vol x, No.751

9. ఆపరిమి వారున్ను... S.i.i Vol x, No.759

10. శామామహసూలు మీరు... S.i.i Vol x, No.760

11. ఆయనకు చేకూడెను.. S.i.i Vol x, No.763

12. యవరరుని ఖాతం చేశినవారు.. S.i.i Vol x, No.767

13. అందుకు యేల్ని వారికి... S.i.i Vol x, No.769

14. వీరు అందరుంన్ను... S.i.i Vol x, No.770

15. ఇందుకు తురుకలు తప్పితే.. S.i.i Vol x, No.771

16. యిందుకు యవరు.. S.i.i Vol x, No.773

17. అదికట్టించ్చే నిమత్యంమీకు కవులు... S.i.i Vol x, No.775

18. నేను బొల్లవరాన... S.i.i Vol x, No.775

19. మాకు చెల్లిదచ్చే... S.i.i Vol x, No.776

20. యందుకు యెవరు వచచేస్తున్నారో వారికి నరకం...

గోలకొండ సుల్తానుల శాసనములందు సంఖ్యావాచకములు అంకెలలో వ్రాయబడినవి. ఒక్కొక్క చోట అక్షరములలో సూచింపబడినవి. శాసనములలోని సంఖ్యా వాచకములీ క్రింద నుదహరింపబడుచున్నవి.

1. యరువయ ఆరు... S.i.i Vol x, No.743

2. ముప్పయ యెని మదింటి లెఖను... S.i.i Vol x, No.748

3. వకటి... S.i.i Vol x, No.758

4. రెండ్డు... S.i.i Vol x, No.772

5. నాల్లోపాలు.. S.i.i Vol x, No.776

6. నలుగుర్ను... S.i.i Vol x, No.753

7. ముప్పైగుంటలు... S.i.i Vol x, No.758

8. నలుభయి.... S.i.i Vol x, No.755

**విశేషణములు**

ద్రావిడ భాషలోని విశేష్య విశేషణములకు రూప భేదము లేదు. పదములు పౌర్వా పర్యములననుసరించి ఒకటి విశేష్యముగను రెండవది విశేషణముగ వాడబడినది. ఈ కాలపు శాసనములందు బహువచనాంత పదములను విశేషణములగా మార్చుటకు 'అ' ప్రత్యయము చేర్చబడినది.

1. మొదలైన తిరిపెలకు... S.i.i Vol x, No.743

2. యరువయ ఆరుస్తలాల... S.i.i Vol x, No.743

3. తమ గురువుల పేరులను.. S.i.i Vol x, No.745

4. ఆచేనిదశముల పుణ్యం... S.i.i Vol x, No.747

5. గ్రామాల ప్రజలు గౌమ్యాసేరుచుల... S.i.i Vol x, No.748

6. గోవు బ్రంహ్మల వధశేశిన... S.i.i Vol x, No.748

7.హరాం భోలనుదండించి... S.i.i Vol x, No.751

8. మృత్తిజానగరం అగ్రహారాల.... S.i.i Vol x, No.752

9. పట్టించు కొనిమోడిపాలెంగాండ్ల.. S.i.i Vol x, No.753

# మూసీ పదవినోదం - 28

## సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 చె | 3 ర | 5 కు | పా | 6 న | క | 9 ము | లు |
| 2 ర | క | ర | కా | లు | X | లా | 10 కా |
| 4 కు | ము | ద | X | 8 గు | 11 లా | ము | X |
| వి | గ | X | 7 ఆ | పిం | జ | రం | X |
| లు | ట్టు | X | 13 కా | డి | హెూ | X | 19 కా |
| 12 కా | డు | 14 వా | క | X | 17 మం | 18 గ | లం |
| డు | X | 16 కా | ర | ము | X | 20 వి | చే |
| X | 15 బీ | ట | X | 21 మా | పా | ల | యు |

# దోమల భిక్షపతి 'సినారె శతకము' అంతరంగం

**భూక్యా రాజారాం నాయక్,** ఫోన్ : 99492 19961

ప్రముఖ కవి డా. సింగిరెడ్డి నారాయణ రెడ్డి జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత పరిశోధకులు, కవి, సినీ గేయ రచయితగా, సాహిత్యానికి ఒక రూపంగా, నిలువెత్తు సరస్వతీ స్వరూపులుగా బ్రతికినట్టివారు. అట్టి మహాకవి పై ఒక శతకము రావడం సముచితమైనది. వారు ఉస్మానియా విశ్వవిద్యాలయానికే వన్నె తెచ్చిన మహానుభావులు. వరంగల్ జిల్లా వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైన రచయిత దోమల భిక్షపతి సినారె గారి పై ప్రత్యేకమైన అభిమానంతో "సినారె శతకం"ను రచించారు.

ఈ "సినారె" శతకం నూట ఆరు తేటగీతి పద్యాలతో సాగినది. ఇది "సిరుల నొలికేడి నవ్వుల శ్రీ సినారె" అనే మకుటంలో రాయబడింది. సినారె గారి కవితా వ్యాసంగాలు – సినీగేయాలు – పరిశోధనలు, వారి పరిచయాలతో సినారె గారి మీద మెండైన అభిమానం ఏర్పడి ఈ శతకంగా రూపు దిద్దుకొన్నదని కృతికర్త దోమల భిక్షపతి తెలిపారు.

ఈ శతకంలో ప్రధానంగా మూడు కోణాలున్నాయి.

1. సినారె గారి వ్యక్తిత్వ రూపవర్ణన, కవితా విశేషాలు.
2. సమాజంలో కవి యొక్క విశిష్టత గురించి వర్ణించబడింది.
3. లోకంలోని ధర్మాలు, నీతులు – ఆధ్యాత్మికతపై వివరించ బడింది.

### *1. సినారె గారి వ్యక్తిత్వ రూపవర్ణన కవితావిశేషాలు*

"గుండె గుండెలోని బడబాగ్నుల గూడులను తోడి" కవితారాసులు పోసిన సి.నా.రె గారి కలము నిజంగా కవిత! సిరులు పండించిం దనవచ్చు.

**"హలము నడకల నుండి కలంబు బట్టి**
**కవి కులంబుల జేరిన ఘనజనుండు**
**కృషికవలుదయ్యి కవితల కృతులు గూర్చె**
**సిరుల నొలికెడి నవ్వుల శ్రీ సినారె"**

సి.నా.రె ప్రధానంగా వ్యవసాయ కుటుంబం నుండి వచ్చినారని ఈ పద్యం వివరిస్తుంది. అటు భావకవిత్వము, ఇటు అభ్యుదయ కవితా లక్షణాలు కలబోసిన కవిత్వం వారిదని వివరించారు. సభలో కవిత చదివినా, సాహితీ ప్రసంగంచేసినా అదో సమ్మోహనంగా సాగిన శైలి వారిది – ఎవరికీ కట్టు వడనిది.

**"మందహాసంబుతో నెదురైన వారి**
**మనసు వెన్నల చేగను మైమరంపు**
**చల్వ వృక్షాలనీడల నిలుచునట్లు**
**సిరుల నొలికెడి నవ్వుల శ్రీ సినారె"**

సినారె గారి అనుబంధం చల్లని నీడనిచ్చే వృక్షం వంటిది. వారి వేషాధారణ (కట్టు బొట్టు)లో తెల్లని ధోవతి, తెల్లని లాల్చీ కట్టి నడవడం వారికి హుందాతనంగా ఉండేది.

**"కదలు చుండెడి ముత్యంబు కాంతివోలె**
**ధౌత వస్త్రాల నిత్యంబు దరలుచుండు**
**రత్న ప్రభలోలే కవితల నందజేయు**
**సిరుల నొలికెడి నవ్వుల శ్రీ సినారె"**

**"నవ్వు నవ్వుకు నవ్యత్వ నడక లెన్నొ**
**పలుకు పలుకుకు పగడాల పథము లెన్నొ**
**త్రవ్వి పోయును కవితల ధనపురాశి**
**సిరుల నొలికెడి నవ్వుల శ్రీ సినారె"**

కవిత రాయనిరోజు లేదని రాయకపోతే ఏదో వెలితిగా ఉన్నట్లుందని వారు చెప్పుకొనేవారు. వారి ప్రతీ పుట్టినరోజు నాటికి, ఒక కృతిని వెలువరించడం ఆనవాయితీగా చేసుకొన్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పాఠాలు బోధించడం, సినిమాలకు పాటలు రాయడం అదొక గాంభీర్యంగా ఉండేది. హాజరు సంతకం కోసం రిజిస్టర్ క్లాస్‌రూమ్‌కే తేబడేది. సైన్స్, సోషల్ స్టడీస్ విద్యార్థులు కూడా తెలుగు క్లాస్ లో కిక్కిరిసినట్లు కూర్చునే వారంటే వారి సమ్మోహనత్వం ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఆరోజుల్లో ఎన్.టి.ఆర్. సినిమాలకు "నన్ను దోచుకుందువటే వెన్నెల దొరసాని కన్నులలో దాచుకొందు నీవే నా సామి" –(గులేబకావళి సినిమా) వంటి పాటలు ఈనాటికీ గుండెలను పరవశింప జేస్తాయి.

**"పాటలో గుండె పొదిగించి ప్రాణిజేయు**
**గుండె గదిలించు సుకుమార కోయిలోలే**
**రాళ్ళనైనను గరగించు రాతలెన్నో**
**సిరుల నొలికెడు, నవ్వుల శ్రీ సినారె"**

ఈవిధంగా బహుముఖ ప్రతిభాశాలురుగా సినారె గారి వ్యక్తిత్వమును – కవితా లోకమును ఒక శతకంలో తెలిపారు కవి.

### *2. సమాజంలో కవి యొక్క విశిష్టత*

**"రవి కాంచనిచో కవి కాంచును కదా!"** అను ఆర్యోక్తి కవులు పట్ల అక్షరసత్యం. సమాజంలో కవి ఒక భిన్నమైన వ్యక్తి. కవిని

కొలిచే సాధనాలు లేవు. కవి ఈ గది నుండి పుట్టును ఇలా తయారగును అని చెప్పలేం. శిలను చీల్చైనా చెట్లు పుట్టుకొచ్చినట్టు కవులు పుట్టుకువస్తారు. కవులు మనసు మనసుకు ముడి వేసే మంత్రదండం లాంటివారు. సామాన్య మానవుడిని యొసగులేవీ కవిని బంధించలేవు. కవి కట్టుబడడు.

**"కవులు దృష్టిని యెటు దిప్ప కనకమవదె**
**ముత్య మవు చిప్పలో చిన్కు వొలికినట్లు**
**వస్తువేది కళాఖండ మవదె జూడ**
**సిరుల నొలికెడి నవ్వుల శ్రీ సినారె"**

కవిహృదయం ముత్యపుచిప్పవంటిది. పరుసవేది వంటిది. ఏ భావజాలముపై వారి దృష్టి ప్రసరిస్తుందో అది ముత్యమైపోతుంది. అది బంగారమై పోతుంది అని కవి యొక్క విశిష్ట స్థానాన్ని వర్ణించారు కవి.

**"లోకమంతనిదుర జెంద బోవునపుడు**
**కవులు మేల్కొంచి దొంగల గాంచి జెప్పు**
**మేలు కొనుడని ప్రజలకు మేలు జేసీ**
**సిరుల నొలికెడి నవ్వుల శ్రీ సినారె"**

కవి సమాజానికి కాపలాదారుడుగా ఉంటాడు. అందరూ అదమరిచి నిదురించేవేళ వారి దరికి జేరి దొంగలు తస్కరించుటకు ప్రయత్నించగా ప్రజలను మేల్కొలుపుతాడు. తస్మాత్ జాగ్రత్త సమాజంలో ఫలానావారు మిమ్ములను దోచుకోబోతున్నారని హెచ్చరిస్తాడు.

**"లోకబంధంబు దప్పని లొసుగులెన్నొ**
**చుట్టుకొను నేని యగ్ని చుట్టు దార**
**ములను రీతి నిత్యపూణితుదుర్వి కవులె**
**సిరుల నొలికెడి నవ్వుల శ్రీ సినారె"**

కవిని లోకబంధాలు చుట్టలేవు. అగ్నిమీద దారాలు చుట్టుకొన్నట్లే వెంటనే కాలిపోతాయి సామాన్య మైన మానవునివలె దాసోహమయ్యే వాడు కాదు. కవి జ్ఞానంతో నిత్యపూణితుడవుతాడు. వ్యంగ్యం, ఉక్తి వైచిత్రి, నిత్య చైతన్యం కలిగిన కవి గళానికి, కలానికి వెలకట్టలేం అందుకే –

**"కవుల సామ్రాజ్యమే వేరు కథలు వేరు**
**విశ్వసామ్రాట్టులైనుందు విశ్వవీథి**
**కవి నిరంకుశుడగు నిక్కమరసి జూడ**
**సిరుల నొలికెడి నవ్వుల శ్రీ సినారె"**

కవి వాడిపోని పువ్వు. నిష్పక్షపాత, పేద, ధనిక బేధంలేదు కంటికి కనిపించని అద్భుత ప్రపంచాన్ని భావాల రూపును కళ్ళముందు కట్టిస్తాడు. కవి కోయిల కన్నా తీయని కవిత్వం చెప్పగలడు. జవ్వనలు గుండె కలతలు, వెన్నెల రాత్రులు, చీకట్లు ఏవైనా కవిని తప్పించుకు పోలేవు.

**"ప్రణయమే కాదు యగ్నుల పాత్ర విప్పి**
**రెంటి గుణముల సమధీటి యెగయగలుగు**
**కవులు పరకాయములజొచ్చి కవితలల్లు**
**సిరుల నొలికెడి నవ్వుల శ్రీ సినారె"**

కవులు పరకాయ ప్రవేశం (ఇతరుల శరీరంలోకి ప్రవేశించడం) చేస్తారు. కలలను కూడ నిజరూపానికి తెస్తారు. కీలెరిగి వాతలు పెడతారు. భావప్రాపంచిక వీథి యంతు లెరుగుతారు. ఎర్రటి ఎండలే కాదు పంటరాసుల వెనుక పాట్లు తెలిసినవారు. నటరాజ గమనాలు, మంచుకొండలు, అగ్నుల రాజకీయాలు రూపభేదాలు, మతాలు వర్గాలు, పూల పరిమళాలు, యోగివాసాలు, ధర్మాధర్మాలు, మానసిక అంధకారాలు, ఋషులనడకలు, పద్మవ్యూహాల బంధాలు, ప్రళయాలు, పుట్టుచావులు, దైవం ఆత్మధనం వెర్రితనాలు, వాదాలు వేదాలు, విశృంఖల భావ వీథులు, కళా తత్వాలు, కాల హరణాలు, ఎన్నని చెప్పగలం కవి సకలము తెలిసిన వాడు మరి అంటారు.

### *3. లోకంలోని ధర్మాలు, నీతులు – ఆధ్యాత్మికత*

ఈ విధంగా నైతిక విలువలు లోక ధర్మాలు చర్చించినారు. అంద చందాలు, మనశ్శాంతి ఎన్నియున్నా మనుజత్వంతో దైవాన్ని తెలియు కొరకే ఈ జన్మ కలిగింది అంటారు. ఆత్మధనము ముఖ్యమని వెర్రికలహాలు, వెర్రి భాషణలు విడిచి పెట్టి మానవుడు ధర్మజ్ఞానుడు కావాలని, మానవత్వములేని మతము వృథా యని అంటారు.

**"బ్రతుకు దారులు జీవన భాగ్యమంత**
**వయసు గడచిన పిదపను వట్టిదనుచు**
**ఎన్ని యున్నను తావేరు దెలియు కడకు**
**సిరుల నొలికెడి నవ్వుల శ్రీ సినారె"**

ఎన్ని సుఖ భోగాలు ఉన్నా తాను వాటి నుండే వేరుపడి తన దారిని వెతుక్కో వలసిందే నంటూ సినారె గారి జీవిత పరమ తాత్త్విక, విషయాలనెన్నొ ఈ శతకంలో కవి దోమల భిక్షపతి చాలా చక్కగా తెలిపారు.

**సి.నా.రె. శతకము**
**రచన :** డా. దోమల భిక్షపతి
**వెల :** 45/-
**ప్రతులకు :** మనోల్లాస సాహితీ పబ్లిషర్స్, వరంగల్ (అర్బన్)

# అలంపూరు సీమ - సంస్కృతాంధ్ర సాహిత్యాలు

**డా. వీపూరి వేంకటేశ్వర్లు,** కర్నూలు, ఫోన్ : 9885585770

సాహిత్యం అనే నాణేనికి రాసి - వాసి బొమ్మ బొరుసు వంటివి. పరిమాణ, గుణాత్మక విశ్లేషణ చేసినపుడే, ఏ సీమ / ఏ జాతి సాహిత్య చరిత్ర నిర్మాణమైనా సమగ్రమౌతుంది. అప్పుడే ఆ సీమ, ఆ జాతి సాహిత్యానికి ఉండే స్థానాన్ని నిర్ణయించేందుకు వీలవుతుంది. ఈ దృక్కోణంలోనే **డా. ఎస్.ఎం. మహమ్మద్ హుసేన్‌గారు "అలంపూరు సీమ - సంస్కృతాంధ్ర సాహిత్యాలు"** అనే పరిశోధనను ఆచార్య సి. రమణయ్యగారి పర్యవేక్షణలో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి పూర్తిచేసి 1999లో పిహెచ్.డి పట్టాను పొందారు. ఈ సిద్ధాంత గ్రంథం ఇప్పుడు తెలంగాణ వికాస సమితి, హైదరాబాదువారి ప్రచురణతో నవంబర్, 2020లో వెలుగులోకి వచ్చినది. అంతేకాదు ఈ పుస్తకం శిష్ట వ్యవహారిక భాషలో నడుస్తూ, పదో తరగతి స్థాయి వారికి కూడా పఠనయోగ్యంగా ఉంటూ, అవ్యాప్తి - అతివ్యాప్తి లేకుండా ఉండడం మరో విశేషం.

అలంపూరు క్షేత్రానికి ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. ఇది శిల్పకళా సౌందర్యానికి పుట్టినిల్లు. దీనిచుట్టూ అల్లుకుని సంస్కృతాంధ్ర భాషల్లో ఎంతో సాహిత్యం వెలువడింది. మన సంస్కృతీ ఔన్నత్యాన్ని ప్రతిబింబించే ఈ సారస్వతం ఈనాడు విలుప్తత అంచుల్లో పడిపోయింది. దీన్ని సేకరించి విశ్లేషించడం చారిత్రక అవసరం. ఇట్లాంటి ప్రాదేశిక సూక్ష్మ సాహిత్య పరిశీలనలు సాగినప్పుడే సాహిత్యం నిజంగా సమగ్రం కాగలుగుతుంది.

అలంపూరు క్షేత్ర సాహిత్య సమీక్ష మాత్రమే విశ్వవిద్యాలయ స్థాయిలో జరిగింది. ఈ సీమ అంతటికీ సంబంధించిన సాహిత్యంపై విశ్వవిద్యాల స్థాయిలో పరిశోధనలు జరుగులేదు. ఈ నేపథ్యంలోనే రచయిత ఆ లోటును పూరించే దిశలో కృషి చేసిన సిద్ధాంత గ్రంథమిది.

ముఖ్యంగా రచయిత డా. ఎస్.ఎం. మహమ్మద్ హుసేన్‌గారు ఈ సిద్ధాంత గ్రంథ నిర్మాణం కోసం అలంపూరు సీమ అంతటా విస్తృతంగా తిరిగి క్షేత్ర పరిశీలన చేశారు ఎందరో కవులను, కవి వంశీయులను వివరాల కోసం అనేక పర్యాయాలు సంప్రదించారు. ఈ సందర్భంగా కొన్ని సమస్యలను ఎదుర్కోక తప్పలేదు హైదరాబాదు, కాకినాడ, మదరాసు మొదలైన ప్రాంతాలకు ఆకరాల సేకరణ నిమిత్తమై వెళ్ళారు. వ్యయ ప్రయాసలకోర్చి అలంపూరు సీమకు సంబంధించిన 1500 ఏళ్ళ సంస్కృతాంధ్ర సాహిత్యాన్ని సేకరించారు. పరిశోధనా విషయం పరిశోధనా పరిమితికి మించింది. ఇది ఈ పరిశోధన బలహీనతే కాక బలం కూడా! వస్తు విస్తృతి చాలా ఎక్కువ కాబట్టి రచయిత విషయ సేకరణ ఎంతో విస్తారంగా చేయాల్సి వచ్చింది.

ఇక అలంపూరు సీమ కవుల రచనల్లో కొన్ని ముద్రితాలను, మరికొన్ని కాగిత వ్రాత ప్రతులను, ఇంకొన్ని తాళపత్ర గ్రంథాలను ప్రథమ ఆకరాలుగా రచయిత గ్రహించారు. సురవరం ప్రతాపరెడ్డి, గడియారం రామకృష్ణశర్మ, బిరుదురాజు రామరాజు, కేశవపంతుల నరసింహశాస్త్రి, మారేమండ రామారావు, తూమాటి దొణప్ప, హరిశివకుమార్, కట్టా వేంకటేశ్వర శర్మ, ఎస్వీ రామారావు, బి.ఎన్.శాస్త్రి మొదలైన ప్రముఖుల రచనలు/సంపాదకత్వాన వెలువడిన రచనలను ప్రత్యక్షంగా, పరోక్షంగా తన సిద్ధాంత గ్రంథరచనకు మార్గదర్శనం చేసుకున్నారు.

ఈ సిద్ధాంత గ్రంథరచనకు పరిశోదకుని ప్రేరేపించిన వ్యక్తిగత కారణాలు నాలుగు ఉన్నాయి. అవేమంటే

1. పరిశోధకుని జన్మ, నివాస స్థలం కంచుపాడు. ఇది అలంపూరు సీమలో ఉంది.

2. ఈ సీమలో బోరవెల్లి, ప్రాగటూరు, రాజోలి సంస్థానాలు శక్తిమేర సంస్కృతాంధ్ర సాహిత్యపోషణ చేసినాయి. 6వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం దాకా వెలువడిన రచనల్లో కొన్ని కాలక్రమేణ మరుగున పడిపోయినాయి. చెల్లాచెదరుగా గుర్తింపు లేక విలుప్త మౌతున్న వీటిని చూసినప్పుడు స్థానికునిగా పరిశోధకునిలో కలిగిన ఆవేదన ఈ ప్రయత్నానికి పురికొల్పింది.

3. పరిశోధకుడు స్థానికుడు కావడంతో అలంపూరు సీమలోని నాలుగు మండలాల్లోని వివిధ గ్రామాలతో, గ్రామ పెద్దలతో, కవుల వంశీయులతో ప్రత్యక్ష పరిచయముండడం మరో కారణం.

4. 20వ శతాబ్దం పూర్వార్ధంలో సురవరం ప్రతాపరెడ్డిగారిలాగా ఉత్తరార్ధాన అలంపూరు సీమకు ఎంతో సాహిత్య, చారిత్రక సేవ చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి గడియారం రామకృష్ణశర్మగారి ఆశీస్సులు లభించడం ఇంకో కారణం.

ఇక అలంపూరు సీమ కవుల, వారి రచనల వైశిష్ట్యాన్ని అర్థం చేసుకోవడమే ఈ పరిశోదన ప్రధాన ధ్యేయం. కనుక ఈ లక్ష్య సాధన కోసం సిద్ధాంత ప్రణాళికను రచయిత క్రిందివిధంగా రూపకల్పన చేశారు.

మొదటి అధ్యాయంలో ఈ పరిశోధనకు నేపథ్యంగా అలంపూరు సీమను స్థూలంగా పరిచయం చేశారు. భౌగోళిక స్వరూపం, చరిత్ర, సాహిత్య భూమిక అనే మూడు అంశాలుగా విభజించి, అలంపూరు సీమను పరిచయం చేశారు. భౌగోళిక స్వరూపాల్లో ఎల్లలు, పరిసరాలు, ఉనికి అనే విషయాల్ని; వివిధ చారిత్రక యుగాల్లో అలంపూరు ప్రాంత చరిత్రను; సాహిత్య భూమిక క్రింద అలంపూరు సీమ సాహిత్యావిర్భావానికి, వికాసానికి మూలమైన మూడు ప్రధాన కారణాలు నదీతీర ప్రాంతం, క్షేత్రం, ఆలయాలు, సంస్థానాలు ఉన్నందుకు సాహిత్యావిర్భావ వికాసాలకు కారణాలయినాయని చెప్పినారు.

రెండో అధ్యాయాన్ని స్థూలంగా మూడు అంశాలుగా వర్గీకరించి మొదటి భాగంలో సంస్కృత కవులను, రెండో భాగంలో తెలుగు కవులను, మూడవ భాగంలో అలంపూరు సీమ సాహిత్య పోషకుల వివరాలను తెలియజేశారు.

సంస్కృత కవుల పరిచయంలో అలంపూరు సీమ సంస్కృత సాహిత్యం ఆరంభమైన 6వ శతాబ్దం నుండి 20వ శతాబ్దం వరకు అంటే సమకాలీన సంస్కృత రచనల్ని కూడా గ్రహించి శతాబ్దాల ప్రకారం పరిచయం చేశారు. ఇందులో నామమాత్ర కవులను పేర్కొని రచనలు చేసిన కవుల పరిచయాలను తెలియజేశారు.

తర్వాత అలంపూరు సీమ తెలుగు సాహిత్య 17వ శతాబ్దంలో ప్రారంభమయినప్పటి నుండి 20వ శతాబ్దం వరకు స్థూలంగా పరిచయం చేశారు. ఈ సందర్భంలో తెలుగు సంస్కృత కవులను అన్య ప్రాంతీయులైనా, అలంపూరు ప్రాంతాన్ని ప్రశంస చేసినా, అలంపూరు ప్రాంతంలో నివసించిన కవులను కూడా వారి రచనలతో పాటు స్థూలంగా తెలియజేశారు.

చివరలో కవి పోషకుల వివరాలు, 7వ శతాబ్దం నుంచి 20వ శతాబ్దం వరకు ప్రాంతీయ కవి పోషకులనే కాక ప్రాంతీయేతర సాహితీ పోషకుల వివరాలను పేర్కొన్నారు.

మూడో అధ్యాయంలో సంస్కృత సాహిత్య పరామర్శ చేశారు. ఈ అధ్యాయాన్ని మూడు భాగాలుగా చేసి మొదటి భాగంలో రచనల వర్గీకరణ, రెండవ భాగంలో వర్గీకరణ పట్టికలు, మూడవ భాగంలో 13 సంస్కృత రచనల్ని, వాటి ప్రాధాన్యతను బట్టి పరామర్శించారు. అందులో ప్రధాన సంబంధిత గ్రంథాలను కర్తృత్వ చర్చను, రచనాకాల నిర్ణయం, ఇతివృత్తం, కథా సంగ్రహం, ఛందస్సు, విశేషాలు వంటి సంబంధిత ప్రధాన విషయాల క్రింద విభజించుకొని పరామర్శ చేశారు. మిగిలినవాటిని కేవల ప్రశంస, ద్వితీయాకరాల ద్వారా లభ్యమైన రచనల్ని స్థూలంగా పరిచయం చేశారు.

నాలుగో అధ్యాయంలో తెలుగు సాహిత్య అనుశీలనను నాలుగు భాగాలుగా చేసుకొని పరామర్శించారు. ఇందులో మొదటి భాగంలో తెలుగు రచనల వర్గీకరణను, రెండవ భాగంలో కవుల వర్గీకరణ పట్టికలును, మూడవ భాగంలో 9 స్థానికేతర తెలుగు రచనల అనుశీలనను, నాలుగవ భాగంలో 15 స్థానిక రచనల అనుశీలనను రచనా ప్రాధాన్యతను బట్టి చేశారు. ఇందులో విశేష సాహితీ బంధ ప్రక్రియలు, చిత్రకవితా వైదుష్యాలను, విశేష వృత్తాల వంటి సాహిత్య నిర్మాణ దక్షతల్ని కూడా ప్రశంసించారు. చక్ర, చిత్రబంధాల వంటి ప్రక్రియల స్వరూపాన్ని చర్చించి, వాటి చిత్రాలు కూడా పద్యంలో పొందుపరచిన వాటిని చూపించారు. విశేష రచనల చర్చ కొంత విస్తారంగా, అప్రధాన రచనల విషయం సూచనప్రాయంగా తెలియజేశారు.

అయిదో అధ్యాయంలో అలంపూరుసీమ సాహిత్యాన్ని పరిమాణాత్మక, గుణాత్మక అనే ఉపశీర్షికల క్రింద విభజించుకొని విశ్లేషించారు. పరిమాణాత్మక విశ్లేషణలో సంస్కృత, ఆంధ్ర భాషల్లో కాలం–కవులు, కాలం – రచనలు, ప్రాంతం – కవులు, కవులు – రచనలు అనే అంశాల క్రింద విశ్లేషిస్తూ సంస్కృత, ఆంధ్ర రచనలకు బార్‌కర్వ్‌డ్‌పై డయాగ్రమ్‌లతో వాటి స్థితిని విశ్లేషిస్తూ సూచించారు. తర్వాత శతాబ్దాల వారిగా, ప్రాంతాల వారిగా, రచనల వారిగా సంస్కృతాంధ్ర సాహిత్యాల గుణాత్మక విశ్లేషణ చేసి వాటి నిర్ధారణ పట్టికలను ఇచ్చారు.

ఆ తర్వాత సంస్కృత – ఆంధ్ర సాహిత్యాలు రెండింటిని కలిపి రాసి, వాసిని నిర్ణయించి, మొత్తం సంస్కృతాంధ్ర సాహిత్య చరిత్రలో 'అలంపూరు సీమ' రచనల స్థానాన్ని ఇలా నిర్ధారించారు.

**"అలంపూరు సీమలో 13 సంస్కృత రచనలు, తెలుగులో 24 రచనలు పరిశీలిస్తే సంస్కృతంలో ఒకటి, తెలుగులో రెండు విశిష్ట రచనలని స్పష్టమౌతుంది."**

అయలూరి కందళార్యుని అలంకార శిరోభూషణమ్ అనే సంస్కృత ఆలంకారిక గ్రంథం, బిజుల తిమ్మ భూపాలుని అనర్ఘ రాఘవము, చింతలపల్లి ఛాయాపతి రాఘవాభ్యుదయము అనే తెలుగు ప్రబంధాలు తెలుగువారికి అలంపూరుసీమ అందించిన మణిపూసలు.

అంతేకాదు రచయిత చివరలో భావి పరిశోధకులకు అలంపూరు సీమ సాహిత్యాన్ని గురించి 8 రకాల సూచనలు చేసి, "సాహిత్యంలో రాసి కంటే వాసే ప్రధానం. ఇందులో ఎట్లాంటి విప్రతిపత్తి లేదు. అయితే ఎంత రాసి నుంచి, ఎంత వాసి వచ్చిందో తెలుసుకోవడానికి సాహిత్యాన్ని పరిమాణాత్మక దృష్టితో వివేచించాల్సి ఉంది. అందువల్ల ఎన్ని పరిమితులున్నా ఇట్లాంటి శాస్త్రీయమైన ప్రయోగాలు సాహిత్య పరిశోధనలో కూడా చేయక తప్పదు.

ఇక సాహిత్యాన్ని గుణాత్మక దృష్టితో విశ్లేషించి, శ్రేణీ నిర్ధారణ చేసేటప్పుడు అనివార్యంగా కొన్ని వైయక్తిక ఆత్మీయతా ముద్రలు చోటు చేసుకోవడం అత్యంత సహజం. వీటిమీద విమర్శలకు, వాటిమీద ప్రతి విమర్శలకు ఎప్పుడూ వీలు వుండనే ఉంటుంది. ఇది పరిశోధన అపేక్షించే సల్లక్షణం కూడా!" అని పేర్కొనడం గమనార్హం.

సిద్ధాంత గ్రంథం చివరలో ఉపజీవ్య, ఉపయుక్త గ్రంథ, వ్యాస సూచి, అనుబంధం ఇవ్వబడ్డాయి. ప్రతి అధ్యాయం చివరలో కూడా అథస్సూచికలు ఉన్నాయి. అనుబంధంలో జోగులాంబ గద్వాల జిల్లా ప్రశంస పద్యాలు చోటు చేసుకున్నాయి.


మొత్తం మీద ఈ పుస్తకం అలంపూరు సీమ సాహిత్యాన్ని తెలుసుకొన గోరే జిజ్ఞాసువులకు, క్షేత్ర పరిశోధకులకు సప్రమాణికమైన సిద్ధాంత గ్రంథమని చెప్పడంలో ఎలాంటి విప్రతిపత్తి లేదు.

**అలంపూరు సీమ సంస్కృతాంధ్ర సాహిత్యాలు**


**రచన :** డా. ఎస్.ఎం. మహమ్మద్ హుసేన్

**వెల :** 200/-


**ప్రతులకు :** రచయిత, 80–70డి, ఐటిసి ఎదురుగా, కర్నూలు – 518 002. **ఫోన్ :** 99593 63314




# స్వీ'కృతి'





**అడుగులు (కథల సంపుటి)** డా. ఎం. దేవేంద్ర,
**వెల :** 120/-
**ప్రతులకు :** శ్రీచందన మారోజు పబ్లికేషన్స్, 12-5-35/ఎ/9, 4 ఎఫ్ 6, బల్లాడ్ ఎస్టేట్, తార్నాక, సికింద్రాబాద్ - 500 017. మరియు విశాల సాహిత్య అకాడమీ, ఫోన్ : 083319666987





**శ్రీరాఘవ శతకం,**
కర్నాటి రఘురాములుగౌడ్
**వెల :** 30/-
**ప్రతులకు :** రచయిత, గ్రా. గుండ్లగుంటపల్లి, ఊర్కొండ, నాగర్ కర్నూల్ జిల్లా - 509320
ఫోన్ : 6281519576




**ధార,** (సాహితీ వ్యాసాలు)
ఆచార్య బన్న అయిలయ్య
**వెల :** 100/-
**ప్రతులకు :** శ్రీమతి కె.విజయ, ఇం.నెం. 2-7-1261/1, రాజగృహం, విజయపాల్ కాలనీ, వడ్డేపల్లి, వరంగల్ - 506 370. **ఫోన్ :** 9618340431




**జరీపూల నానీలు,** వడ్డేపల్లి సంధ్య
**వెల :** 75/-
**ప్రతులకు :** బాలేశ్ చిప్ప, 10-1-17/జి, శ్రీహరి నగర్, రామ్ నగర్, కరీంనగర్ - 505 001. ఫోన్ : 98480 82822




**సర్వజ్ఞ త్రిపదలు,** (కన్నడ మూల సహితము)
యన్.యం.రేవణ సిద్ధాంతి
**వెల :** 80/-
**ప్రతులకు :** శ్రీ శారదా జ్యోతిషాలయము, శ్రీ బసవేశ్వర స్వామి దేవాలయం, బైరుమల్ వీధి, నంద్యాల, కర్నూలు జిల్లా - 518501

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

### మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.**

**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

## కార్బన్ వీధుల్లో...

చల్లని సాయంత్రం
సరదా కబుర్లు
రంగులద్దిన కాలం
రమణీయ దృశ్యకావ్యం

గుండె గోడు వింటూ
విందు చేసే నయగార జలపాతం
అలసిన మనసుకు ఓదార్పు
బుజ్జగించే వెన్నెలే దారి

మాయా ప్రపంచపు
కంచుపాత్రలో దీపం
వెలిగించిన ఇల్లాలు
నగ్నత్వమే ముఖ్యమంటూ

సహజత్వం ఉట్టిపడి
ఉరిశిక్ష అనుభవిస్తుంది
నిద్రపోయే లోకం నశించదు
నవాంశచక్రమ గద అంకుశం పాశం

నన్ను గెలిచిన
ఆత్మాభిమానం అమ్మిన పౌరుషం
దుఃఖం మారింది మంజీర నాదంతోనే
సుఖం పక్కదారి పట్టింది ఉదయమై

కార్బన్ వీధుల్లో
ఊరేగుతున్న బాల సంతదు
బరిలో ఆదాల బంధుత్వం
ఐతుంది సమాజపు సంకెళ్లు

మూట కట్టి పడేస్తుంది నేరమని
జీవితపు కాలగమనంలో
కాలి బూడిదైన యౌవనం
కల్తీ ఐన హృదయాన్ని తవ్వి

ఉలి తాకిన శిల్పం
కలత చెందిన నదిని దాటి
విరివిగా మర్యాదలు కట్న కానుకలు
అదరహో అనేదే లేదులే

నవ వసంతం
శిశిరం దిశగా పయనిస్తున్న
కమలం చుట్టూరా చెక్కిన శిల్పం
ప్రేమ హంసగీతం

శిశిర ఋతువు సిగ్గుపడుతుంది
చిట్టిగుండె రాగమైనప్పుడు
కొమ్మరెమ్మల సన్నాయి
రాగం తీసి కోయిలా నృత్యం

**అశోక్ దుర్గం**
ఆసిఫాబాద్, ఫోన్ : 8106709871

## నిన్ను నిన్నుగానే చూస్తాం

చేతనత్వంతో
నువ్వు చరిత్రనంతా పొక్కిలి జేసి
అచేతనత్వంచే
నాచేత చదును జేయిస్తివి
కులాల కల్లాపి జల్లించి
కట్టుకథల ముగ్గులేపిస్తివి
మితి మీరిన అహంతో
తెలివి తక్కువంటివి
సామర్థ్యం లేదంటివి
మనిషిగానే చూడవైతివి
కుటిల బుద్ధితో
ఎన్ని కుట్రలు చేస్తుంటివి
వక్రమార్గంలో
ఎంతటి వంచన చేస్తుంటివి
తరతరాల ఈ ఘోరాల భారం
తలకెత్తుకుంటే
మా నడక నెమ్మదిస్తుంది
తలకెత్తించుకుంటే
మా బుద్ధి మందగిస్తుంది
అందుకే.... మేమిప్పుడు
నిన్ను నిన్నుగానే చూస్తాం
ఎందుకంటే
మా నడవడికిప్పుడు రాజ్యాధికారం

**జినుకుల వెంకటేశ్**
కరీంనగర్, ఫోన్ : 9652092120

## ఏమివ్వగలను?

తన ప్రాణాన్ని పణంగా పెట్టి
జన్మనిచ్చిన అమ్మకు ఏమివ్వగలను?
ఎలా ఋణం తీర్చుకోగలను?
తన భుజస్కంధాల మీద మోసి
బంగారు భవిష్యత్తు అందించిన
నాన్నకు నేనేమి ఇవ్వగలను?
విద్యా సౌరభాలను అందించి
మూర్తీభవించిన వ్యక్తిగా తీర్చిదిద్దిన
గురువుల ఋణం ఎలా తీర్చుకోగలను?
వివాహ బంధంతో ముడిపడి
ఏడడుగుల బంధానికి నిర్వచనంలా ఉండే
నా జీవిత భాగస్వామికి ఏమివ్వగలను?
ప్రాణాలు రెండైనా శ్వాస ఒకటిగా ఉండి
అన్నీ తానై నన్ను నీడలా కాపాడే
నా స్నేహితురాలికి ఏమివ్వగలను?
ఒడిదుడుకులను, కష్టసుఖాలను, నైతిక విలువలను
నేర్పించిన సమాజానికి ఏమి ఇవ్వగలను?
చేసిన మేలును జీవితాంతం గుర్తు
పెట్టుకోవడం వారికి ఋణపడడం తప్పా!
నేనేమివ్వగలను? నేనేమివ్వగలను?



**అనిత దావాత్**
హైదరాబాద్ ఫోన్ : 9394221927